

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



ఆదివారం | 7-4-2024 | పేజీలు: 14 + 48 పేజీల ఉగాది అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 8 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: త్రయోదశి ఉ. 6.55 తదుపరి చతుర్దశి తె. 3.21 వరకు; నక్షత్రం: పూర్వాభాద్ర మ. 12.59 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: రా.9.28-10.53; దుర్ముహూర్తం: సా.4.48-5.37; అమృతఘడియలు: తె.ఉ.7.17 వరకు తె. 5.58 మొదలు; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.09; సూర్యాస్తమయం: 6.27 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇక్కడ కేసీఆర్.. అక్కడ మోదీ!

స్కాంలు.. బలవంతపు వసూళ్లు.. ట్యాపింగ్‌లు

- పైసలు ఇచ్చుకోండి.. దందా చేసుకోండి నినాదం
- ప్రపంచంలోనే అతిపెద్ద స్కాం ఎలక్టోరల్ బాండ్లు
- తెలంగాణలో బీజేపీ బీ టీమ్‌ను మట్టికరిపించాం
- లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీనీ ఓడిస్తాం.. గెలుపు మాదే
- మ్యానిఫెస్టో విప్లవాత్మకం.. దేశ ముఖచిత్రం మారిపోతుంది
- చిన్న పిల్లాడు పిలిచినా తక్షణం తెలంగాణలో వాలిపోతా
- ఇక్కడి ప్రజలతో నాది కుటుంబ, ఆత్మీయ బంధం
- జీవితాంతం మీ వెంటే: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- తుక్కుగూడ జనజాతర సభలో పార్టీ మ్యానిఫెస్టో విడుదల
- మేడిన్ చైనాను మేడిన్ తెలంగాణ వెనక్కినెట్టాలని ఆకాంక్ష

చర్లపల్లి జైల్లో.. చిప్పకూడు తినిపిస్తా

జైల్లోనే డబుల్ ఇల్లు కట్టిస్తా.. ఏదంటే అది మాట్లాడితే ఊరుకోం

కేసీఆర్.. మా కార్యకర్తలు తలచుకుంటే నీ డ్రాయర్ కూడా మిగలదు

గతంలో మా ప్రభుత్వంలో 25 లక్షల ఇళ్లు.. మీరు ఎన్ని కట్టారు?

గుజరాత్ మోడల్‌పై వైబ్రెంట్ తెలంగాణ ఆధిపత్యం చూపిస్తుంది

నమో అంటే నమ్మించి మోసం.. ఉత్తరాది, దక్షిణాది చిచ్చుకు కుట్ర

మా పాలన నచ్చితే 14 సీట్లివ్వండి.. తుక్కుగూడ సభలో రేవంత్‌రెడ్డి




జన జాతరా..!? జన సంద్రమా..!? సభలో.. బయటా.. ఎక్కడ చూసినా జనమే! సభా ప్రాంగణం కిక్కిరిసిపోవడంతో రోడ్లపైనా జనమే! మండే ఎండలను కూడా లెక్క చేయకుండా తుక్కుగూడకు కాంగ్రెస్ కార్యకర్తలు పోటెత్తారు! అగ్ర నేత రాహుల్ గాంధీ హాజరైన జన జాతర సభకు లక్షలాదిగా హాజరయ్యారు. తుక్కుగూడ కాంగ్రెస్ సభలో అంచనాలకు మించి హాజరైన జన సందోహంలో ఓ భాగమిది!!

13



మ్యానిఫెస్టో విడుదల చేస్తున్న రాహుల్, సీఎం రేవంత్





ప్రముఖ హైదరాబాద్ సర్జన్ రఘురామ్‌కు ఏఎస్ఏ గౌరవ ఫెలోషిప్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: హైదరాబాద్‌లోని కిమ్స్-ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ రఘురామ్ పిల్లరిశెట్టికి మరో గౌరవం దక్కింది. అమెరికన్ సర్జికల్ అసోసియేషన్ (ఏఎస్ఏ) ఆయనకు వాషింగ్టన్ డీసీలో గౌరవ ఫెలోషిప్‌ను ప్రదానం చేసింది. ఒక విదేశీ సర్జన్‌కు ఏఎస్ఏ అందించే అత్యుత్తమ గుర్తింపు ఇది. అమెరికాకు చెందిన ప్రతిష్ఠాత్మక సర్జికల్ సంస్థ 144ఏళ్ల చరిత్రలో దక్షిణాసియా నుంచి ఈ అత్యున్నత గౌరవాన్ని పొందిన మూడో సర్జన్ రఘురామ్‌కావడం గమనార్హం. భారత దేశంలో రొమ్ము క్యాన్సర్ సంరక్షణలో వినూత్న కార్యక్రమాల ద్వారా విప్లవాత్మక మార్పులు తీసుకురావడంలో డాక్టర్ రఘురామ్ అగ్రగామిగా ఉన్నారని ఏఎస్ఏ అధ్యక్షుడు ప్రొఫెసర్ స్టీవెన్ స్టెయిన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. పద్మశ్రీ పురస్కారం, డాక్టర్ బీసీ రాయ్ అవార్డు గ్రహీత అయిన డాక్టర్ రఘురామ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ గౌరవాన్ని తన మాతృభూమి భారత్‌కు, కుటుంబానికి, వైద్యులకు అంకితమిస్తున్నట్టు పేర్కొన్నారు.

అగ్నికుల్ రాకెట్ ప్రయోగం వాయిదా

సూళ్లూరుపేట, ఏప్రిల్ 6: అగ్నికుల్ రాకెట్ ప్రయోగం వాయిదా పడింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి శనివారం ఉదయం ప్రయోగించాల్సిన రాకెట్‌ను గాలుల తీవ్రత అధికంగా ఉండడంతో వాయిదా వేశారు. షార్‌లోని ఏఎస్ఎల్వీ కాంప్లెక్స్‌లోని ప్రైవేట్ ప్రయోగ వేదిక నుంచి అగ్నికుల్ రాకెట్‌ను శనివారం ఉదయం 6 గంటలకు ప్రయోగించేందుకు ఏర్పాట్లుచేశారు. శుక్రవారం రాత్రి 12 గంటలకు అంటే ప్రయోగానికి 6 గంటల ముందు కౌంట్‌డౌన్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేశారు. సాంకేతిక లోపం తలెత్తడంతో ప్రయోగాన్ని ఉదయం 7.45 గంటలకు వాయిదా వేశారు. తీరంలో గాలుల తీవ్రత అధికంగా ఉండడం, చిన్న రాకెట్ కావడంతో గాలుల తీవ్రత ప్రభావం చూపే అవకాశం ఉండటంతో ప్రయోగం వాయిదా పడింది.

సహజీవనం చేసినా భరణం ఇవ్వాల్సిందే

భోపాల్, ఏప్రిల్ 6: మహిళల హక్కులను గుర్తించే దిశగా మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. చట్టబద్ధంగా వివాహం చేసుకోనప్పటికీ సహజీవనం చేసే మహిళ కూడా భరణానికి అర్హురాలేనని తెలిపింది. సహజీవనం చేసిన జంట విడిపోతే ఆ మహిళకు పురుషుడు భరణం చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. ఓ జంట చాలా కాలం పాటు సహజీవనం చేసింది. భార్యాభర్తలుగానే వారు చలామణి అయ్యారు. వారికి బిడ్డ కూడా జన్మించాడు. అనంతరం వారు విడిపోయారు. దాంతో తనకు భరణం చెల్లించేలా ఆదేశించాలని కోరుతూ ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వాస్తవాలను గమనించిన ట్రయల్ కోర్టు నెలకు రూ.1500 భరణం చెల్లించాలని ఆదేశించింది. దీనిని సవాలు చేస్తూ ఆయన హైకోర్టులో అప్పీలు చేశాడు. హైకోర్టు కూడా కిందికోర్టు తీర్పును సమర్థించింది.

ఢిల్లీలో చైల్డ్ ట్రాఫికింగ్ ముఠా గుట్టు రట్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: ఢిల్లీలో బాలల అక్రమ రవాణా(చైల్డ్ ట్రాఫికింగ్)కు పాల్పడుతున్న ముఠా గుట్టు రట్టు అయింది. చిన్నారులను అక్రమంగా విక్రయిస్తున్న ఏడుగురు ముఠా సభ్యులను సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. చిన్నారులను విక్రయిస్తున్నారన్న సమాచారంతో సీబీఐ అధికారులు శుక్రవారం సాయంత్రం ఢిల్లీ, హరియాణాలోని పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ముఠా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న రోజున్నర, 15 రోజుల వయస్సు గల ఇద్దరు శిశువులను స్వాధీనం చేసుకున్నారు.

బాలునికి శంఖు చక్రాల ముద్రలు

- జీయర్ ట్రస్టుపై అమెరికాలో దావా

హ్యూస్టన్, ఏప్రిల్ 6: తండ్రి అనుమతి లేకుండా 11 ఏళ్ల బాలుని రెండు భుజాలపై శంఖుచక్ర ముద్రలు వేయించిన జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్టుపై అమెరికాలో దావా వేశారు. టెక్సాస్ రాష్ట్రంలోని సుగర్‌ల్యాండ్‌లో ఆ ట్రస్టు నిర్వహించే అష్టలక్ష్మీ దేవాలయంలో గత ఏడాది ఆగస్టులో జరిగిన ఓ కార్యక్రమంలో ఆ బాలునికి కాల్చిన లోహంతో ఈ ముద్రలు వేశారు. ఈ కారణంగా ఆ బాలునికి గాయాలు కావడంతో తీవ్రంగా బాధపడ్డాడని, ఇందుకు పది లక్షల డాలర్లు (సుమారు రూ.80 లక్షలు) పరిహారంగా చెల్లించాలని డిమాండు చేస్తూ అతని తండ్రి విజయ్ చెరువు ఈ దావా వేశారు. ఆయన మాజీ భార్య ఈ బాలుడ్ని ఆలయానికి తీసుకువెళ్లి ఈ ముద్రలు వేయించింది. తండ్రి అనుమతి లేకుండా పిల్లలకు టాటులు, ఇలాంటి ముద్రలు వేయించడాన్ని టెక్సాస్ రాష్ట్రంలో నేరంగా పరిగణిస్తారు.

టిప్పర్ మొరం మీద పడి.. ముగ్గురు పిల్లల సజీవ సమాధి

- కరీంనగర్ జిల్లా బోర్నపల్లిలో విషాదం..
- దమ్మపేట మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం
- తల్లి సహా ఇద్దరు బిడ్డలను బలి తీసుకున్న లారీ



విజయ్, వర్ష, సింధూజ

హుజూరాబాద్/దమ్మపేట, ఏప్రిల్ 6: ఎదురుగా టిప్పర్ వస్తోందని రోడ్డు పక్కన ఆగడమే ఆ ముగ్గురు పిల్లలు చేసిన పాపమైంది. రాత్రివేళ నిర్లక్ష్యంతో వేగంగా టిప్పర్‌ను నడుపుకుంటూ వచ్చిన డ్రైవర్ వాళ్లను చూసి సడెన్‌గా బ్రేక్ వేశాడు. దీంతో టిప్పర్ అదుపు తప్పి బోల్తాపడింది. అందులోని మొరం(మట్టి) అంతా ఆ ముగ్గురిపై పడింది. చిన్నారులు అందులో కూరుకుపోయి సజీవ సమాధి అయ్యారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని బోర్నపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి ఈ దారుణం జరిగింది. బోర్నపల్లి శివారులో శుక్రవారం పెద్దమ్మతల్లి బోనాల పండుగ జరిగింది. గ్రామానికి చెందిన అన్నాచెల్లెళ్లు గంట విజయ్ (17), గంట వర్ష (15), వాళ్ల బంధువు గంట సింధూజ(18) ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. అర్ధరాత్రి కావడంతో నిద్ర వస్తుందని తల్లిదండ్రులకు చెప్పి ముగ్గురు కలిసి బైక్‌పై ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యంలో ఎలబోతారం నుంచి ఎదురుగా వస్తున్న మట్టి టిప్పర్‌ను చూసి.. మూలమలుపు వద్ద బైక్‌ను ఆపి నిలుచున్నారు. అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన టిప్పర్ డ్రైవర్ వారిని చూసి సడన్ బ్రేక్ వేయడంతో అదుపు తప్పి టిప్పర్ బోల్తాపడింది. టిప్పర్‌లో ఉన్న మట్టి పిల్లల మీద పడటంతో ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు. స్థానికులు జేసీబీ సహాయంతో మృతదేహాలను వెలికితీసి హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విజయ్ ఇంటర్, వర్ష 10వ తరగతి, సింధుజా డిగ్రీ చదువుతున్నారు. విషయం తెలుసుకున్న హుజూరాబాద్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బంధువుల పెళ్లికి వచ్చి వెళ్తుండగా..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మందలపల్లి సమీపంలో ప్రధాన రహదారిపై శనివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో తల్లి చీపు లక్ష్మి (28), పిల్లలు శరణ్యశ్రీ (8), షణ్మిక (6) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. తండ్రి బాలకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా ఏకొండూరు మండలం చీమలపాడుకు చెందిన చీమల బాలకృష్ణ కుటుంబం వారం రోజుల క్రితమే కుటుంబ పోషణ కోసం అశ్వారావుపేట సమీపంలోని ఒక కోళ్ల ఫారంలో పనికి కుదిరింది. అయితే శనివారం తన భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి విస్సన్నపేట మండలం చంద్రుపట్లలో బంధువుల పెళ్లికి హాజరయ్యాడు. బైక్‌పై తిరిగి అశ్వారావుపేట వస్తుండగా మందలపల్లి సమీపంలో గుర్తు తెలియని కారు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో వారు ద్విచక్రవాహనంతో సహా కిందపడిపోయారు. అదే సమయంలో సత్తుపల్లి వైపు నుంచి అశ్వారావుపేట వైపు వెళుతున్న లారీ.. రోడ్డుపై పడ్డ వారి పైనుంచి దూసుకెళ్లింది. దీంతో లక్ష్మి, శరణ్య, షణ్మిక అక్కడికక్కడే మృతి చెందారు. తండ్రి బాలకృష్ణ రోడ్డు పక్కన పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు.

సోషల్ రిలేషన్.. పార్టీ ప్రమోషన్



కమియా జానీతో రాహుల్‌గాంధీ (ఫైల్)

యూట్యూబర్లు, సోషల్ మీడియా దిగ్గజాలతో రాజకీయ నేతల ప్రత్యేక సంబంధాలు

- పార్టీలను ప్రమోట్ చేసే వ్యూహాలు

సార్వత్రిక ఎన్నికలకు ముందు అన్ని పార్టీలూ అందరినీ చేరువ చేసుకుంటాయి. ప్రతి ఒక్కరినీ తమ వారిగానే భావిస్తాయి. ఇప్పుడు ఈ జాబితాలో సమాజాన్ని ప్రభావితం చేసే యూట్యూబర్లు, ప్రముఖులు, ఆవిష్కర్తలు, సృష్టికర్తలు వంటివారు చేరిపోయారు. బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీ వరకు అన్ని పార్టీలదీ ఇప్పుడు ఆయా ప్రభావ వంతమైన వ్యక్తులను తమవైపు తిప్పుకోవడమే పనిగా పెట్టుకున్నాయి. నాయకుల విషయానికి వస్తే ప్రధాని మోదీ నుంచి విపక్ష నాయకుడు, ఎంపీ రాహుల్ గాంధీ వరకు ఈ ప్రభావవంతమైన వ్యక్తులను అక్కున చేర్చుకునేందుకు ఉత్సాహం చూపించారు. గత నెల మార్చిలో ఢిల్లీలోని భారత మండపంలో నిర్వహించిన 'నేషనల్ క్రియేటర్స్ అవార్డ్స్' ప్రదానోత్సవంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "మరికొద్ది రోజుల్లోనే దేశంలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ కార్యక్రమాన్ని దానికోసమే నిర్వహిస్తున్నామని భావించొద్దు" అని అన్నారు. ఈ సమయంలో సభలో ఉన్న వారు "అబ్కీ బార్, 400 పార్" అంటూ బిగ్గరగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఇక, అవార్డులకు ఎంపికైన విభాగాల్లో బెస్ట్ డిస్రప్టర్ ఆఫ్ ది ఇయర్ ఒకటి. ఈ అవార్డును రణ్‌వీర్ అల్లాబాదియాకు ప్రదానం చేశారు. రణ్‌వీర్ 'బీర్ బైసెప్స్' ద్వారా ప్రాచుర్యం పొందారు. ఇక, స్వచ్ఛత అంబాసిడర్ అవార్డును మల్హార్ కలాంబేకు అందించారు. అదేవిధంగా 'బెస్ట్ క్రియేటర్ ఇన్ ఫుడ్' విభాగంలో కవితా సింగ్‌కు అవార్డును ప్రదానం చేశారు. 'కవితాస్ కిచెన్' ద్వారా కవితా సింగ్ ప్రాచుర్యం పొందారు. బెస్ట్ ట్రావెల్ క్రియేటర్ అవార్డును కమియా జానీకి అందించారు. 'కర్లీ టేల్స్' ద్వారా జానీ ప్రాచుర్యం పొందారు. ఇక, బెస్ట్ హెల్త్, ఫిట్‌నెస్ క్రియేటర్ అవార్డును అంకిత్ బైయాన్‌పురియాకు అందించారు. ఇలా.. సమాజాన్ని ప్రభావితం చేసేవారిని ఎంపిక చేసి జాతీయ అవార్డులు అందించడం ఇదే తొలిసారి. తద్వారా బీజేపీ ప్రభుత్వం కీలకమైన లోక్‌సభ ఎన్నికల వేళ వారిని మచ్చిక చేసుకునే ప్రయత్నం చేసిందనే విశ్లేషణలు ఉన్నాయి.



అంకిత్ బైయాన్‌పురితో మోదీ(ఫైల్)

ప్రధానితో బంధం

సోషల్ మీడియా ద్వారా ప్రజలను ప్రభావితం చేసే వారితో ప్రధాని మోదీ వ్యక్తిగత అనుబంధం పెంచుకున్నారు. సోషల్ మీడియా ఫిట్‌నెస్ ఇన్‌ఫ్లుయెన్సర్, హరియాణాకు చెందిన అంకిత్ బైయాన్‌పురియాతో 2023, అక్టోబరు 2న ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఆ సమయంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 'శ్రమదాన్'లో అంకిత్‌తో కలిసి మోదీ పాల్గొన్నారు. దీనికి సంబంధించిన వీడియోను ప్రధాని తన 'ఎక్స్'(ట్విట్టర్)లో పోస్టు చేశారు. దీనిని లక్షల మంది సోషల్ మీడియా ఫాలోవర్లు వీక్షించడం గమనార్హం.

భారీ వ్యూహమే: బీజేపీ నేత

దేశంలో తొలిసారి నేషనల్ క్రియేటర్స్ అవార్డులను ప్రదానం చేయడం వెనుక భారీ వ్యూహమే ఉందని మహారాష్ట్ర బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుడు దేవాంగ్ దవే అన్నారు. సోషల్ మీడియాను ప్రభావితం చేసే వ్యక్తులు ప్రజల అభిప్రాయాలను కూడా మార్చగలరని ఆయన అభిప్రాయపడ్డారు. వీరి కథనాలు తమ ప్రచారంలో కీలకంగా మారనున్నాయని వెల్లడించారు. ఇవి 2024 ఎన్నికల్లో ముఖ్య పాత్ర పోషించనున్నాయని ఆయన వెల్లడించారు. "సంప్రదాయ మీడియా కూడా కొన్ని కొన్నిసార్లు ప్రజలను ప్రభావితం చేయలేకపోవచ్చు. కానీ, సామాజిక మాధ్యమాల్లో దూకుడుగా ఉండే వారు.. రాజకీయ సందేశాల ద్వారా ప్రజలను ఖచ్చితంగా ప్రభావితం చేసే అవకాశం ఉంది" అని అన్నారు.

కాంగ్రెస్ కూడా..

సోషల్ మీడియాలో ప్రభావవంతమైన వ్యక్తులతో అనుబంధం పెంచుకునే విషయంలో కాంగ్రెస్ కూడా ముందుంది. రాహుల్ గాంధీ.. తన భారత్ జోడో యాత్ర సందర్భంగా ప్రముఖ యూట్యూబర్ కామియా జానీకి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇవ్వడం వెనుక ప్రధాన ఉద్దేశం ఇదే. అదేవిధంగా తమిళనాడుకు చెందిన 'విలేజ్ కుకింగ్ చానెల్' యూట్యూబ్ చానెల్ ప్రతినిధులతోనూ రాహుల్‌గాంధీ భేటీ అయ్యారు. వారితో కలిసి వంట చేశారు. కలిసి భోజనం కూడా చేశారు. ఇవన్నీ సోషల్ మీడియాలో జోరుగా వైరల్ కావడంతోపాటు వీక్షకులను ఆకట్టుకున్నాయి.

– సెంట్రల్ డెస్క్

బెంగాల్‌లో ఎన్ఐఏ వాహనంపై దాడి

- అర్ధరాత్రి సమయంలో ఎందుకెళ్లారు?: మమత



కోల్‌కతా, ఏప్రిల్ 6: పశ్చిమ బెంగాల్‌లోని పుర్బా మేదినీపూర్ జిల్లాలో ఉద్రిక్తత నెలకొంది. భూపతినగర్ ప్రాంతంలో ఎన్ఐఏ అధికారులు ప్రయాణిస్తున్న వాహనంపై గ్రామస్తులు శనివారం దాడి చేశారు. 2022 బాంబు పేలుడు కేసుకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన ఎన్ఐఏ బృందం తిరిగి కోల్‌కతాకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. స్థానికులు రాళ్లు రువ్వడంతో వాహనం అద్దాలు ధ్వంసమయ్యాయని, ఒక అధికారి గాయపడినట్లు ఎన్ఐఏ బృందం ఫిర్యాదు చేసినట్లు సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు. 2022 డిసెంబరు 3న భూపతినగర్‌లోని ఓ ఇంట్లో పేలుడు సంభవించి ముగ్గురు మృతిచెందారు. ఈ కేసు దర్యాప్తును ఎన్ఐఏకు అప్పగించారు. కాగా, ఉత్తర 24పరగణాల్లోని సందేశ్‌ఖాలీ ప్రాంతంలో రేషన్ కుంభకోణానికి సంబంధించి సోదాల కోసం వెళ్లిన ఈడీ అధికారులపై కూడా ఈ ఏడాది జనవరి 5న ఇలాగే దాడి జరిగింది. దాడి ఘటనపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. 'ఎన్ఐఏ అధికారులు సోదాల కోసం అర్ధరాత్రి సమయంలో ఎందుకెళ్లారు? దీనికోసం వారు పోలీసుల అనుమతి తీసుకున్నారా?' అని నిలదీశారు. బీజేపీకి మద్దతుగా ఎన్ఐఏ వ్యవహరిస్తోందని ఆరోపించారు. భూపతినగర్ వాసులపై తొలుత దాడిచేసింది ఎన్ఐఏ అధికారులేనని చెప్పారు. తమపై దాడి చేస్తుంటే మహిళలు చేతులు ముడుచుకొని కూర్చోవాలా? అని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా పనిచేయాలని మమత విజ్ఞప్తి చేశారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
రామగుండం	42.0	26.0
నిజామాబాద్	41.7	27.4
నల్లగొండ	41.5	25.0
ఆదిలాబాద్	41.3	23.7

ఇజ్రాయెల్‌పై దాడి చేస్తాం

- మీరు మాత్రం దూరంగా ఉండాలి
- అమెరికాను కోరుతూ ఇరాన్ లేఖ

వాషింగ్టన్, ఏప్రిల్ 6: ఇజ్రాయెల్‌పై ఏ క్షణంలోనైనా దాడి చేస్తామని ఇరాన్ ప్రకటించింది. ఈ మేరకు అమెరికాకు లేఖ రాసినట్లు.. ఇజ్రాయెల్‌కు దూరంగా ఉండాలని కోరినట్లు ఇరాన్ ఉన్నతాధికారి మహమ్మద్ జంషీదీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. సిరియా రాజధాని డమాస్కస్‌లో ఇటీవల ఇజ్రాయెల్ జరిపిన దాడిలో.. తమ కాన్సులేట్ భవనంలో ఉన్న ఏడుగురు అధికారులు మృతిచెందారని ఇరాన్ ఆరోపించిన విషయం తెలిసిందే..! దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చరిస్తూ వచ్చింది. తాజాగా ఇజ్రాయెల్‌పై యుద్ధానికి సిద్ధమనే సంకేతాన్ని పంపింది. "మీరు(అమెరికా) ఇజ్రాయెల్‌కు దూరంగా ఉండాలి. ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహూ ఉచ్చులో పడొద్దు. మేం చేసే ప్రతీకారదాడిలో.. ఇజ్రాయెల్ చేసే ప్రతిదాడిలో మీరు పాల్గొనకూడదు. అలా అయితేనే.. మేము అమెరికా సేనలపై దాడి చేయం" అని అమెరికాకు స్పష్టం చేసినట్లు జంషీది ఎక్స్‌లో తెలిపారు. పశ్చిమాసియాలోని తమ స్థావరాలను టార్గెట్‌గా చేసుకోకూడదని అమెరికా అడిగినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే.. ఈ పోస్ట్‌పై అమెరికా స్పందించలేదు. ఇరాన్ హెచ్చరికల నేపథ్యంలో పశ్చిమాసియాపై యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి.

కాపురం చేసుకుంటుంటే మళ్లీ రేప్ కేసు ఎందుకు?

కేసును కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: పర్యవసానాలపై పూర్తి అవగాహన కలిగిన మహిళ పురుషునితో సంబంధం పెట్టుకొని అనంతరం మోసపోయానంటూ చెప్పలేదని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. పెళ్లి చేసుకుంటానంటూ తప్పుడు హామీ ఇచ్చి మోసగించినట్టు కచ్చితమైన ఆధారాలు ఉంటే తప్ప దీన్ని నేరంగా పరిగణించలేమని తెలిపింది. మాయమాటలను నమ్మి అంగీకరించానంటూ ఆ మహిళ చెప్పలేదని పేర్కొంది. తనను పెళ్లి చేసుకుంటానంటూ శారీరక సంబంధం పెట్టుకొని, ఆ తరువాత నిరాకరించాడంటూ ఓ పురుషునిపై ఓ మహిళ రేప్ కేసు పెట్టింది. ఆ తరువాత సంప్రదింపులు జరగడంతో ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. ఈ విషయాన్ని కోర్టు దృష్టికి తెచ్చారు. దీనిని పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ అనూప్ కుమార్ మెండిరట్ట ఇద్దరు వివాహం చేసుకొని ఆనందంగా ఉన్నందున విచారణ అవసరం లేదంటూ కేసును కొట్టివేశారు. అయితే ఇలాంటి కేసులకు సంబంధించి నేరారోపణలు చేసే విషయమై స్పష్టత చేశారు. అన్నీ తెలిసే ఆమె అతనితో సంబంధం పెట్టుకుందని న్యాయమూర్తి తెలిపారు. పెళ్లి చేసుకుంటానన్న హామీతోనే ఆ పురుషుడు కూడా సంబంధం పెట్టుకున్నాడని, కానీ కుటుంబసభ్యుల ఒత్తిడి మేరకు తరువాత నిరాకరించాడని గుర్తు చేశారు. మోసం చేయాలన్న దురుద్దేశంతో కాకుండా తదనంతర పరిస్థితుల కారణంగా పెళ్లి చేసుకోలేనని చెప్పాడని అభిప్రాయపడ్డారు. ఇద్దరు పెళ్లి చేసుకొని సంతోషంగా జీవితం గడుపుతున్నందున రేప్ కేసును కొనసాగించాల్సిన అవసరం లేదని తెలిపారు. కేసుపై విచారణ జరిపితే చట్టాన్ని దుర్వినియోగం చేసినట్టు అవుతుందని పేర్కొంటూ దానిని కొట్టివేశారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోలో ముస్లిం లీగ్ ముద్ర

అవినీతి సొమ్మును కాపాడుకోడానికే ఆ పార్టీ ఆరాటం

- మూడోసారి ప్రభుత్వంలో అవినీతిపై అతిపెద్ద నిర్ణయం: ప్రధాని మోదీ



ఉత్తరప్రదేశ్‌లో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ముస్లిం లీగ్ ముద్ర కనిపిస్తోందని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. ఆ మేనిఫెస్టోలోని మిగిలిన భాగాన్ని వామపక్షాల ఆలోచనలు ఆక్రమించాయని విమర్శించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను 'అబద్ధాల పుట్ట'గా ఆయన అభివర్ణించారు. అందులోని ప్రతి పేజీ లక్ష్యం భారతదేశాన్ని ముక్కలు చేయడమేనని ఆరోపించారు. తొలివిడతలో ఈనెల 19న ఎన్నికలు జరుగనున్న ఉత్తరప్రదేశ్‌లోని సహరన్‌పూర్, రాజస్థాన్‌లోని అజ్మేర్ నియోజకవర్గాలలో మోదీ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బహిరంగసభల్లో మోదీ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో ముస్లింలీగ్ ముద్ర ఉండేదని, ఇప్పుడూ వారి ఆలోచనలు అదేవిధంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. స్వాతంత్ర్యోద్యమం నాటి కాంగ్రెస్ పార్టీ దశాబ్దాల క్రితమే అంతమైందన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ పార్టీకి విధానాలుగానీ, సిద్ధాంతాలుగానీ, దేశాభివృద్ధిపై దృష్టిగానీ లేవని ఆరోపించారు. 'ఆ పార్టీ అన్నింటినీ కాంట్రాక్టుకు ఇచ్చేసినట్టు, మొత్తంగా పార్టీనే అవుట్‌సోర్సింగ్ చేసేసినట్టు కనిపిస్తోంది. కాంగ్రెస్ ఎక్కడుంటే అక్కడ అభివృద్ధి ఉండదు. ప్రజల సొమ్ము దోచేయడమే వంశపారంపర్యంగా తమకు లభించిన హక్కు అని వారు భావిస్తుంటారు. వారి దోపిడీ దుకాణపు షెట్టర్‌ను గత పదేళ్లలో మోదీ దించేశారు. అందుకే వారంతా ఆందోళనలో ఉన్నారు. వారు ర్యాలీలు నిర్వహించేది ఎన్నికల్లో గెలవడానికి కాదు. అవినీతి సొమ్మును కాపాడుకోడానికి' అని మోదీ ఎద్దేవా చేశారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన తొలి వంద రోజుల్లోనే అవినీతిపై అతిపెద్ద నిర్ణయం తీసుకోనున్నట్టు మోదీ తెలిపారు. అధికారంలోకి వచ్చాక కమీషన్లు తీసుకోవడమే ఇండియా కూటమి లక్ష్యమని, అయితే, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఒక మిషన్ ఉందని మోదీ చెప్పారు. భారతదేశానికి ప్రాధాన్య పార్టీగా బీజేపీ మారిపోయిందని మోదీ మరో సందర్భంలో వ్యాఖ్యానించారు. బీజేపీ 44వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మోదీ 'ఎక్స్'లో శనివారం శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ తమ ఆకాంక్షలను నెరవేర్చే పార్టీ అని యువత భావిస్తున్నారని, 21వ శతాబ్దంలో దేశానికి నాయకత్వం అందించే పార్టీగానూ చూస్తున్నారని తన సందేశంలో మోదీ పేర్కొన్నారు. సుదీర్ఘకాలం దేశాన్ని పాలించినవారికి 'హాల్‌మార్క్'లా ఉండే అవినీతితోపాటు వారసత్వ, కులతత్వ, మతతత్వ, ఓటుబ్యాంకు రాజకీయాల నుంచి దేశానికి బీజేపీ విముక్తి కలిగించిందన్నారు.

మోదీకి చరిత్ర తెలియదు



ప్రధాని మోదీకి చరిత్ర పట్ల అవగాహన లేదని ఏఐసీసీ నేత జైరామ్ రమేశ్ అన్నారు. "జన్ సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ 1940ల్లో ముస్లింలీగ్‌తో కలిసి పశ్చిమబెంగాల్ సంకీర్ణ ప్రభుత్వంలో అధికారం పంచుకున్నారు. సింధ్, నార్త్ - వెస్ట్ ఫ్రాంటియర్ ప్రావిన్సుల్లో ముస్లిం లీగ్‌తో కలిసి హిందూ మహాసభ ప్రభుత్వం నడిపింది. మోదీకి తన పార్టీ రాజకీయాల పట్లా అవగాహన లేదు" అని విమర్శించారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ముస్లిం లీగ్ ఎన్నికల ప్రణాళికను తలపిస్తోందన్న మోదీ వ్యాఖ్యలపై జైరామ్ ఇలా స్పందించారు. కాగా, దేశ ప్రతిష్ఠను, ప్రజాతంత్రాన్ని ప్రధాని మోదీ తన చర్యలతో దెబ్బ తీస్తున్నారని ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీ అన్నారు. ఇతర పార్టీల నేతలను బీజేపీలో చేర్చుకోవడానికి అన్నిరకాల వ్యూహాలను బీజేపీ అమలుచేస్తోందని ధ్వజమెత్తారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో శనివారం జరిగిన ఎన్నికల ప్రచారంలో సోనియా పాల్గొన్నారు. తనను తాను గొప్పవాడిగా భావించే మోదీ హయాంలో అన్ని వ్యవస్థల్లో భయం అలుముకున్నదన్నారు. మోదీని అబద్ధాల నేతగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దుయ్యబట్టారు.

సలహాలిస్తాం.. గెలిపించేస్తాం!

ఎన్నికల వ్యూహకర్తలకు డిమాండ్

- టికెట్ల పంపిణీ నుంచి ప్రచారం వరకూ అంతా వీరి సలహాలు, సూచనలతోనే
- తెరవెనుకే వ్యూహాలు.. ఎత్తులు, పైఎత్తులు



సోషల్ మీడియా యుగంలో పోల్ ప్లానింగ్

వేసవిలో ఎండలతోపాటు దేశంలో ఎన్నికల వాతావరణం కూడా వేడెక్కుతోంది. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ అభ్యర్థులను ప్రకటించే పనిలో బిజీగా ఉన్నాయి. ఈసారి ఎన్నికల్లో వ్యూహకర్తల పాత్ర కీలకంకానుంది. ఇప్పటికే వేలాది మంది వ్యూహకర్తలు తమను ఎంచుకొన్న అభ్యర్థుల విజయం కోసం రంగంలోకి దిగారు. ప్రత్యర్థులను ఇరుకున పెట్టేలా ఎత్తుగడలు వేయడం, తమ అభ్యర్థికి సలహాలు, సూచనలు ఇవ్వడమే వీరి ప్రధాన బాధ్యత. తెరవెనుకే ఉంటూ ఎన్నికల వ్యూహాలకు నిరంతరం పదును పెడుతూ.. టికెట్ల పంపిణీ నుంచి ప్రచారం వరకూ అన్ని బాధ్యతలు తలకెత్తుకుని అభ్యర్థుల విజయానికి అవిశ్రాంత కృషి చేస్తుంటారు. సమయానుకూలంగా వ్యూహాలు రచించే సత్తా ఉన్నవారిని రాజకీయ పార్టీలు రూ.కోట్లు వెచ్చించి మరీ వ్యూహకర్తలుగా నియమించుకుంటున్నాయి. పోలింగ్ నిపుణులు, వ్యూహకర్తల రంగప్రవేశంతో పరిస్థితుల్లో చాలా మార్పు వచ్చింది. కేవలం భావోద్వేగాలు, ప్రజా సమస్యలువంటి అంశాలతోనే ఎన్నికల్లో పోరాడటమనేది ఇప్పుడు కుదిరే పనికాదు. సాంకేతిక పరిజ్ఞానం, ఫలితాలను తారుమారు చేయగలిగిన సామర్థ్యం కలిగిన నిపుణులతో నేడు ఎన్నికల ప్రక్రియ మరింత శక్తిమంతంగా మారింది. రాజకీయ పార్టీలు, వాటి అభ్యర్థులకు మద్దతుగా నిలిచేందుకు ఎలక్షన్ మేనేజ్‌మెంట్ సంస్థలకు చెందిన సర్వే నిపుణులు, సలహాదారులు, ప్రసంగ రచయితలు, డేటా విశ్లేషకులు, సాంకేతిక, ఏఐ నిపుణులతో కూడిన బృందం తెరవెనుక సిద్ధంగా ఉంటోంది. ఈ సంస్థలు వ్యూహాత్మక ప్రణాళికలు, ప్రచార నిర్వహణ, కమ్యూనికేషన్, మెసేజింగ్, ఓటర్ల నాడిని పట్టే సర్వేలు చేపట్టి వాటి ఫలితాలను విశ్లేషించడంతోపాటు డిజిటల్ మార్కెటింగ్ సేవలను పార్టీలు, అభ్యర్థులకు అందిస్తాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో సోషల్ మీడియా కీలకపాత్ర పోషించింది. అప్పట్లో మోదీ తరఫున ఎన్నికల ప్రచార బాధ్యతలు చేపట్టిన సిటిజన్స్ ఫర్ అకౌంటబుల్ గవర్నెన్స్ (సీఏజీ) దేశంలోని మిగిలిన ప్రాంతాల్లోనూ 'గుజరాత్ మోడల్'ను అనుకరించగల, అభివృద్ధిని కాంక్షించే బలమైన నాయకుడిగా బీజేపీకి చెందిన మోదీకి విస్తృతంగా ప్రచారం కల్పించడంలో సఫలీకృతమైంది. అప్పటినుంచి రాజకీయ కన్సల్టెంట్లు, ఎలక్షన్ మేనేజ్‌మెంట్ సంస్థలకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం ఆప్, కాంగ్రెస్, టీఎంసీ, బీజేడీపార్టీలూ అదేబాటలో నడుస్తున్నాయి.

రాజకీయ సందేశాలు ప్రజలకు చేరేందుకు రాజకీయ పార్టీలకు సోషల్ మీడియా కీలకంగా మారడంతో దీనిపై పెట్టుబడి ప్రచార నిర్వహణలో కీలకమవుతోంది. ఎలక్షన్ మేనేజ్‌మెంట్ సంస్థలు సోషల్‌మీడియా నిపుణులు, కంటెంట్ రైటర్లతో బృందాలను సిద్ధం చేసుకుంటున్నాయి. పార్టీలు ఎన్నికల్లో ప్రచారానికి హోలోనెట్, హోలోఫాన్స్, హోలోబాక్సెస్ వంటి ఆన్‌లైన్ వేదికలనూ వాడుకొనే పనిలో ఉన్నాయి.

వినూత్నంగా ప్రచారం

డిజిటల్ ప్రచారం, ప్రణాళికలను నిర్వహించే సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వ్యూహకర్తలే ఎలక్షన్ మేనేజ్‌మెంట్ సంస్థలకు ప్రధాన బలం. అగ్రశ్రేణి నాయకులు, పెద్ద రాజకీయ పార్టీలతో కలిసి పనిచేస్తున్న ఈ సంస్థలు ప్రజాభిప్రాయాన్ని రూపొందించడంలోనూ, దేశంలో ఎన్నికల్లో పోరాడే విధానాన్ని సమూలంగా మార్చేయడంలోనూ కీలకపాత్ర పోషించాయి. ప్రస్తుతం రాజకీయ పార్టీలు చేసే వ్యయంలో ఎక్కువ భాగం రాజకీయ కన్సల్టెన్సీల కనుసన్నల్లోనే చేస్తున్నాయి. దేశంలోని చిన్న, పెద్ద వ్యూహకర్తలు తాము అందించే సేవలకు ప్రస్తుతం ఒక్కో నియోజకవర్గానికి రూ.50 వేల నుంచి రూ.5లక్షల వరకూ వసూలు చేస్తున్నారు. 8-10 మంది సభ్యుల బృందానికి ఒక ఎంపీ అభ్యర్థి నుంచి రూ.5 నుంచి రూ.10లక్షల వరకూ చార్జి చేస్తారు. బడా పొలిటికల్ కన్సల్టెంట్లు రాజకీయపార్టీలకు రూ.50లక్షల నుంచి రూ.కోటి వరకూ ప్యాకేజీలు ఆఫర్ చేస్తున్నాయి. కాగా తమ విజయానికి క్రెడిట్‌ను వేరొకరితో పంచుకోవడానికి అంతగా ఇష్టపడని రాజకీయనాయకులు అందుకోసం కృషి చేసిన వ్యూహకర్తల సహకారాన్ని గుర్తించడం చాలా అరుదు. అందువల్లే వ్యూహకర్తల పాత్ర తెరవెనుకకే పరిమితమైంది.

– సెంట్రల్ డెస్క్

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్..

సంతోష్ అలియాస్ సాగర్ మృతి

మృతుడు మావోయిస్టు రీజనల్ కంపెనీ కమాండర్.. స్వస్థలం భూపాలపల్లి జిల్లా దస్తగిరిపల్లి

- ఇతని తలపై రూ.25 లక్షల రివార్డు
- మణిరాం, మరో మావోయిస్టు కూడా మృతి
- ఇది బూటకపు ఎన్‌కౌంటర్.. కాంగ్రెస్‌దే బాధ్యత
- బాకీ తీర్చుకుంటామంటూ ఆజాద్ పేరిట లేఖ




సంతోష్ (ఫైల్), దస్తగిరిపల్లిలోని సంతోష్ తల్లిదండ్రులు నివసిస్తున్న పెంకుటిల్లు

చర్ల/వెంకటాపురం/కాటారం/మహబూబాబాద్(ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 6: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో మరోమారు తుపాకీ గర్జించింది. తెలంగాణ గ్రేహౌండ్స్-ఛత్తీస్‌గఢ్ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో.. మావోయిస్టులతో జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు దుర్మరణంపాలయ్యారు. వీరిలో తెలుగువాడైన దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ(ఎస్‌జడ్) సభ్యుడు, రెండో రీజనల్ కంపెనీ కమాండర్ అన్నె సంతోష్ అలియాస్ శ్రీధర్ అలియాస్ సాగర్ ఉన్నారు. ఇతని తలపై రూ.25 లక్షల రివార్డు ఉంది. మృతిచెందిన మరో ఇద్దరు మావోయిస్టుల్లో ఒకరిని మణిరాం అని గుర్తించగా.. మరొకరి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు మృతుల పేర్లను అధికారికంగా ప్రకటించకున్నా.. మావోయిస్టు నేత ఆజాద్ పేరిట విడుదలైన ఓ లేఖ ద్వారా మృతుల్లో సంతోష్, మణిరాం ఉన్నట్లు స్పష్టమవుతోంది. పోలీసుల కథనం ప్రకారం.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌లో పోలీసు బలగాల కూంబింగ్ విస్తృతమైంది. తెలంగాణ గ్రేహౌండ్స్ పోలీసులు కూడా సరిహద్దుల్లో మావోయిస్టుల కోసం జల్లెడ పడుతున్నారు. శనివారం తెల్లవారుజామున 5.30 సమయంలో ఇటు గ్రేహౌండ్స్.. అటు ఛత్తీస్‌గఢ్ బలగాలు కూంబింగ్‌లో ఉండగా.. బీజాపూర్ జిల్లా కాంకేర్ సమీపంలోని పుజారకాంకేర్ సమీపంలోని కర్రి(ఛత్తీస్‌గఢ్), తెలంగాణలోని ములుగు జిల్లా వెంకటాపురం మండలం డోలిగుట్టల అడవుల్లో మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో.. ఇరువైపులా కాల్పులు మొదలయ్యాయి. సుమారు గంటసేపు తుపాకులు గర్జించాయి. కాల్పులు నిలిచిపోయిన కొంతసేపటికి పోలీసులు ఆ ప్రాంతంలో పరిశీలించగా.. ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఘటనాస్థలి నుంచి ఒక లైట్ మెషీన్ గన్(ఎల్ఎంజీ), ఒక ఏకే-47, తూటాలు, పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మృతులను ఇంకా గుర్తించాల్సి ఉందని పోలీసులు తెలిపారు. అయితే.. మృతుల్లో సంతోష్ అలియాస్ సాగర్, మణిరాం, మరొకరు ఉన్నట్లు పేర్కొంటూ భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ సభ్యుడు ఆజాద్ పేరిట శనివారం సాయంత్రం ఓ లేఖ విడుదలైంది. భూటకపు ఎన్‌కౌంటర్లకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ములుగు ఎస్పీ కనుసన్నల్లో మావోయిస్టుల ఎన్‌కౌంట్ల పరంపర కొనసాగుతోందని ఆజాద్ ఆరోపించారు. "బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలది ఒకే వ్యూహం. మావోయిస్టు పార్టీని నిర్మూలించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాయి. దండకారణ్యాన్ని పోలీసు క్యాంపులతో నింపేస్తున్నారు. డ్రోన్లు హెలికాప్టర్ల ద్వారా దాడులు చేయిస్తున్నాయి. ఇటీవల మహారాష్ట్రలో ముగ్గురు మావోయిస్టులపై విషప్రయోగం చేసి, ఆ తర్వాత కిరాతకంగా హింసించి ఎన్‌కౌంటర్ కథ అల్లారు. శనివారం నాటి ఎన్‌కౌంటర్‌లో ఎస్‌జడ్ సభ్యుడు సాగర్, మణిరాం, మరో మావోయిస్టు మృతిచెందారు. మావోయిస్టుల ఎజెండానే తన ఎజెండా అని ప్రకటించిన కేసీఆర్.. అధికారంలోకి వచ్చాక నియంతలా వ్యవహరించారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా పోలీసులతో దాడులు చేయిస్తోంది. ఈ ఎన్‌కౌంటర్లకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలి" అని ఆ లేఖలో పేర్కొన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్ల నెత్తుటి బాకీని తీర్చుకుంటామని హెచ్చరించారు. కాగా.. ఈ వారంలోనే బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 13 మంది మావోయిస్టులు మృతిచెందడం.. తాజా ఘటన, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో పోలీసులు నిఘాను పెంచారు.

నూనుగు మీసాల వయసులో ఉద్యమబాట

సంతోష్ స్వస్థలం జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని అంకుసాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని దస్తగిరిపల్లి. ఆయన తల్లిదండ్రులు అన్నె ఐలోని, సమ్మక్క. పదోతరగతి పూర్తవ్వగానే సంతోష్‌కు వివాహం చేశారు. పెళ్లైన ఏడాది తర్వాత భార్యతో వివాదాలు.. అదే సమయంలో పీపుల్స్‌వార్(ప్రస్తుతం మావోయిస్టు పార్టీ) విప్లవ గీతాలను ఆలపించడం పట్ల ఆకర్షితుడయ్యారు. అలా నూనుగు మీసాల వయసులో (1999-2000లో) నక్సల్స్‌తో కలిసి అజ్ఞాతంలోకి వెళ్లారు. ఇన్ఫార్మర్లు పెరగడం, పోలీసులు టెక్నాలజీని ఉపయోగిస్తుండడంతో.. కాటారం నక్సల్స్ క్రమంగా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర బాట పట్టారు. ఎన్‌కౌంటర్లు, మరణాల కారణంతో వీరి సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. పదేళ్ల క్రితం వరకు కూడా మావోయిస్టు పార్టీలో కాటారం సబ్-డివిజన్‌కు చెందిన ముగ్గురు ఉండేవారు. వారిలో ముఖ్యుడు సంతోష్. మరో ఇద్దరిలో.. లోకె సారమ్మ ఎనిమిదేళ్ల క్రితం అరెస్టవ్వగా.. చెన్నూరి స్వరూప అలియాస్ సర్వక్క ఏడేళ్ల క్రితం పోలీసుల ఎదుట లొంగిపోయారు. అజ్ఞాతంలోనే ఉన్న సంతోష్ అంచెలంచెలుగా ఎదుగుతూ.. చనిపోయే ముందు వరకు ఎస్‌జడ్ కమిటీ సభ్యుడిగా, డివిజనల్ కమిటీ కమాండర్‌గా కొనసాగారు. చర్ల మండలంలో మావోయిస్టులు జరిపిన పలు విధ్వంసాల్లో సంతోష్ పాత్ర ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

మండలాధ్యక్షులపై అవిశ్వాసం సబబే

- సింగిల్ జడ్జి తీర్పును సమర్థించిన డివిజన్ బెంచ్

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ సభ్యుల విజ్ఞప్తికి అనుగుణంగా మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులకు ఆర్డీవోలు అవిశ్వాస తీర్మాన నోటీసులు జారీచేయడం సబబేనని హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. ఈ మేరకు ఇటీవల సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సమర్థించింది. సంగారెడ్డి జిల్లా జిన్నారం ఎంపీపీ డి.రవీందర్ గౌడ్ తమ విశ్వాసం కోల్పోయారని పేర్కొంటూ ఎంపీటీసీ సభ్యులు స్థానిక సంగారెడ్డి ఆర్డీవోకు లేఖ ఇచ్చారు. అవిశ్వాస తీర్మానం పెట్టడానికి వీలుగా సమావేశం నిర్వహించాలని కోరారు. ఆ మేరకు ఆర్డీవో మండలాధ్యక్షునికి అవిశ్వాస నోటీసు జారీచేశారు. ఈ నోటీసులు చట్టవిరుద్ధమని పేర్కొం టూ ఎంపీపీ రవీందర్ గౌడ్‌తోపాటు, అదే తరహాలోనే నోటీసులు అందుకున్న మరికొందరు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. ఆ పిటిషన్‌లను ఈఏడాది మార్చి 12న సింగి ల్ జడ్జి ధర్మాసనం కొట్టేసింది. ఆ నిర్ణయాన్ని సవాలు చేస్తూ రవీందర్ గౌడ్ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశారు. దీనిపై ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది సీ రఘు వాదనలు వినిపిస్తూ.. ఏపీ పంచాయతీరాజ్ యాక్ట్ రూల్స్ ప్రకారం నోటీసు ఇవ్వడం చెల్లదని తెలిపారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ వాదనలు వినిపిస్తూ.. ఆర్డీవో కాంపిటెంట్ అథారిటీ కిందకే వస్తారని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఏపీ పంచాయతీరాజ్ యాక్ట్- 1994ను తెలంగాణ పంచాయతీరాజ్ యాక్ట్ 2018తో రీప్లేస్ చేశారని, కొత్త చట్టంలోని సెక్షన్ 295లో సేవింగ్ క్లాజ్ ఉందని స్పష్టం చేసింది. దాని ప్రకారం పాత చట్టం ప్రకారం చేసిన ఏదైనా అపాయింట్‌మెంట్, నోటిఫికేషన్, ఆర్డర్, స్కీం, రూల్, ఫారం, నోటీసు, బైలా కొనసాగుతాయని పేర్కొంది. పాత రూల్స్ ప్రకారం కాంపిటెంట్ అథారిటీ నోటీసులు ఇవ్వవచ్చని స్పష్టం చేసింది. అయినా కొత్త చట్ట ప్రకారం కొత్త రూల్స్ ఎందుకు జారీచేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.

ఆర్థిక ఇబ్బందులతో చేనేత కార్మికుడి ఆత్మహత్య

- బాధిత కుటుంబానికి కేటీఆర్ పరామర్శ
- రూ.50 వేలు సాయం అందజేత



లక్ష్మీనారాయణ

సిరిసిల్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపం చెంది సిరిసిల్లకు చెందిన సిరిపురం లక్ష్మీనారాయణ(66) అనే చేనేత కార్మికుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. సిరిసిల్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన సిరిపురం లక్ష్మీనారాయణ పదేళ్ల క్రితం మహారాష్ట్రలోని భీవండి వస్త్ర పరిశ్రమలో మరమగ్గాలపై పని చేసినప్పుడు కాలికి గాయమైంది. దీంతో సిరిసిల్లకు వచ్చి మరమగ్గాలు నడుపుతున్నాడు. అతని భార్య వజ్రవ్వ నాలుగేళ్ల క్రితం పక్షవాతానికి గురైంది. లక్ష్మీనారాయణ దంపతుల వైద్యం ఖర్చులు నెలకు రూ.10 వేల వరకు అవుతున్నాయి. ఈ క్రమంలో ఉపాధి లేక మరోపక్క అప్పు దొరక్క మనస్తాపం చెందిన లక్ష్మీనారాయణ ఆత్మహత్య చేసుకున్నాడు. సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి వెళ్లిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. లక్ష్మీనారాయణ కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి తమ పార్టీ తరఫున రూ.50 వేలు అందజేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మూడు మునిసిపాలిటీలు 'హస్త'గతం

వనపర్తి, తిరుమలగిరి కాంగ్రెస్ కైవసం.. కాంగ్రెస్ అభ్యర్థులకే ఓటేసిన ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు

- ఏకగ్రీవమైన మునిసిపల్ చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌ల ఎన్నిక

వనపర్తి టౌన్/తిరుమలగిరి/ఆదిభట్ల, ఏప్రిల్ 6: రాష్ట్రంలోని మూడు మునిసిపాలిటీలు 'హస్త' గతమయ్యాయి. జిల్లా కేంద్రమైన వనపర్తి, సూర్యాపేట జిల్లాలోని తిరుమలగిరి మునిసిపాలిటీల చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులు కాంగ్రెస్ ఖాతాలోకి చేరాయి. శనివారం నిర్వహించిన వనపర్తి మునిసిపల్ సమావేశంలో కాంగ్రెస్‌కు చెందిన పుట్టపాకల మహేశ్ చైర్మన్‌గా, పాకనాటి కృష్ణ వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 33 వార్డులుగా ఉన్న వనపర్తి మునిసిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి గతంలో 25 మంది కౌన్సిలర్ల బలం ఉండేది. ఇటీవల కొందరు కౌన్సిలర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో బీఆర్ఎస్‌లో 15 మంది కౌన్సిలర్లు మాత్రమే మిగిలారు. మునిసిపాలిటీలో ప్రస్తుతం కాంగ్రెస్ బలం 17కు చేరింది. ఓటింగ్‌లో పాల్గొన్న 22 మంది కౌన్సిలర్లతోపాటు ఎక్స్‌అఫీషియో సభ్యుడు, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఓటుతో చైర్మన్, వైస్ చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ దక్కించుకుంది. ఆరుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, ఒక టీడీపీ కౌన్సిలర్ కూడా కాంగ్రెస్ అభ్యర్థులకే మద్దతు పలకడంతో చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక ఏకగ్రీవమైంది. అలాగే తిరుమలగిరి మునిసిపాలిటీలో గత నెల 20న అప్పటి చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్లపై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. మునిసిపాలిటీలో 15 మంది కౌన్సిలర్లు ఉండగా, 12 మంది కౌన్సిలర్లతోపాటు ఎక్స్‌అఫీషియో సభ్యుడు ఎమ్మెల్యే సామేల్ సమావేశానికి హాజరయ్యారు. మిగిలిన ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు హాజరుకాలేదు. చైర్‌పర్సన్‌గా శాగంటి అనసూయ, వైస్ చైర్‌పర్సన్‌గా కేశిడి సరళకు ఒక బీజేపీ కౌన్సిలర్‌తోపాటు 11 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఎమ్మెల్యే సామేల్ మద్దతు తెలుపడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్డీవో ప్రకటించారు.

ఆదిభట్ల చైర్మన్‌గా కాంగ్రెస్ బహిష్కృత నేత

రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మునిసిపల్ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ బహిష్కృత నేత మర్రి నిరంజన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా కామండ్ల యాదగిరిలు ఎన్నికయ్యారు. శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో 15 మందికి గానూ 13 మంది కౌన్సిలర్లు మద్దతు ప్రకటించడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి అనంతరెడ్డి ప్రకటించారు. కాగా, ఇటీవలే సొంత పార్టీకి చెందిన చైర్‌పర్సన్ కొత్త ఆర్తీకపై కౌన్సిల్‌లోని మిగతా సభ్యులతో కలిసి నిరంజన్‌రెడ్డి క్యాంపు రాజకీయాలకు పాల్పడడంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనపై బహిష్కరణ వేటు వేసింది. ప్రస్తుతం చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు కాంగ్రెస్ ఖాతాలోనే ఉండటంతో లోక్‌సభ ఎన్నికల వేళ నిరంజన్‌రెడ్డిపై ఉన్న వేటు ఎత్తివేయడం లాంఛనమే అని చర్చ జరుగుతోంది.

ఫోన్ ట్యాపింగ్ కేసు..

నేడో రేపో ఓ ఎమ్మెల్సీకి నోటీసులు?

- ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్‌కు కూడా..??
- ట్యాపింగ్, బెదిరింపులు, నగదు తరలింపుపైనే రాధాకిషన్‌కు ప్రశ్నలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు పోలీసుల చుట్టే తిరిగిన ఫోన్‌ట్యాపింగ్ కేసు త్వరలో రాజకీయ నాయకుల మెడకు చుట్టుకోనుందా? టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్ కస్టడీ ముగిశాక.. దర్యాప్తు సొంతం రాజకీయ నాయకుల చుట్టే తిరుగనుందా? ఈ ప్రశ్నలకు ప్రస్తుత పరిణామాలు ఔననే చెబుతున్నాయి. మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న విచారణలో నగరానికి చెందిన ఓ ఎమ్మెల్సీ పేరు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. టార్గెట్‌గా చేసుకున్న వ్యక్తుల ఫోన్లు, ఎలక్ట్రానిక్ డివైజ్‌లను వారి ఇళ్లు/కార్యాలయాలకు 300 మీటర్ల దూరం నుంచే ట్యాప్ చేసే ఓ పరికరాన్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఆ పరికరాన్ని కొనుగోలు చేయడానికి సదరు ఎమ్మెల్సీ నిధులను సమకూర్చినట్లు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో ఆ ఎమ్మెల్సీకి నేడో రేపో నోటీసులు ఇచ్చేందుకు దర్యాప్తు అధికారులు సిద్ధమవుతున్నారు. ఆయనను విచారిస్తే.. మరికొందరు రాజకీయ నేతల పేర్లు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు.

ఈ కేసులో.. ప్రణీత్‌రావు ఎస్ఐబీలో రెండు గదుల్లో సీక్రెట్‌గా ట్యాపింగ్‌లు చేసినట్లు ప్రాథమిక విచారణలోనే తేలింది. అక్కడ వాడిన 17 కంప్యూటర్లకు అధికారిక ఇంటర్నెట్ కనెక్షన్ కాకుండా.. ప్రైవేటు ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్(ఐఎస్‌పీ) సేవలను వినియోగించుకున్నట్లు నిర్ధారించారు. దీంతో.. ఆ ఐఎస్‌పీ ఉన్నతాధికారులకు కూడా నోటీసులు ఇవ్వాలని దర్యాప్తు అధికారులు నిర్ణయించారు. "కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఐఎస్‌పీలు కనీసం ఆర్నెల్ల డేటాను భద్రపర్చాల్సి ఉంటుంది. అంటే.. తమ వినియోగదారులు ఐపీ అడ్రస్‌ల వారీగా.. వారి బ్రౌజింగ్ హిస్టరీ, ఏయే సాఫ్ట్‌వేర్ల ద్వారా ఏయే ఐపీలకు కనెక్ట్ అయ్యారు? అనే వివరాలను సర్వర్లలో భద్రపరచాలి. సర్వర్లలో ఎన్‌క్రిప్టెడ్‌గా ఉండే ఆ సమాచారాన్ని దర్యాప్తు అధికారులు అడిగినప్పుడు డీక్రిప్ట్ చేసి, అందజేయాల్సి ఉంటుంది" అని ఓ అధికారి 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. అంటే.. ప్రణీత్‌రావు హార్డ్ డిస్క్‌లను నాశనం చేసినా.. ఐఎస్‌పీ సర్వర్లలోని 'కాష్ మెమొరీ', 'బ్రౌజింగ్ హిస్టరీ' ద్వారా నిందితులు ఏ సాఫ్ట్‌వేర్‌ను వాడారో గుర్తించే అవకాశాలుంటాయని సైబర్ సెక్యూరిటీ నిపుణులు చెబుతున్నారు. ఆ సాఫ్ట్‌వేర్ ఏమిటన్నది తెలిస్తే.. నిందితులకు శిక్షపడేలా పక్కాగా డిజిటల్ ఎవిడెన్స్‌ను కోర్టుకు సమర్పించవచ్చని వివరిస్తున్నారు.

రాధాకిషన్‌రావు మూడోరోజు పోలీసు కస్టడీ శనివారంతో ముగిసింది. మరో నాలుగు రోజుల కస్టడీ మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో ఫోన్‌ట్యాపింగ్ మొదలు.. బెదిరింపులు, ఎన్నికల సమయంలో నగదు తరలింపు వంటి అంశాలపై దర్యాప్తు అధికారులు సమాధానాలను రాబడుతున్నారు. ఫోన్ నంబర్లను ఎవరు ఇచ్చేవారు? టార్గెట్‌ల ప్రొఫైల్స్‌ను ఎలా రూపొందించేవారు? ఇప్పటి వరకు ఎంతమంది ఫోన్ నంబర్లు ట్యాప్ చేయించారు? పలు ప్రశ్నలకు రాధాకిషన్ నుంచి సమాధానాలను రాబట్టుకున్నట్లు తెలిసింది.

ఏసీబీ వలకు చిక్కిన అవినీతి ఖాకీలు

- పట్టుబడ్డ మాదాపూర్ ఎస్సై, కానిస్టేబుల్

హైదరాబాద్ సిటీ/మోతీనగర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్సై రంజిత్, కానిస్టేబుల్ విక్రమ్ రూ.30 వేలు లంచం తీసుకుంటూ శనివారం ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా దొరికారు. మాదాపూర్‌లోని సాయినగర్‌కు చెందిన ఎం.లక్ష్మణ్ కుమార్తె నాగజ్యోతి 60 గజాల్లో పక్కా భవన నిర్మాణం చేపట్టారు. దీనిపై అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారని అదే ప్రాంతానికి చెందిన మహిళ జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేశారు. స్పందించిన జీహెచ్ఎంసీ.. పోలీసుల సాయంతో నిర్మాణాన్ని కూల్చివేసింది. దీంతో లక్ష్మణ్ జీహెచ్ఎంసీని ఆశ్రయించగా 60 గజాల్లో చేపట్టే ఇంటి నిర్మాణానికి అనుమతులు అవసరం లేదని చెప్పడం గమనార్హం. ఈ కేసు దర్యాప్తు పేరుతో లక్ష్మణ్‌ను పోలీసుస్టేషన్‌కు పిలిపించిన మాదాపూర్ ఎస్సై రంజిత్ బెదిరింపులకు దిగాడు. రూ.లక్ష లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ప్రాధేయపడగా రూ.50వేలకు అంగీకరించారు. ఈ విషయమై లక్ష్మణ్ ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు శనివారం మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన లక్ష్మణ్ రూ.30 వేలు కానిస్టేబుల్ విక్రమ్‌కు ఇచ్చాడు. విక్రమ్ ఆ నగదును ఎస్సై రంజిత్‌కు ఇవ్వగా.. ఏసీబీ అధికారులు వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు |

ఔను... కలికాలమే!

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ మధ్య 'కలికాలం' గురించి ఎక్కువగా ప్రస్తావిస్తున్నారు. రాజకీయాల్లో విలువలు, నైతికత లోపించడం చూస్తే కలికాలం గుర్తుకొస్తోందని అంటున్నారు. ఆయన ఏ ఉద్దేశంతో ఈ మాటలు అంటున్నారోగానీ... మనం ఇప్పుడు కలికాలంలోనే ఉన్నాం! కృత-యుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం తర్వాత కలికాలం వస్తుందని పురాణాల్లో చెప్పారు. మనం ఇప్పుడు కలికాలంలోనే జీవిస్తున్నాం. న్యాయం, ధర్మం స్థానంలో అధర్మం, అన్యాయం రాజ్యమేలుతోంటే కలికాలంకాక మరేమిటి? జగన్మోహన్ రెడ్డి వంటి వారు అధికారంలోకి రావడం కలికాలానికి సంకేతంకాక మరేమిటి? ప్రజలు కూడా న్యాయానికి, అన్యాయానికి మధ్య వ్యత్యాసాన్ని గుర్తించలేని స్థితికి చేరుకోవడం, మారీచుల వంటి

> **తెలంగాణలో తొమ్మిదిన్నరేళ్లపాటు రారాజుగా వెలుగొందిన కేసీఆర్ ప్రస్తుత పరిస్థితి చూసిన తర్వాత ఈ ఎన్నికల్లో ఓడిపోతే జగన్మోహన్ రెడ్డి పరిస్థితి కూడా అందుకు భిన్నంగా ఉండబోదన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. తెలంగాణ ఉద్యమ ప్రభావంతో రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చినా... భారత రాష్ట్ర సమితికి క్షేత్రస్థాయిలో పునాదులు బలహీనంగా ఉన్నాయని ఇప్పుడు తేటతెల్లం అయింది. రాజశేఖర రెడ్డి ప్రభావంతో అధికారంలోకి వచ్చిన వైసీపీ కూడా సంస్థాగతంగా బలహీనంగానే ఉంది. అధికారం లేకపోతే ఆ పార్టీ మనుగడ సాగించడం కష్టతరం. తెలుగుదేశం పార్టీకి క్షేత్రస్థాయిలో బలమైన కార్యకర్తలు ఉన్నారు. ఈ కారణంగానే నాయకులు లేకపోయినా, ఎన్నికల్లో ఓడిపోయినా ఆ పార్టీ నిలదొక్కుకుంది. దీనికి తోడు చంద్రబాబుకు భూదేవికి ఉన్నంత ఓర్పు ఉంది. ఫలితంగా పార్టీని కాపాడుకోగలిగారు. జగన్మోహన్ రెడ్డి పరిస్థితి వేరు. ముఖ్యమంత్రిగా ఈ ఐదేళ్లలో ఆయన వైఖరి గమనించిన వారికి ఆయనతో బలమైన అనుబంధం ఏర్పడలేదు.**

వారు మహానుభావులుగా గుర్తింపు పొందడం కలికాలం లక్షణమే! రక్తం పంచుకు పుట్టినవాళ్లు తమకు న్యాయం చేయవలసినదిగా ఆర్తనాదాలు చేస్తున్నప్పటికీ చెవికెక్కించుకోకుండా ధర్మోపన్యాసాలు చేయడం సాధారణ వ్యక్తులకు సాధ్యమా? తమ చిన్నాన్నను హత్య చేసింది, చేయించింది ఎవరో ఆ దేవుడికి, కడప జిల్లా ప్రజలకే తెలుసునని జగన్మోహన్ రెడ్డి తన బస్సు యాత్ర ప్రారంభం సందర్భంగా చెప్పుకొచ్చారు. కలికాలంలో కలి ప్రభావం కారణంగా దేవుళ్లు నిమిత్తమాత్రులవుతారు, పాలకులే శక్తిమంతులుగా అవతరిస్తారు. ఈ నేపథ్యంలో వివేకానందరెడ్డిని ఎవరు హత్య చేశారో, చేయించారో దేవుడికంటే పాలకులకే తెలుస్తుంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వివేకానంద రెడ్డిని హత్య చేయించింది నాటి ముఖ్యమంత్రి చంద్రబాబే అని నిందించిన జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఐదేళ్లు పూర్తిచేసు-కుంటున్న తరుణంలో హంతకులెవరో ఆ దేవుడికి ఎరుక అనడం ఏమిటి?

నాన్న, చిన్నాన్న... మరణాలతో రాజకీయం

ఐదేళ్లు వెనక్కు వెళితే, వివేకానంద రెడ్డి హత్య విషయంలో జగన్మోహన్ రెడ్డి మాటలు నిజమేనని గుడ్డిగా నమ్మి... ఆయన సోదరీమణులు బాసటగా నిలిచారు. 2019 ఎన్నికల్లో జగన్‌కు రాజకీయ లబ్ధి కలిగేలా ప్రచారం కూడా చేశారు. సీన్ కట్ చేస్తే ఐదేళ్ల తర్వాత వివేకానంద రెడ్డిని హత్య చేసిన వారిని ముఖ్య-మంత్రి హోదాలో జగన్మోహన్ రెడ్డి రక్షిస్తున్నారని ఆయన తోబుట్టువులే చెబుతున్నారు. జగన్ ప్రభుత్వం రక్తంలో తడిసిందని వివేకా కుమార్తె డాక్టర్ సునీత ఆరోపిస్తుండగా, తమ చిన్నాన్నను హత్య చేయించిన వారికి అండగా ఉంటూ మళ్లీ ఎంపీ టికెట్ ఇచ్చిన కారణంగానే తాను కడప నుంచి పోటీ చేస్తున్నానని షర్మిల అంటున్నారు. ముసుగులు తొలగిపోయాయి. వివేకా హత్య కేసులో ముద్దాయిగా ఉన్న అవినాశ్ రెడ్డిపై వారిరువురూ నేరుగా బాణాలు ఎక్కుపెట్టారు. వైఎస్ రాజశేఖర రెడ్డి జీవించి ఉంటే వివేకా హత్యకు కారణమైన అవినాశ్ రెడ్డికి ఎప్పుడో శిక్ష పడి ఉండేదని షర్మిల తాజాగా చెప్పుకొచ్చారు. మరోవైపు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రం తాను అక్క చెల్లెమ్మల జీవితాల్లో ఆనందం చూడటం కోసమే పని చేశానని, ఈ ఎన్నికల్లో అవకాశం ఇస్తే మళ్లీ వారికోసం పనిచేస్తానని చెబుతున్నారు. అయితే... ఆ అక్కచెల్లెమ్మల జాబితాలో ఆయన తోబుట్టువులైన షర్మిల, సునీత ఉన్నారా? లేరా? అన్నదే ఇప్పుడు ప్రశ్న! ప్రజలు ఇప్పుడు ఎవరి మాటలు నమ్మాలి? ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెప్పేది నిజం అనుకోవడానికి దాఖలాలు లేవు. వివేకానంద రెడ్డి హత్య విషయం పక్కన పెడితే... హెలికాప్టర్ ప్రమాదంలో రాజశేఖర రెడ్డి మరణం వెనుక కుట్ర జరిగిందని, అప్పట్లో యూపీఏ ప్రభుత్వ సారథి సోనియాగాంధీ రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ సహకారంతో రాజశేఖర రెడ్డిని చంపించారని జగన్మోహన్ రెడ్డి ఊరూవాడా ప్రచారం చేశారు. జనం కూడా కొంతవరకు నమ్మారు. తన రక్తం పంచుకుపుట్టిన జగన్ చెప్పింది నిజమేనని నమ్మిన షర్మిల కూడా అదే విధంగా ప్రచారం చేశారు. మళ్లీ సీన్ కట్ చేస్తే, ముఖ్యమంత్రి అయిన తర్వాత జగన్మోహన్ రెడ్డి తన తండ్రి మరణం వెనుక ఫలానా వారు ఉన్నారని ప్రస్తావించనే లేదు. పైపెచ్చు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తండ్రి మరణానికి కారకుడు అని నిందించిన రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీని తన ఇంటికి ఆహ్వానించి ఆయన కోరిన విధంగా పరిమళ్ నత్వానీ అనే వ్యక్తికి రాజ్యసభ సభ్యత్వం కట్టబెట్టారు. దాంతో వైఎస్ రాజశేఖర రెడ్డి మరణం గురించి జగన్మోహన్ రెడ్డి చేసిన ప్రచారం బూటకం అని తేలి-పోతున్నది కదా? ఆ సంఘటన తర్వాత రాజశేఖర రెడ్డి సోదరుడైన వివేకానంద రెడ్డి తన సొంత ఇంట్లోనే దారుణ హత్యకు గురయ్యారు. 2019 ఎన్నికలకు ముందు ఈ హత్య జరగడంతో జగన్మోహన్ రెడ్డి యథావిధిగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబును నిందితుడిగా ప్రచారం చేశారు. ప్రజలు కూడా కొంత వరకు నమ్మారు. అటు వివేకా కుమార్తె డాక్టర్ సునీత, ఇటు సొంత చెల్లెలు షర్మిల కూడా నిజమేనని నమ్మి ఆ మేరకు ప్రచారం చేశారు. కాలక్రమంలో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. వివేకాను హత్య చేసిన వారిలో ఒకరైన దస్తగిరి అప్రూవర్‌గా మారి... ఈ హత్య చేయించింది ఎవరో చెప్పారు. ఈ వాస్తవాన్ని డాక్టర్ సునీతతోపాటు షర్మిల కూడా జీర్ణించుకోలేకపోయారు. అయినా కొంత కాలం పాటు సోదరుడైన జగన్మోహన్ రెడ్డి మాటలను నమ్మారు. చివరకు హత్యకు కారకుడని విచారణలో తేటతెల్లమవుతున్న అవినాశ్ రెడ్డికి మద్దతుగా సాక్షాత్తు జగ-న్మోహన్ రెడ్డే నిలబడటాన్ని గ్రహించి జీర్ణించుకోలేకపోయారు. ఫలితంగానే... కడప లోక్‌సభ బరిలో అన్నా చెల్లెళ్లు బహిరంగంగా తలపడే పరిస్థితి ఉత్పన్నమైంది. తమ చిన్నాన్నను హత్య చేయించిన అవినాశ్ రెడ్డికి జగన్మోహన్ రెడ్డి మళ్లీ టికెట్ ఇవ్వడాన్ని ప్రస్తుతం పీసీసీ అధ్యక్షురాలిగా ఉన్న షర్మిల ప్రశ్నించడంతో-పాటు... అవినాశ్ రెడ్డిపై కాంగ్రెస్ తరఫున పోటీకి దిగారు. సోదరికి బాసటగా వివేకా కుమార్తె డాక్టర్ సునీత కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. వివేకాను దారుణంగా చంపించిన అవినాశ్ రెడ్డిని ఓడించాలని కడప జిల్లా ప్రజలకు ఆ ఇరువురు ఆడపడుచులూ విజ్ఞప్తి చేస్తున్నారు.

అవును... కడప ప్రజలకు క్లారిటీ...

మరోవైపు అవినాశ్ రెడ్డి ముందస్తు బెయిల్ రద్దుకోసం సీబీఐ అధికారులు సుప్రీంకోర్టును ఎందుకు ఆశ్రయించలేదని తెలంగాణ హైకోర్టు తాజాగా ప్రశ్నించింది. అవినాశ్ రెడ్డి బెయిల్ రద్దు కోసం దస్తగిరి పెట్టుకున్న పిటిషన్‌పై హైకోర్టు సానుకూల ఆదేశాలు ఇస్తే ఎన్నిక జరిగేలోపే అవినాశ్ రెడ్డి జైలుకు వెళ్లే అవకాశం ఉంది. దీంతో తనను ఒంటరిని చేసి రాజకీయ ప్రత్యర్థులందరూ తోడేళ్ల గుంపుగా ఒక్కటై దాడి చేస్తున్నారని, తన వాళ్లు కూడా ఒకరిద్దరు వారికి తోడయ్యారని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆరోపించడం మొదలెట్టారు. ఈ సందర్భంగానే కలికాలం గురించి ఆయన ప్రస్తావిస్తున్నారు. ఈ ఎపిసోడ్‌లో తమాషా ఏమిటంటే... తల్లి విజయలక్ష్మి అటు జగన్మోహన్ రెడ్డి విజయం కోసం, ఇటు షర్మిల విజయం కోసం ప్రార్థనలు చేశారు. దీంతో ఎవరికి ఆశీస్సులు ఇవ్వాలో తెలియని సంకట స్థితిని జీసస్ క్రీస్తుకు కల్పించారు. రాజశేఖర రెడ్డి మరణం తర్వాత జరిగిన సంఘటనలు, చేసిన ప్రచారాలను పరిగణనలోకి తీసుకుంటే కలికాలానికి తగ్గట్టుగానే జగన్మోహన్ రెడ్డి ప్రవర్తిస్తున్నారని అనిపిస్తుంది. ధర్మం, న్యాయం కోసం సునీత, షర్మిల పోరాటం చేస్తున్నారని నమ్మాల్సిన పరిస్థితి. అయితే... కడప జిల్లా ప్రజలకు మాత్రం వివేకా హత్య వెనుక ఎవరున్నారన్న దానిపై స్పష్టత ఏర్పడిందని తెలుస్తోంది. ఎన్నికల కురుక్షేత్రంలో అవినాశ్‌ను నేరుగా ఢీకొనాలని షర్మిల నిర్ణయించుకొని బరిలోకి దిగడంతో ప్రజలకు మరింత స్పష్టత వచ్చింది. ప్రధాన ప్రతిపక్షం తెలుగు-దేశం పార్టీ అభ్యర్థి కూడా బరిలో ఉన్నప్పటికీ ప్రధాన పోటీ అవినాశ్, షర్మిల మధ్యనే అనే భావన ప్రజల్లో ఏర్పడింది. తన తండ్రి వివేకా హత్య కేసులో న్యాయం జరగాలంటే జగన్మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి రాకూడదని డాక్టర్ సునీత ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. మరోవైపు రాజశేఖర రెడ్డి బిడ్డగా న్యాయం, ధర్మం కోసం తనకు అండగా నిలవాలని ఓటర్లను షర్మిల వేడుకుంటున్నారు.

పని చేయని 'మైండ్‌గేమ్'...

ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర ఇడుపులపాయ నుంచి ప్రారంభమైంది. అయితే కడప జిల్లాలో కూడా బస్సు యాత్రకు స్పందన అంతంత మాత్రంగానే లభించింది. ఇడుపులపాయ నుంచి ప్రారంభమైన బస్సు యాత్రలో పాల్గొనడానికి ఇతర జిల్లాలకు చెందిన వైసీపీ నాయ-కులు కూడా వెళ్లారు. ఇలా వెళ్లిన కొంతమంది నాయకులు కడప జిల్లా ప్రజల మనోగతాలను గుర్తించి ఇతర పార్టీలలో చేరేం-దుకు దారులు వెదుక్కుంటున్నారు. కడప, కర్నూలు, అనంత-పురం, చిత్తూరు, నెల్లూరు జిల్లాలలో బస్సు యాత్ర ముగిసింది. రోత మీడియాతోపాటు కూలి మీడియా ప్రచారం ఎలా ఉన్నప్ప-టికీ ప్రజల నాడి ఏమిటో ముఖ్యమంత్రి జగన్‌కు అవగతమవు-తోంది. దీంతో ఆయన మరో మాయోపాయానికి తెరతీశారు. బీజేపీతో తెలుగుదేశం—జనసేన పార్టీల మధ్య పొత్తు కుదిరిన తర్వాత ఈ సరికొత్త ఎత్తుగడను జగన్ అండ్ కో అమలు చేస్తు-న్నారు. పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించిన కొన్ని సీట్ల విషయంలో కొంత వ్యతిరేకత ఏర్పడింది. దీన్ని ఆసరాగా చేసు-కున్న జగన్ అండ్ కో పొత్తుల తర్వాత జగన్మోహన్ రెడ్డి గ్రాఫ్ పెరిగిందని, కూటమి బలం క్షీణించిందని ప్రచారం చేయడం మొదలుపెట్టింది. దీనికి దన్నుగా కొన్ని సర్వే సంస్థలకు డబ్బు-లిచ్చి తమ ప్రచారానికి మద్దతుగా సర్వే వివరాలు అంటూ కొన్ని గణాంకాలను జనంలోకి వదలడం మొదలుపెట్టారు. ఈ మర్మం తెలియని జగన్ వ్యతిరేకులు సైతం ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఈ మధ్య బలపడ్డారట కదా? అని ప్రశ్నించడం మొదలైంది. వాస్త-వానికి ఇదంతా జగన్ అండ్ కో ఆడుతున్న మైండ్ గేమ్. క్షేత్ర స్థాయిలో జగన్ బలం పెరగడానికి ఈ పక్షం రోజులలో చోటుచేసుకున్న మార్పులు, పరిణామాలు కూడా లేవు. ప్రజలతో మైండ్ గేమ్ ఆడటం జగన్ అండ్ కోకు కొత్త కాదు. వివేకా హత్య, కోడికత్తి కేసుల విషయంలోనూ ఇలాగే చేశారు. క్షేత్ర-స్థాయిలో జగన్‌కు బలం పెరిగిన విషయం వాస్తవమే అయితే ఇతర పార్టీలకు చెందినవారు వైసీపీలో చేరడానికి పోటీ పడేవారు. వాస్తవంలో అలా జరగడం లేదు. కొన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలలో అభ్యర్థులకోసం వైసీపీ వెదుక్కోవాల్సిన పరిస్థితి. తెలుగుదేశం, జనసేన పార్టీలలో చేరేందుకు వైసీపీకి చెందినవారే పోటీ పడుతున్నారు. టికెట్ ఇస్తామన్న హామీ ఇస్తే ఇదివరకే వైసీపీలో టిక్కెట్ పొందినవారు కూడా ఈ రెండు పార్టీలలో చేరడానికి సిద్ధంగా ఉన్నారు. వాస్తవ పరిస్థితి ఇది కాగా, జగన్ బలం పెరిగిందని కృత్రిమ ప్రచారానికి తెర లేపారు. పింఛన్ల విషయమే తీసుకుందాం! వలంటీర్ల ద్వారా పింఛన్లు వగైరా పంపిణీ చేయడానికి వీలు లేదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చింది. దీన్ని ఆసరాగా చేసుకొని పెన్షన్ల పంపిణీలో జాప్యం చేస్తూ అందుకు ప్రతిపక్షాలే కారణమని నమ్మించడానికి జగన్ అండ్ కో ప్రయత్నించింది. అయితే, ఆచరణలో ఇది కూడా విక-టించింది. వలంటీర్ వ్యవస్థ అమలులో లేని రాష్ట్రాలలో పెన్షన్లు పంపిణీ కావడం లేదా? అని హైకోర్టు కూడా ప్రశ్నించడంతో ప్రజలు కూడా వాస్తవాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ కుయుక్తు-లను అర్థం చేసుకున్నారు. శవ రాజకీయాలకు చెక్ పెట్టారు.

ఎవరు 'ముసలోడు'?

ఈ ఎన్నికలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఎంత ముఖ్యమో ప్రతిపక్ష నేత చంద్రబాబుకు అంతకంటే ముఖ్యం. వయసు రీత్యా ఈ ఎన్నికల్లో విజయం సాధించడం చంద్రబాబుకు చాలా అవసరం. ఈ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రాలేని పక్షంలో చంద్రబాబు రాజకీయ జీవితం ఫెయిల్యూర్‌తో ముగిసే ప్రమాదం ఉంది. అందుకే ఆయన మండుటెండలను సైతం లెక్క చేయకుండా, ముఖంలో ఎక్కడా అలసట కనపడనీయకుండా రోజుకు మూడు చోట్ల సభలు నిర్వహిస్తున్నారు. యువకుడినైన తనకు ముసలోడితో పోటీ ఏమిటని ఎద్దేవా చేస్తున్న ముఖ్య-మంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రం రోజుకు ఒక మీటింగ్‌తోనే సరి-పెడుతున్నారు. అది కూడా సాయంత్రం పూట ఎండ వేడి తగ్గాక బయటకు వస్తున్నారు. దీంతో ఏడు పదులు దాటిన చంద్ర-బాబుతో ఐదు పదులు దాటిన జగన్మోహన్ రెడ్డి పోటీ పడలేక-పోతున్నారన్న అభిప్రాయానికి జనం కూడా వచ్చారు. చంద్ర-బాబుకు మాత్రమే కాదు, యువకుడినని చెప్పుకొంటున్న జగన్‌కు కూడా ఈ ఎన్నికలు ముఖ్యమే. తెలంగాణలో తొమ్మిది-న్నరేళ్లపాటు రారాజుగా వెలుగొందిన కేసీఆర్ ప్రస్తుత పరిస్థితి చూసిన తర్వాత ఈ ఎన్నికల్లో ఓడిపోతే జగన్మోహన్ రెడ్డి పరి-స్థితి కూడా అందుకు భిన్నంగా ఉండబోదన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. తెలంగాణ ఉద్యమ ప్రభావంతో రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చినా... భారత రాష్ట్ర సమితికి క్షేత్రస్థాయిలో పునాదులు బలహీనంగా ఉన్నాయని ఇప్పుడు తేటతెల్లం అయింది. రాజశేఖర రెడ్డి ప్రభావంతో అధికారంలోకి వచ్చిన వైసీపీ కూడా సంస్థాగతంగా బలహీనంగానే ఉంది. అధికారం లేకపోతే ఆ పార్టీ మనుగడ సాగించడం కష్టతరం. తెలుగుదేశం పార్టీకి క్షేత్రస్థాయిలో బలమైన కార్యకర్తలు ఉన్నారు. ఈ కారణంగానే నాయకులు లేకపోయినా, ఎన్నికల్లో ఓడిపోయినా ఆ పార్టీ నిలదొక్కుకుంది. దీనికి తోడు చంద్ర-బాబుకు భూదేవికి ఉన్నంత ఓర్పు ఉంది. ఫలితంగా పార్టీని కాపాడుకోగలిగారు. జగన్మోహన్ రెడ్డి పరిస్థితి వేరు. ముఖ్య-మంత్రిగా ఈ ఐదేళ్లలో ఆయన వైఖరి గమనించిన వారికి ఆయనతో బలమైన అనుబంధం ఏర్పడలేదు. దీనికితోడు ఆయన పాలనపై ఒక వర్గం ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. సంక్షేమ పథకాలే మళ్లీ తమను అధికారంలోకి తెస్తాయన్న నమ్మకంతోనే ఆ పార్టీలో ఉన్నవారు ఉన్నారు. అంతే తప్ప జగన్మోహన్ రెడ్డిపై నమ్మకం, అభిమానంతో కాదు. ఈ ఎన్నికల్లో ఓడిపోతే ఆ పార్టీ చెల్లాచెదురవుతుంది. జగన్ నిరాదరణకు గురైనవారు ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ పంచన చేరుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే వైసీపీలో అధిక సంఖ్యలో ఉన్నారు. ఎన్నికల్లో ఓడిపోతే వారంతా మళ్లీ కాంగ్రెస్ వైపు చూసే అవకాశం ఉంది. ఈ కారణంగానే జగన్ సోదరి షర్మిల కూడా 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే కాంగ్రెస్ నాయకత్వాన్ని చేపట్టడానికి సిద్ధ-పడ్డారు. గత ఎన్నికల్లో రాజశేఖర రెడ్డి కుటుంబమంతా జగన్మోహన్ రెడ్డికి అండగా ఉండింది. ఇప్పుడు ఆ కుటుంబంలో చీలిక రావడమే కాకుండా వివేకానంద రెడ్డి హంతకులను జగన్ కాపాడుతున్నారని ఇంట్లో వాళ్లే నిందిస్తున్నారు. ఇవన్నీ జగన్‌కు మైనస్ పాయింట్లు. ఈ నేపథ్యంలో మేలో జరిగే ఎన్నికలు జగన్మోహన్ రెడ్డి రాజకీయ భవిష్యత్తును కూడా నిర్ణయించ-బోతున్నాయి. గత ఎన్నికల్లో జగన్‌కు ఎంతో కొంత రాజకీయంగా ఉపయోగపడిన వివేకా హత్య రానున్న ఎన్నికల్లో ఆయనకు ఏ మేరకు నష్టం చేయబోతుంది అన్నదే ప్రస్తుతం కీలకం. ఆంధ్ర-ప్రదేశ్ ప్రజలు అన్న జగన్ మాటలను విశ్వసిస్తారా? తోబుట్టు-వులైన షర్మిల, సునీతల ఆక్రందనలను ఆలకిస్తారా? అన్నది జూన్ 4వ తేదీన తేలిపోతుంది. ఈ ఎన్నికల్లో జగన్ మళ్లీ గెలిస్తే వివేకా హత్యకు కారకులైన వారు నిక్షేపంగా ఉంటారు. ఓడిపోతే మాత్రం వారు చట్టం ముందు దోషులుగా నిలబడక తప్పదు. ఈ ఐదేళ్లుగా డాక్టర్ సునీత అలుపెరుగకుండా చేస్తున్న ఒంటరి పోరాటం ఫలిస్తుందా? లేదా? అన్నది వేచి చూడాల్సిందే! కలి ప్రభావం ఇంకెంత కాలం ఉంటుందో కూడా తెలియాలంటే

> **గత ఎన్నికల్లో రాజశేఖర రెడ్డి కుటుంబమంతా జగన్మోహన్ రెడ్డికి అండగా ఉండింది. ఇప్పుడు ఆ కుటుంబంలో చీలిక రావడమే కాకుండా వివేకానంద రెడ్డి హంతకులను జగన్ కాపాడుతున్నారని ఇంట్లో వాళ్లే నిందిస్తున్నారు. ఇవన్నీ జగన్‌కు మైనస్ పాయింట్లు.**



> **రోత మీడియాతోపాటు కూలి మీడియా ప్రచారం ఎలా ఉన్నప్పటికీ ప్రజల నాడి ఏమిటో ముఖ్యమంత్రి జగన్‌కు అవగతమవుతోంది. దీంతో ఆయన మరో మాయోపాయానికి తెరతీశారు. బీజేపీతో తెలుగుదేశం–జనసేన పార్టీల మధ్య పొత్తు కుదిరిన తర్వాత ఈ సరికొత్త ఎత్తుగడను జగన్ అండ్ కో అమలు చేస్తున్నారు. పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించిన కొన్ని సీట్ల విషయంలో కొంత వ్యతిరేకత ఏర్పడింది. దీన్ని ఆసరాగా చేసుకున్న జగన్ అండ్ కో పొత్తుల తర్వాత జగన్మోహన్ రెడ్డి గ్రాఫ్ పెరిగిందని, కూటమి బలం క్షీణించిందని ప్రచారం చేయడం మొదలుపెట్టింది. దీనికి దన్నుగా కొన్ని సర్వే సంస్థలకు డబ్బిచ్చి తమ ప్రచారానికి మద్దతుగా సర్వే వివరాలు అంటూ కొన్ని గణాంకాలను జనంలోకి వదలడం మొదలుపెట్టారు. ఈ మర్మం తెలియని జగన్ వ్యతిరేకులు సైతం ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఈ మధ్య బలపడ్డారట కదా? అని ప్రశ్నించడం మొదలైంది. వాస్తవానికి ఇదంతా జగన్ అండ్ కో ఆడుతున్న మైండ్ గేమ్. క్షేత్ర స్థాయిలో జగన్ బలం పెరగడానికి ఈ పక్షం రోజులలో చోటు చేసుకున్న మార్పులు, పరిణామాలు కూడా లేవు. ప్రజలతో మైండ్ గేమ్ ఆడటం జగన్ అండ్ కోకు కొత్త కాదు.**

> **వలంటీర్ల ద్వారా పింఛన్లు వగైరా పంపిణీ చేయడానికి వీలు లేదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చింది. దీన్ని ఆసరాగా చేసుకొని పెన్షన్ల పంపిణీలో జాప్యం చేస్తూ అందుకు ప్రతిపక్షాలే కారణమని నమ్మించడానికి జగన్ అండ్ కో ప్రయత్నించింది. అయితే, ఆచరణలో ఇది కూడా వికటించింది. వలంటీర్ వ్యవస్థ అమలులో లేని రాష్ట్రాల్లో పెన్షన్లు పంపిణీ కావడం లేదా? అని హైకోర్టు కూడా ప్రశ్నించడంతో ప్రజలు కూడా వాస్తవాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ కుయుక్తులను అర్థం చేసుకున్నారు. శవ రాజకీయాలకు చెక్ పెట్టారు. ఈ ఎన్నికలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఎంత ముఖ్యమో ప్రతిపక్ష నేత చంద్రబాబుకు అంతకంటే ముఖ్యం. వయసు రీత్యా ఈ ఎన్నికల్లో విజయం సాధించడం చంద్రబాబుకు చాలా అవసరం. ఈ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రాలేని పక్షంలో చంద్రబాబు రాజకీయ జీవితం ఫెయిల్యూర్‌తో ముగిసే ప్రమాదం ఉంది. అందుకే ఆయన మండుటెండలను సైతం లెక్క చేయకుండా, ముఖంలో ఎక్కడా అలసట కనపడనీయకుండా రోజుకు మూడు చోట్ల సభలు నిర్వహిస్తున్నారు.**

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

మతాన్ని చరిత్ర అంగీకరించదు

మతం చరిత్రగా, చరిత్ర మతంగా మారిపోతున్న సమయంలో చరిత్రకు మతానికి ఉన్న సంబంధం ఏమిటనేది ప్రశ్నించు-కుని సమాధానం రాబట్టుకోవలసి ఉంది. అందరికీ తెలిసిన విషయాలు కొన్ని చూస్తే మతం— వస్తువు దేవుడు. చరిత్ర ఇతివృత్తం— మనిషి. మతం తనను అనాది అంటుంది. చరిత్రకు గతం పునాది. మతం విశ్వాసం మీద నిర్మింపబడు-తుంది. చరిత్ర నిజం మీద నిలబడుతుంది. మతానికి చరిత్ర ఉంటుంది కానీ చరి-త్రకు మతం ఉండదు.

మతం హఠాత్తుగా మొదలౌతుంది. దేవుడు అనంతమైన విశ్వాన్ని, చరాచర జీవకోటిని సృష్టించాడని అంటుంది. ఆ శక్తి సకల చేతనాచేతనాలలోకి విస్తరించి ఉంటుందని విశ్వసిస్తుంది. శ్రీరాముడిగా శ్రీకృష్ణుడిగా అవతారాలెత్తాడని స్థిరీకరి-స్తుంది. అయితే చరిత్ర ప్రతి అంశంలో ఒక పరిణామాన్ని చూసినట్లే మతంలోనూ చూస్తుంది. చరిత్ర ఆస్తికురాలూ కాదు, నాస్తికురాలూ కాదు. పరమ అజ్ఞేయవాది. అది భగవంతుని అస్తిత్వం గురించి విచికిత్స చేయదు. దేవుడు మతాన్ని సృష్టించడం గురించి మాట్లాడదు కానీ మతం దేవుణ్ని సృష్టించుకోవడం గురించి వివరిస్తుంది. తనను పోలిన మనిషిని దేవుడు సృష్టించడం తెలియదు కానీ, తనను పోలిన దేవుణ్ణి మనిషి సృష్టించుకున్నాడంటుంది. స్థూలంగా దేవుడు చేసిన మనుషుల గురించి మతం మాట్లాడితే, మనుషులు చేసిన దేవుడి గురించి చరిత్ర మాట్లాడుతుంది.

మనిషి ప్రారంభ దశలో పశుప్రాయుడనీ పశువు మాదిరిగానే దిగంబరుడనీ, లైంగిక విచక్షణ లేనివాడనీ, ఆహార సేకరణే గానీ ఆహార ఉత్పత్తి తెలియదనీ ఆధారాలతో సహా రుజువు చేస్తుంది చరిత్ర. మతం— భగవంతుడు మనిషిని అనాగరికంగా సృష్టిస్తే అతడు రాతి, రాగి, కంచు యుగాల్ని అధిగమించి ఇనుప యుగంలోకి ప్రవేశించాడని గానీ, ఆహార సేకరణ, పశుపాలక సమాజాల్ని దాటుకుని వ్యావసాయిక సమాజంలోకి చేరుకున్నాడని గానీ చెప్పదు. మతానికి ఈ పరిణామాలతో సంబంధం లేదు. అది దేశ వ్యాపితంగా లభ్యమౌతున్న పనిముట్లు, ఆయుధాల వంటి వేలాది ఆధారాలను నిర్దాక్షిణ్యంగా పక్కకు తోసి-వేస్తుంది. కానీ చరిత్ర ఆ అపురూప సంపదల్ని పదిలపరచి వాటి ఆధారంగా మానవ పురాతన గతాన్ని పునర్నిర్మిస్తుంది.

వేదవాఙ్మయం అంతా దేవసృష్టి అంటుంది మతం. అయితే చరిత్ర... దేవత-లకు— పూర్వ మానవులు అనే అర్థం చెప్పడంతో ముడి విడిపోయింది. రుగ్వేదం అంతా తొలినాటి ఆర్యగణాల్లో సృజనాత్మకత, పారలౌకిక దృష్టి ఉన్న రసహృద-యులు కొందరు ప్రాకృతిక అంశాలను ఆవాహన చేస్తూ ఆశువుగా చేసిన రచనల సమాహారమే తప్ప, ఆదిభౌతిక శక్తులు సృష్టించినది కాదని చెప్పింది. యజుర్వేదంలో యజ్ఞాది కర్మకాండల నిర్వహణ, సామవేదంలో రుగ్వేద మంత్రాల ఆలాపనా విధానం తప్ప, రహస్యాలేవీ లేవని తేల్చి వేసింది. వేదం తొలి భాగమైన సంహిత మాత్రమే తొలినాటి రచన అనీ వేదాంగాలని పిలువబడిన బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు అనంతరకాలపు రచనలు అనీ, రుగ్వేద రచన క్రీ.పూ. 2000—1500 మధ్య కాలంలో జరిగిందనీ, ఉపనిషత్తులు క్రీ.పూ. 800—600 మధ్య కాలానికి చెందినవనీ కాల నిర్ణయం చేసింది. చరిత్ర ఈ నిర్ణయంలో మానవుల నాగరికతాభివృద్ధినీ, భాషా లిపుల పరిణామాన్ని పరిగణనలోకి తీసుకుంటుంది. లిపి రూపొందకపోవడమే వేదాలు లిఖితరూపం తీసుకోకపోవడానికీ, కేవలం అనుశ్రుతంగా వల్లె వేయడానికి కారణమనీ నిర్ధారించింది. మతానికి ఈ గొడవ-లేమీ లేవు. నారాయణుడి నాభి నుంచి పుట్టిన కమలంలో ఉద్భవించిన బ్రహ్మ ముఖం నుంచి వేదాలు పుట్టాయని చెప్పేస్తుంది. వ్యాసుడనే రుషి ఒక్కటిగా ఉన్న వేదాలను నాలుగుగా విభజించాడని అనేస్తుంది. సోమకుడనే అసురుడు వాటిని ఎత్తుకుపోయి సముద్రంలో దాక్కుంటే విష్ణువు మత్స్యావతారమెత్తి రక్షించాడని అంటుంది. మధ్యయుగాల దాకా లిపిబద్ధం కాని వేదాలను ఏ రూపంలో ఉండగా సోమకుడు ఎత్తుకుపోయాడో మతానికి సంబంధం లేదు.

> **మతం తనను అనాది అంటుంది. చరిత్రకు గతం పునాది. మతం విశ్వాసం మీద నిర్మింపబడుతుంది. చరిత్ర నిజం మీద నిలబడుతుంది. మతానికి చరిత్ర ఉంటుంది కానీ చరిత్రకు మతం ఉండదు. మతం హఠాత్తుగా మొదలౌతుంది. దేవుడు అనంతమైన విశ్వాన్ని, చరాచర జీవకోటిని సృష్టించాడని అంటుంది. ఆ శక్తి సకల చేతనాచేతనాలలోకి విస్తరించి ఉంటుందని విశ్వసిస్తుంది. శ్రీరాముడిగా శ్రీకృష్ణుడిగా అవతారాలెత్తాడని స్థిరీకరిస్తుంది. అయితే చరిత్ర ప్రతి అంశంలో ఒక పరిణామాన్ని చూసినట్లే మతంలోనూ చూస్తుంది.**



మతంలో మాదిరిగా చరిత్రలో విష్ణు, బ్రహ్మాది దేవతలు ఆది యందు ఉండరు. రుగ్వేద దేవతలలో వరుణుడిది ప్రథమస్థానం. ఇతడు దేవతలకు రాజు. తర్వాతి స్థానం యుద్ధదేవత అయిన ఇంద్రుడిది. కాగా మూడు, నాలుగు స్థానాలు అగ్ని, సోమదేవులవి. ఆకాశదేవత అయిన ద్యుస్, భూదేవత పృథ్వి, సకల దైవాల తల్లి అదితి, పశుసంరక్షక పూషన్, ఉషస్సుకు దారిచూపే అశ్వనీదేవతలు అప్పటి ఇతర దేవతలు. రుగ్వేదంలో అనేకులుగా ఉన్న సూర్యదేవతల్లో ఒకడిగా తొలిసారి కనిపించిన విష్ణువు అనంతర కాలంలో త్రిమూర్తుల్లో ముఖ్యుడిగా పరిణామం చెందాడు. మలివేదకాలపు ప్రధాన దేవత ప్రజాపతి తరువాతి కాలంలో ఎందుకో మరి కనిపించకుండా పోయాడు. సింధులోయ నాగరికతలో కొమ్ముల దేవుడిగా కనిపించిన పశుపతి, రుద్రుడై, శివుడై ఆర్య ద్రావిడ సంస్కృతీ సమ్మేళనానికి నిదర్శనంగా విష్ణువుతో కలిసి త్రిమూర్తుల్లో స్థానం పొంది మొదటిస్థానానికి పోటీదారు అయ్యాడు. తనకు ప్రాతినిధ్యం వహించే వర్గమేదీ లేకపోవడం వల్ల బ్రహ్మ పూజార్హత కోల్పోవలసి వచ్చింది. మొత్తం మీద ముగ్గురూ ముందుకొచ్చే-సరికి మిగిలినవాళ్లంతా వెనుక స్థానాల్లో సర్దుకున్నారు. మానవ నాగరికతలో ఒక పనిముట్టో, ఒక వ్యవస్థో మానవ చేతన ననుసరించి వివిధ రూపాలను తీసుకున్నట్టు దేవుడు, మతభావనలు కూడా రకరకాల రూపాలు తీసుకుంటాయనే చారిత్రక దృక్కోణం నుంచి మతాన్ని పరిశీలిస్తే కనిపించే దృశ్యం ఇది.


ఎంత చర్చించినా ఇంకా చర్చించవలసిన అంశం దేవ—దానవ సంఘర్షణ. మతం దేవతలు, రాక్షసులు ఇద్దరూ మనుషులే కాదన్నట్టు, వారి మధ్య యుద్ధాలు ఏవో లోకాల్లో జరిగినట్టూ మాట్లాడుతుంది. మతం దృష్టిలో మనుషుల కంటే దేవ-తలు ఉన్నతులు, రాక్షసులు అధములు. అయితే ఇద్దరూ మనుషులేననీ, ఇది ఆర్య, ద్రావిడ సంఘర్షణ అనీ అంటుంది చరిత్ర. పట్టుధోవతీలు కట్టుకుని, కంఠాభరణాలు, భుజకీర్తులు, కిరీటాలు ధరించి పసుపుపచ్చగా మిసమిసలాడుతూ కనిపించే దేవతల్నీ... మిడిగుడ్లతో, బండ పెదవులతో, బానపొట్టలతో జుగుప్స కలిగించే కరిమబ్బుల్లాంటి రాక్షసుల్నీ మన ఊహల్నించి చెరిపివేయగలిగితే ప్రాథమికంగా వరుసగా తెల్లగా, నల్లగా ఉండే ఆర్య, ద్రావిడ జాతులు ప్రత్యక్ష-మౌతాయి. దేవతలు చేసే యజ్ఞాది క్రతువులను రాక్షసులు విచ్ఛిన్నం చేసేవారనే ఉదంతాలకు, భిన్నమైన పూజా పద్ధతులు గల ప్రోటో ఆ[illegible]యిడ్‌లు, ద్రావిడులు అనే స్థానిక జాతులు కొత్తగా దేశంలోకి ప్రవేశించి యజ్ఞం ఆరాధనా విధానంగా కలిగిన ఆర్య జాతిని ప్రతిఘటించాయనే సహేతుకమైన అర్థం చెబుతుంది చరిత్ర.

సంఘర్షణతో మొదలైనా సహజీవనం అనివార్యమై సమ్మేళనానికి దారితీసిన ఆర్య, ద్రావిడ సంస్కృతులకు ప్రతినిధి దేవతలు శివుడు, విష్ణువూ. ఇద్దరి మధ్యా జరిగిన ఆధిపత్య పోరాటం రెండు సంస్కృతుల మధ్య జరిగిన పోరాటమే. తమ గోవులకు పచ్చికబయళ్లను అన్వేషించుకుంటూ దేశంలోకి ప్రవేశించి, స్థానిక నాగజాతిని అణగదొక్కిన ఆర్యుల దేవుడు పాలకడలిలో శేషతల్పమున కాక ఎక్క-డుంటాడు? ఆదివాసుల దేవుడైనందుకు శివుడు సృష్టి సాధనమైన లింగరూపంలో ఆరాధించబడి శ్మశానాలలో సంచరించే జంగమదేవరే కదా అవుతాడు! విజేత మతం— చరిత్ర రాస్తే దశావతారాలూ తమ దేవుడికే దక్కి, హాలాహలం మాత్రం ఓడినవాడి గొంతుకు అడ్డం పడుతుంది. భస్మాసుర కథైనా, మోహినీ వృత్తాంతమైనా సమస్య సృష్టించడం తెలివితక్కువవాడి వంతైతే పరిష్కరించడం మన వంతు. ఇది అటుంచితే, చరిత్ర ఈ ఇద్దరు దేవుళ్లనీ రెండు పరిణామ దశలుగానే చూస్తుంది. నడుము చుట్టూ జంతుచర్మమూ, మెడలో పాము, క్షణికావేశము, నిష్కపటత్వమూ, భోళాతనమూ నాగరిక పూర్వమానవుడి లక్షణాలు. ఇక వస్త్రధారణ మొదలు శంఖ-చక్రాలు, మెడలో పూలమాల, కిరీటం, సమస్యని పరిష్కరించుకోగల తెలివితేటలు, చాకచక్యమూ అనంతరకాలపు మానవుడి లక్షణాలు. ఇవే ఇద్దరిలో ప్రతిఫలించా-యంటుంది చరిత్ర.

ఉత్తమ లక్షణాలున్న మనుషులకు దైవత్వం ఆపాదించడం కోసం దేవుణ్ణి అవ-తారాలెత్తించడం మతం చేసే ఒక విన్యాసం. చారిత్రకవ్యక్తి కంటే పౌరాణికవ్యక్తికి అవతారపురుషుడు కాగలిగే వెసులుబాటు ఎక్కువ ఉంటుంది. ఈ పరిణామాన్ని మత చరిత్రలో భాగంగా చూస్తుంది చరిత్ర. మతం కృష్ణుణ్నో, రాముణ్నో విష్ణువు అవతారం చెయ్యడానికి చాలా శ్రమపడుతుంది. వాళ్ల చుట్టూ గాథలల్లుతుంది. ఇతిహాసాలు రచింపచేస్తుంది. సంకీర్తనలు రాసి గానం చేస్తుంది. కుదరకపోతే చివరకు 'అంతా నేనే, నువ్వు నిమిత్తమాత్రుడివి' అని ఆయన చేతే గీతాబోధ చేయిస్తుంది. పిల్లలతో ఆడుకుంటూ అన్నం తినడమే మరచిపోయిన బాలకృష్ణుణ్ని రమ్మని పిలుస్తూ యశోద పాడే ఒక జానపదగీతంలో ఎన్ని రకాల ఆశలు చూపిస్తూ రమ్మని పాడినా కృష్ణుడు రాడు. అప్పుడు 'యదువంశ ధీరాయ, శ్రీమన్నారాయణ వాసుదేవ వేగ రావేరా' అంటుంది. అనగానే 'నారాయణ యంచు నవ్వుతు పిలచితే నాడే వత్తునింత సేపేలా' అని బదులిస్తాడు. నారాయణుడంటేనే పలుకుతాను అనడం మన చేత పలికించడం కోసమే. మహాభారతంలో అనేక సందర్భాలలో ధృతరాష్ట్రుడు, భీష్ముడు, ద్రౌపది మొదలైన పాత్రలు పదేపదే 'నువ్వే వాసుదేవుడివి, నువ్వే వాసుదేవుడివి' అని కృష్ణుణ్ణి అనడం మనచేత అంగీకరింప చెయ్యడానికే. పౌండ్రక వాసుదేవుడి ఉదంతం వాసుదేవుడి స్థానం కోసం మరి-కొందరు ప్రయత్నించారని చెబుతుంది. అవతారాల పరిణామాన్ని సారస్వతంతో పాటు ఇతర ఆధారాలతో బేరీజు వేస్తుంది చరిత్ర. కృష్ణావతారాన్ని వైదిక మతం హిందూమతంగా మారే సంధిదశగా గుర్తించారు చరిత్రకారులు.

మతానికి ఇదేమీ పట్టదు. వేదాలను, శృతులను స్మృతులను, ఇతిహాసాలను, పురాణాలను, కలగూరగంపను చేస్తుంది. ఎప్పుడేది కావాలంటే దాన్ని పైకి తీస్తుంది. దేని[illegible] దేనిగానైనా మారుస్తుంది. ముందునూ వెనుకనూ, భూమినీ ఆకాశాన్ని ఏకం చేస్తుంది. స్థలకాలాలూ హేతువు దానికి పూచిక పుల్లలు. ఊహలూ, కట్టుకథలు పట్టుకొమ్మలు.

■ కొప్పర్తి వెంకటరమణమూర్తి





గూడూరు మండలం మదనాపురంలో వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై మాట్లాడుతున్న త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి


దేవాలయాలు.. ఆధ్యాత్మిక కేంద్రాలు..

7

- సర్వప్రాణులు దైవస్వరూపమే..
- బుద్ధిని బట్టి మనిషి ఉన్నతమైన ప్రాణిగా రూపొందాడు..
- ఆధ్యాత్మిక కేంద్రాలే.. పరివర్తన క్షేత్రాలు..
- త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి



గామి చిత్ర బృందంతో మాటామంతీ



హంగర్ గేమ్ మాస్టర్ చెఫ్ ఈవెంట్

జోరుగా హుషారుగా..

7

- రెండో రోజు కొనసాగిన స్ప్రింగ్ స్ప్రీ
- నిట్‌లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- ఆకట్టుకున్న పలు కార్యక్రమాలు, గేమ్స్
- అలరించిన సినీ నిర్మాత, డైరెక్టర్ల టాక్ షో..



నిర్మాణ రంగం కుదేలు!

- భారీగా పెరిగిన సామగ్రి ధరలు
- టన్ను ఇసుక రూ.2వేల పైమాటే..
- కృత్రిమ కొరతతో భారీగా పెరుగుతున్న రేటు
- సిమెంట్, స్టీల్, కంకర, ఇటుక, కరెంట్ సామగ్రి ధరలదీ అదే పరిస్థితి
- భారీగా పెరిగిన దినసరి కూలీ, మేస్త్రీల కూలి రేట్లు
- సామాన్యుల సొంతింటి కలలపై ధరల దరువు
- ముందుకు సాగని అభివృద్ధి పనులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

నిర్మాణరంగంపై ధరలు దరువేస్తున్నాయి. అకాశాన్నంటిన నిర్మాణ సామగ్రి ధరలతో సామాన్యుడే కాదు బడా బిల్డర్లు కూడా భయపడే పరిస్థితి నెలకొంది. ఇసుక.. స్టీల్, సిమెంట్, ఇటుక, కంకర, కరెంట్ సామగ్రి.. ఇలా అన్నింటి ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇప్పటికే నిర్మాణ పనులు మొదలు పెట్టినా పెరిగిన ధరలతో ఎక్కడి పనులు అక్కడే నిలిపి వేయాల్సిన దుస్థితి ఏర్పడింది. సామగ్రితో పాటు రోజు వారి కూలీలకు, మేస్త్రీకి ఇచ్చే కూలీ రేట్లు కూడా పెరిగిపోతున్నాయి. దీంతో నిర్మాణం రంగం కుదేలవుతుంది.

భవన నిర్మాణ రంగంపై పెరిగిన సామగ్రి ధరలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. రెండు నెలలుగా ధరలు ఒకదానికంటే మరొకటి పోటీ పడి ధర పెరుగుతుండటంతో సొంతింటి కల కోసం తాపత్రాయ పడే సామాన్యులతో పాటు భారీ భవనాలు నిర్మించే బిల్డర్ల వరకు బెంబేలెత్తిపోతున్నారు. ఇంటి నిర్మాణంలో కీలకమైన ఇటుక ధరలు అకాశాన్నంటుతున్నాయి. లైట్ వెయిట్ మట్టి ఇటుకలకు ట్రాక్టర్ (2వేల) మొన్నటి వరకు రూ.15,000 వరకు తీసుకునేవారు. ప్రస్తుతం నిర్మాణాలు ఊపందుకోవటంతో వ్యాపారులు ధరలను భారీగా పెంచారు. ప్రాంతాన్ని బట్టి 2వేల ఇటుకలు ఉండే ట్రాక్టర్ లోడ్‌కు రూ.19వేల నుంచి రూ.21వేల వరకు విక్రయిస్తున్నారు. ఒక ట్రాక్టర్‌కే నాలుగు వేల నుంచి ఆరు వేల రుపాయలకు అదనపు భారం పడుతోంది. అలాగే స్టీల్ (ఇనుప చువ్వలు) ధరలు రోజుకో రేటుతో సామాన్యుడిని ముప్పుతిప్పలకు గురి చేస్తున్నాయి. ఐఎస్ఐ ముద్ర గల బ్రాండెడ్ స్టీల్ టన్నుకు రూ.4,200 నుంచి రూ.5వేల వరకు విక్రయించారు. అయితే ప్రస్తుతం బంగారం ధరల మాదిరిగానే స్టీల్ ధరలు రోజుకో ధర తెరపైకి తెస్తున్నారు. ప్రస్తుతం బ్రాండెడ్ స్టీల్ టన్ను (బార్) కు రూ.5,000 నుంచి రూ.7,500 వరకు విక్రయిస్తున్నారు. కొంచెం తక్కువ నాణ్యత గల స్టీల్ టన్నుకు రూ.4,500 నుంచి రూ.6,200 వరకు విక్రయిస్తున్నారు. రోజు రోజుకు స్టీల్ ధరలు మారుతుండటంతో ఏ రోజు పెరుగుతుందో.. ఏ రోజు తగ్గుతుందో తెలియక సామాన్యులు స్టీల్ కొనుగోలులో గందరగోళానికి గురవుతున్నారు. దీంతో స్టీల్‌పై టన్నుకు అదనంగా రూ.1,200 నుంచి రూ.2వేల వరకు భారం మోయాల్సి వస్తోందని నిర్మాణదారులు వాపోతున్నారు.



సిమెంట్, ఇసుక బంగారమాయే...

నిర్మాణంలో కీలకమైన ఇసుక, సిమెంట్ ధరలకు రెక్కలొచ్చాయి. రెండు, మూడు నెలల క్రితం టన్ను ఇసుకను వరంగల్ మార్కెట్‌లో రూ.700 నుంచి రూ.850 వరకు విక్రయించారు. అయితే ఇటీవల కాలంలో ప్రభుత్వం కొత్త ఇసుక పాలసీ పేరుతో ఇసుక విక్రయాలపై అంక్షలు విధించింది. దీంతో ఇసుకాసురులు సిండికేట్‌గా మారి ఇసుక ధరలను భారీగా పెంచుతున్నారు. కాళేశ్వరం, ఏటూరునాగారం ఏరియాల్లో గోదావరి ఇసుక అన్ని పన్నులు కలుపుకొని టన్నుకు రూ.600కు లభిస్తుంది. అయితే అక్కడి నుంచి వరంగల్‌కు అయ్యే రవాణా ఖర్చులు కలుపుకొని రూ.800 వరకు విక్రయించాల్సి ఉంది. కానీ, ఇసుకాసురులు సిండికేట్‌గా మారి ఇసుకకు కృత్రిమ కొరత సృష్టించి ధరలను భారీగా పెంచి విక్రయిస్తున్నారు. టన్ను గోదావరి ఇసుకకు రూ.1,800 నుంచి రూ.2,200 వరకు వసూలు చేస్తున్నారు. ఒక టన్నుకు రూ.వెయ్యి నుంచి రూ.1,400 వరకు అదనంగా పిండుతున్నారు. ఒక 12టైర్ల లారీలో 28 టన్నుల ఇసుక లోడ్ చేస్తారు. దీనికి టీఎస్ఎండీసీకి రూ.10,976 వరకు డీడీ రూపంలో చెల్లిస్తారు. ఇదే ఇసుకను వరంగల్‌లో టన్నుకు రూ.2,200 చొప్పున 28టన్నులకు రూ.61,600కు విక్రయిస్తున్నారు. లారీ డీజిల్ ఖర్చు, డ్రైవర్ భత్యం పోగా, ప్రతిలారీ ఇసుక మీద రూ.30 వేలకు పైగా అదనంగా పిండుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక అమ్మకాలపై నియంత్రణ లేకపోవటంతో ఇష్టారాజ్యంగా ధరలు పెంచి విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అలాగే సిమెంట్ ధరలు సైతం బంగారం ధరలతో పోటీపడి పెరుగుతున్నాయి. మొన్నటి వరకు సిమెంట్ బస్తా రూ.320 వరకు విక్రయించారు. రెండు నెలలుగా సిమెంట్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. బంగారం ధరల మాదిరిగానే సిమెంట్ ధరలు కూడా రోజు రోజుకు మారుతున్నాయి. రూ.360కు బస్తా విక్రయించిన వ్యాపారులు శుక్రవారం ఒకేసారిగా రూ.50 అదనంగా పెంచి బస్తాకు రూ.410 వరకు వసూలు చేస్తున్నారు. దీంతో పాటు కంకర, కరెంట్ సామగ్రి ధరలు విపరీతంగా పెరిగి పోతున్నాయి. రెండు, మూడు నెలల నుంచి ధరలను అదుపు చేయకపోవటంతో వ్యాపారులు ఇష్టారీతిన విక్రయాలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.



అంచనాలను మించుతున్న ఖర్చులు

గృహ నిర్మాణ సామగ్రి ధరలు పెరగటంతో సామాన్యులు విలవిలలాడుతున్నారు. వరంగల్ నగరంలో ఓ చోట 100గజాల స్థలంలో సుమారు రూ.20లక్షల అంచనా వ్యయంతో ఇళ్లు మొదలు పెడితే, పెరిగిన ధరల కారణంగా మరో రూ.5లక్షల నుంచి రూ.8లక్షల వరకు అదనపు భారం పడుతోంది. దీంతో చాలా మంది ఇంటి నిర్మాణ పనులను మొదలు పెట్టినా మధ్యలో

మిగతా 8వ పేజీలో..

కూలీలకు భారీ డిమాండ్

ప్రతీ ఏటా కొత్త నిర్మాణాలు ఎక్కువగా వేసవిలోనే మొదలవుతాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు బిల్డర్ల అపార్ట్మెంట్‌లు, సొంతింటి నిర్మాణాలు కూడా వేసవిలోనే జోరందుకుంటాయి. కలిసి వచ్చే ముహూర్తాలతో పాటు వేసవిలో వ్యవసాయ పనులు తక్కువగా ఉండటంతో పాటు సెలవులు కూడా ఎక్కువగా ఉంటాయి. దీంతో చాలామంది వేసవిలోనే నిర్మాణ పనులు చేపడతారు. అయితే భవన నిర్మాణాల్లో పని చేసే కూలీల కొరత మరింత ఆందోళనకరంగా మారింది. చాలామంది భవన నిర్మాణాల్లో పనికి ఆసక్తి చూపడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చాలా గ్రామాల్లో వేసవిలో మొదలయ్యే ఉపాధి హామీ పనులకు వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో పట్టణాల్లో కూలీల కొరత తీవ్రమవుతుంది. గతంలో మేస్త్రీకి రోజు కూలీ రూ.800 నుంచి రూ.1,000 వరకు ఇచ్చే వారు. అయితే ప్రస్తుతం మేస్త్రీల రేటు భారీగా పెంచారు. ప్రస్తుతం మేస్త్రీకి రోజు కూలీ రూ.1,200 నుంచి రూ.1,500 చెల్లిస్తున్నారు. అలాగే మహిళా కూలీకి గతంలో రూ.400, పురుషుడికి రూ.600 చెల్లించేవారు. ప్రస్తుతం మహిళకు రూ.500, పురుషుడికి రూ.800 వరకు కూలి చెల్లించాల్సి వస్తోంది.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : ఆదివారం సా : 6.35 గం..
సహర్ : సోమవారం ఉ :4.42గం..

శనివారం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 41.5° C
కనిష్ఠం : 24.5° C

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రావొద్దు..

- బోర్లు, చేతి పంపుల ద్వారా అందించేందుకు చర్యలు తీసుకోవాలి
- మండల ప్రత్యేకాధికారులు సమీక్షలు నిర్వహించాలి
- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ గోపి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గోపి

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 6: వేసవికాలం నేపథ్యంలో తాగునీటి సరఫరాలో ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా తాగునీటి సరఫరా పరిశీలనపై నియమితులైన ప్రత్యేక అధికారి డాక్టర్ గోపి సూచించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో శనివారం హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో తాగునీటి సరఫరాపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి డాక్టర్ గోపి మాట్లాడుతూ.. జిల్లాలోని గ్రామాలు, ఆవాసాలకు తాగునీటి సరఫరాలో ఎక్కడ కూడా ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. వేసవికాలం దృష్ట్యా తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వాటిని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలన్నారు. బోర్లు, చేతి పంపుల ద్వారా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బోర్లు, చేతిపంపులు. పైపులైన్ల మరమ్మతులతో పాటు కొత్తవి కూడా చేపట్టాలని, అవసరమైనచోట వ్యవసాయ బావుల ద్వారా తాగునీరు అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. కిందటేడు కంటే ఈ యేడు తక్కువగా వర్షపాతం నమోదైందని, దీనివలన భూగర్భ జలాలు అడుగంటాయని, అయినప్పటికీ ప్రజలకు తాగునీరు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండలాలకు నియమితులైన ప్రత్యేక అధికారులు ప్రతీరోజు తాగునీటి సరఫరా, నిర్వహణపై సమీక్షలు నిర్వహించాలని ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి గోపి సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులు సమీక్షలు నిర్వహించి తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు.

అన్ని చర్యలు తీసుకుంటున్నాం..

హనుమకొండ జిల్లాలో తాగునీటికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బోర్లు, చేతిపంపులు, అవసరమైన చోట వ్యవసాయ బావుల ద్వారా త్రాగునీటిని అందిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలోని 13 మండలాల్లో తాగునీటి సరఫరాకు గ్రామపంచాయతీల వారిగా కార్యాచరణ ప్రణాళికతో తాగునీటి సరఫరాకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నర్సంపేట, దుగ్గొండి, నల్లబెల్లి మండలాల్లో వ్యవసాయ బావుల ద్వారా రూ.కోటి నిధులతో 1300 చేతిపంపులు, బోర్‌వెల్స్, పైపులైన్ల మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గ్రేటవర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. ధర్మసాగర్ నుంచి మూడు ఫిల్టర్ బెడ్ల ద్వారా వరంగల్ మహానగరంలోని 66 డివిజన్లకు తాగునీటి సరఫరా జరుగుతోందన్నారు. ఏజెన్సీ ద్వారా ఎప్పటికప్పుడు లీకేజీలు, మరమ్మతు పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా నగరంలో తాగునీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ జిల్లాలో తాగునీటి సరఫరా, నిర్వహణకు తీసుకుంటున్న చర్యల వివరాలను అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా వివరించారు. వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, జడ్పీ సీఈఓ విద్యాలత, డీఆర్‌డీఓ నాగ పద్మజ, డీపీఓ లక్ష్మీరమాకాంత్, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, గ్రామీణ నీటి సరఫరా, మిషన్ భగీరథ, మున్సిపల్ కార్పొరేషన్ సంబంధిత శాఖల అధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

ల్యాండ్‌ఫీల్ గ్యాస్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి

- నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- సేజింగ్ కమిటీ ప్రతినిధులతో సమావేశం



కొరియా ప్రతినిధుల నుంచి వివరాలు తీసుకుంటున్న కమిషనర్

ఎల్బీ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్

న్యూశాయంపేట, ఏప్రిల్ 6 : ములుగురోడ్‌లోని లాల్‌బహదూర్ కళాశాల(ఎల్బీ)లో శనివారం ఎంబీఏ విద్యార్థులకు ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవాలయాలు.. ఆధ్యాత్మిక కేంద్రాలు..

త్రిదండి శ్రీమన్నారాయణరామానుజ చిన్నజీయర్‌స్వామి



చిన్నజీయర్‌కు మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

గూడూరు, ఏప్రిల్ 6 : దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలని.. అవి మనిషిలో మంచి ప్రవర్తన తెచ్చే నిలయాలు కావాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి అన్నారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మదనాపురం గ్రామంలో శ్రీలక్ష్మి గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి నూతన దేవాలయ విమాన గోపుర ధ్వజ శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా శనివారం త్రిదండి శ్రీమన్నారాయణరామానుజ చిన్నజీయర్‌స్వామి ఆలయంలో పూజలు, ప్రవచనములు, భక్తుల ఆశీర్వాదం, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ సందర్భంగా చిన్నజీయర్‌స్వామి మాట్లాడుతూ.. దేవాలయాల్లో ప్రజలు, ప్రసాదాలే కాకుండా ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఉన్నాయని, అవి అందరికి మంచి చేసేలా ఉపయోగపడాలన్నారు. దేవాలయాలు, వాటిలో విగ్రహాలు మనస్సుకు అద్దంలా నిలుస్తాయన్నారు. మన ఆలోచన విధానంలో మార్పు తీసుకువచ్చేదే మంత్రమన్నారు. మంత్రం అంటే తరించే వారికి రచించేదేనని చెప్పారు. మనుషులు, జంతువులు, పక్షులు, క్రిమికీటకాలు, సూక్ష్మజీవులు చూస్తే అన్ని వేర్వేరే. కానీ, కలిసి సాగితే సుఖ జీవనమన్నారు. మంచి జీవితం కావాలంటే సహజీవనం అవసరం, అదే సమతా భావమని పేర్కొన్నారు. సమాజంలో ఎన్నో వికార పోకడలు, నేనే గొప్ప, నేనే నిలువాలన్న స్వార్థ చింతనలు పెరిగిపోయాయని చెప్పారు. ఈ తీరు మారాలి. మన ఇల్లు, మన ఊరు, సమాజం, దేశం, ప్రపంచమంతా సంతోషంగా ఉండాలన్నారు. ప్రకృతిలో మనిషే కాదు.. చెట్లు, జంతువులు, సూక్ష్మజీవులు ఎన్నో ఉన్నాయి.. అవి లేకుండా మనిషి ఉండలేడు, కానీ మనిషి లేకుండా అవి ఉండగలవన్నారు. కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో మనిషి ఇంటికే పరిమితమైతే ప్రకృతి పరవశించిన విషయాల్ని కళ్లారా చూశామని తెలిపారు. అందుకే మనం పదిలంగా ఉండాలంటే వాటిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అద్దం ఎట్లయితే ముఖాన్ని చూపిస్తుందో.. అలాగే విగ్రహం మనిషి మనస్సులోని దేవుడిని చూపిస్తుందన్నారు. అర్థమండపం ఎట్లా ఉండాలి, ముఖ మండపం ఎట్లా ఉండాలి, దేవాలయంలో గజ, జయ, ధ్వజ స్తంభాల వద్ద నమస్కారం చేసిన తర్వాత గర్భగుడిలో ఉన్న దేవతామూర్తుల వద్ద మొక్కులు చెల్లించుకోవాలని చెప్పారు. ప్రతీ వస్తువులో దేవుడు దాగి ఉన్నాడని, రాతి, లోహం, విగ్రహం, వస్త్రం, మట్టితో చేసిన బొమ్మలో సైతం దేవుడిలా కొలుస్తారని పేర్కొన్నారు. కదిలే ప్రాణులు, మనుషులకు, కదల్లేని ప్రాణులు, చెట్లు వాటికి స్థావరాలుగా ఉంటాయన్నారు. గ్రామంలో సంపదకు లోటు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. శిలాలోహం భగవంతుడి స్వరూపాలేనని అన్నారు. దేవాలయంలో విగ్రహాలు, శిల, ఉత్సవ రూపంలో ఉంటాయని స్పష్టం చేశారు.

సుధీర్‌రెడ్డి సేవలు భేష్..

మదనాపురం గ్రామంలో దేవాలయం ఉండాలని ఆకాంక్షించి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, గోశాల, గ్రామ దేవతలకు ఆలయాలు నిర్మించిన లింగాల సుధీర్‌రెడ్డి-రాధిక దంపతులను శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణరామానుజ చిన్నజీయర్‌స్వామి అభినందించారు. గ్రామంలో ఆధ్యాత్మిక సేవలు చేయడం సంతోషకరమన్నారు. ఉన్న ఊరును మరిచిపోకుండా ప్రజల సుఖసంతోషాల్లో భాగస్వాములు కావడం హర్షించదగ్గ విషయమన్నారు. రూ.1.50 కోట్ల సొంత ఖర్చులతో ఆధ్యాత్మిక ఆలయాలను నిర్మించడం అభినందనీయమన్నారు. దేవాలయంలో అన్ని వసతులను కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ఈ వేడుకల్లో లింగాల రోహిత్‌రెడ్డి-అనుపమ దంపతులు, లింగాల నితిన్‌రెడ్డి, సుప్రీంకోర్టు మాజీ జడ్జి ఎల్.నర్సింహారెడ్డి, మానుకోట ఎంపీ మాలోతు కవిత, హరిత, మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్, గూడూరు సొసైటీ చైర్మన్ చల్లా లింగారెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త శ్రీనివాస్‌రెడ్డి, సనాతన శివాలయం చైర్మన్ ఏపూరు రవీందర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, కంభంపాటి ప్రతాప్, మేరెడ్డి సురేందర్, యాదవరెడ్డి, రణధీర్‌రెడ్డి, బోడ కిషన్, మోతీలాల్, చెల్పూరి వెంకన్న, బండి వెంకన్న పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి ఆలయానికి వస్తున్న చిన్న జీయర్‌స్వామి

సరిహద్దులో అలజడి

కర్రెగుట్ట ఎన్‌కౌంటర్‌తో అలర్ట్

కూంబింగ్‌ను ముమ్మరం చేసిన గ్రేహౌండ్స్ పోలీసులు

ములుగు, ఏప్రిల్ 6: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు పూజారి కాంకేర్ పరిధి కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్ జిల్లాలో అలజడి సృష్టించింది. ఈ ఘటనలో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందడం, అందులో భూపాలపల్లి జిల్లా కాటారం మండలానికి చెందిన సంతోష్ అలియాస్ సాగర్ ఉండటం సంచలనం కలిగించింది. దీంతో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. కూంబింగ్‌ను ముమ్మరం చేశారు. ఆదిలాబాద్-మహారాష్ట్ర సరిహద్దులో ఇటీవల భారీ ఎన్‌కౌంటర్ జరిగి 13 మంది మావోయిస్టులు హతమైన నేపథ్యంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో జిల్లా పోలీసులు నిఘా పెంచారు. పౌరుల రాకపోకలపై కన్నేశారు. విస్తృతంగా వాహనాలను తనిఖీ చేయడంతోపాటు ఇన్‌ఫార్మర్ వ్యవస్థను అలర్ట్ చేశారు. తాజాగా ఇరు రాష్ట్రాల సరిహద్దు పోలీసులు వాజేడు మండలంలో సమావేశమయ్యారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతుండగా మావోయిస్టుల నుంచి ఎలాంటి అవాంఛనీయ ఘటన ఎదురవ్వకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిపించే విషయమై చర్చించినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు.

ఈ సమావేశంలో మావోయిస్టులకు చెక్‌పెట్టే పలు అంశాలపై ఇరు రాష్ట్రాల పోలీసులు సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకున్నట్లు తెలిసింది. వ్యూహాత్మకంగా అడుగులు వేసే క్రమంలో కర్రిగుట్ట అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నట్లు నిఘా వర్గాలు ఇచ్చిన సమాచారంతో గ్రేహౌండ్స్ పోలీసులు శుక్రవారం నుంచి సెర్చ్ ఆపరేషన్ మొదలు పెట్టినట్లు తెలిసింది. ఈ బలగాలకు ములుగు జిల్లా పోలీసులు, సరిహద్దు స్టేషన్లలో సుదీర్ఘకాలం పనిచేసి ఈప్రాంతంపై అవగాహన ఉన్న అధికారులను రంగంలోకి దించినట్లు సమాచారం. అనుకున్నట్టుగానే పోలీసులు టార్గెట్‌ను రీచ్ అయ్యారు. దీంతో ఓ రాష్ట్రస్థాయి నాయకుడితోపాటు మొత్తం ముగ్గురు సభ్యులను మావోయిస్టులు కోల్పోయారు. ఈ ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుండటంతో అక్కడి పోలీసులు మృతదేహాలను తరలించారు. ఈ ఎన్‌కౌంటర్‌ను ధ్రువీకరిస్తూ బీజాపూర్ ఎస్పీ జితేందర్ యాదవ్ ప్రకటన జారీ చేయగా కొద్దిగంటల వ్యవధిలోనే మావోయిస్టులు ఈ ఘటనపై స్పందించారు. ఆజాద్ పేరిట ఓ లేఖ విడులైంది. పక్కా సమాచారంతోనే పోలీసులు ఎన్‌కౌంటర్‌కు పాల్పడ్డారని, ములుగు ఎస్పీ ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ జరిగిందని పేర్కొన్నారు.

అటవీ ప్రాంతంలో ఉద్రిక్తత

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని పూజార్ కాంకేర్ గ్రామ సమీపంలోని కర్రిగుట్టల అటవీ ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో తెలంగాణ సరిహద్దు, ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పుజార్‌కాంకేర్ గ్రామ సమీపంలోని కర్రిగుట్టల అటవీ ప్రాంతంలో ఛత్తీస్‌గఢ్ పోలీసులతోపాటు గ్రేహౌండ్స్ బలగాలు జాయింట్ యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌లో భాగంగా కూంబింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు తారసపడడంతో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందినట్లు తెలుస్తోంది. మృతుల్లో సీపీఐ మావోయిస్టుపార్టీ సీఆర్‌సీ-2 (సెంట్రల్ రికగ్నిజేషన్ కమిటీ) కమాండర్ అన్నె సంతోష్ అలియాస్ సాగర్ అలియాస్ శ్రీధర్, మరొకరు మణిరామ్ ఉండగా మిగిలిన మరొకరిని ఇంకా గుర్తించాల్సి ఉంది. మణిరామ్, మరొకరు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పుజార్‌కాంకేర్ గ్రామానికి చెందినట్లు సమాచారం. బీజాపూర్ ఎస్పీ జితేందర్ యాదవ్ ఎన్‌కౌంటర్ విషయాన్ని ధ్రువీకరించగా ఊసూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఘటన ప్రాంతంలో ఒక ఏకే-47, ఎల్ఎంజీ, విప్లవ సాహిత్యం లభించగా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

రెండేళ్ల తర్వాత..

చివరిసారిగా 2022జనవరి 18న ఇదే కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో వాజేడు-వెంకటాపురం ఏరియా కమిటీ కార్యదర్శి మడకం సింగి అలియాస్ శాంత, గుండాల-నర్సంపేట ఏరియా కమిటీ కమాండర్ కొమ్ముల నరేష్ అలియాస్ బుచ్చన్న, మరో మావోయిస్టు సభ్యుడు మృతిచెందాడు. పెద్దసంఖ్యలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే పక్కా సమాచారంతో రెండు రోజులుగా ఛత్తీస్‌గఢ్ సీఆర్పీఎఫ్, తెలంగాణ పోలీసులు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. ఆరోజు ఉదయం 7గంటల ప్రాంతంలో మావోయిస్టులు-పోలీసుల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. దాదాపు రెండుగంటలపాటు ఇరువర్గాల నడుమ కాల్పులు జరగగా గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ మధుకు బుల్లెట్ గాయమైంది. కాగా, ఈ ఎదురుకాల్పుల ఘటన నుంచి వాజేడు-వెంకటాపురం ఏరియా కమిటీ కార్యదర్శి సుధాకర్ తప్పించుకున్నాడు. కాగా, మృతిచెందిన వాజేడు-వెంకటాపురం ఏరియా కమిటీ కార్యదర్శి శాంత సుధాకర్ భార్య.

అట్టుడుకుతున్న సరిహద్దు గ్రామాలు

మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉండే ఛత్తీస్‌గఢ్‌నుంచి తెలంగాణ సరిహద్దు మీదుగా నిత్యం నక్సల్స్ కదలికలు ఉంటాయి. పార్టీ కార్యకలాపాలను రాష్ట్రంలో విస్తరించే క్రమంలో మావోయిస్టులు సరిహద్దు దాటేందుకు ప్రయత్నించిన ప్రతీసారి తెలంగాణ పోలీసులు తిప్పికొడుతున్నారు. పోలీసులు లక్ష్యంగా అమర్చిన మందుపాతరలు, మారణాయుధాలను పెద్దఎత్తున స్వాధీనం చేసుకుంటున్నారు. ఈక్రమంలో ఎదురుకాల్పులు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని సందర్భాల్లో మావోయిస్టులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. గడిచిన నాలుగేళ్లలో జరిగిన ఎన్‌కౌంటర్ ఘటనలను పరిశీలిస్తే.. 2020 సెప్టెంబరు 3న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం దేవర్లగూడెం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ మావోయిస్టు, 20వతేదీన చర్ల మండలం పూసుగుప్ప అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు, అదే నెల 23వతేదీన చర్ల మండలం జన్నారం అడవుల్లో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. అక్టోబరు 18న ములుగు జిల్లా మంగపేట మండలం కొప్పుగుట్ట వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో ఒకరు మణుగూరు ఏరియా కమాండర్ సుధీర్. ఇదేనెల 25న వాజేడు మండలం టేకులగూడెంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు, 2021 ఆగస్టు 1వతేదీన చర్ల మండలం బోదనెల్లి అటవీ ప్రాంతంలో ఒక మావోయిస్టు మృతిచెందాడు. డిసెంబరు 28న పెసర్లపాడులో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతిచెందడం జరిగింది. తాజా ఎన్‌కౌంటర్‌తో సరిహద్దు పల్లెలు అట్టుడుకుతున్నాయి. ఆదివాసీ గూడాలు, గొత్తికోయ గుంపులపై పోలీసులు నిఘా పెంచారు. వాహనాల తనిఖీలను జరుపుతున్నారు. దీంతో చిట్టచివరి పల్లెల జనం భయాందోళనకు గురవుతున్నారు.

జోరుగా హుషారుగా..

రెండో రోజు కొనసాగిన స్ప్రింగ్ స్ప్రీ

నిట్‌లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

ఆకట్టుకున్న పలు కార్యక్రమాలు, గేమ్స్

అలరించిన సినీ నిర్మాత, డైరెక్టర్ల టాక్ షో..



ఖల్‌నాయక్ ఈవెంట్ ప్రదర్శిస్తున్న దృశ్యం

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 6: భావి భారత ఇంజనీర్ల వసంతోత్సవ వేడుకల రెండోరోజు అదే జోష్ కొనసాగింది. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు మసూద సినిమా నిర్మాత రాహుల్ యాదవ్ నక్క, గామి సినిమా డైరెక్టర్ విద్యాధర్ కాగిత అండ్ టీమ్ టాక్ షో అంబేద్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో కిక్కిరిసిన విద్యార్థులను అలరించింది. వరంగల్ నిట్‌లోని వివిధక్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం విద్యార్థులను ఉర్రూతలూగించాయి.

ర్యాప్, నిట్ సోలో ఐడల్ అదరహో...

నిట్ మ్యూజిక్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాప్, నిట్ సోలో ఐడల్ కార్యక్రమం అదరహో అనిపించింది. ఈకార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు ర్యాప్ గీతాలు పాడుతూ శ్రోతలను ఆనందింపజేశారు.

వాట్స్ డిఫరెంట్.. మెదడుకు మేత..

యూత్ రెండ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మరో ఆట వాట్స్ డిఫరెంట్.. ఈ ఆటలో రెండు గదుల్లో నిర్వాహకులు వేర్వేరు ఛాయాచిత్రాలను ఉంచుతారు. రెండు గదుల్లోకి వెళ్లి వచ్చిన పార్టిసిపెంట్స్ వాటిని గుర్తుంచుకొని రాయాలి. లేదంటే ఈ ఆటలో ఓడిపోయినట్లే.

తెలుగు జిలుగుల చదరంగం..

తెలుగు లిటరసీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గేమ్‌లో గోడకు కొన్ని బెలూన్లు అతికించి ఉంచారు. పాల్గొనదలచిన వారు బెలూన్‌లలో ఒక్కదానిని పగలగొడితే అందులో ఓ టాపిక్ ఉంటుంది. ఆ టాపిక్ మీద తెలుగులో మాట్లాడాల్సి ఉంటుంది.

హంగర్ గేమ్స్.. ఫిట్‌నెస్‌పై గురి..

నిట్ ఫుడ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హంగర్ గేమ్స్ ఫిజికల్ ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందిస్తుంది. ఫిట్‌నెస్, ఆరోగ్యం ప్రాముఖ్యతను తెలియజేయడానికి ఈ గేమ్‌ను నిర్వహించారు. పాల్గొనే విద్యార్థులు సిట్‌అవుట్స్, పుషప్స్ తదితర వ్యాయామ సంబంధ వర్కవుట్స్ చేయాల్సి ఉంటుంది.

మాస్టర్ చెఫ్... అదిరె వంటలు..

నిట్ ఫుడ్ క్లబ్ ఆధ్వర్యంలో వంటల గేమ్ ఏర్పాటు చేశారు. ఈ గేమ్‌లో ఒక బాక్స్‌లో వేసిన చిట్టీల నుంచి పాల్గొనే వారు అందులో నుంచి కొన్ని చిట్టీలను తీసుకొని అందులో రాసిన పదార్థాలతో రాతపూర్వక వంటను తయారు చేయాల్సి ఉంటుంది.

తక్‌దీర్‌కా ఆగే..

ఫన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గేమ్‌లో ఫొటో వెనకాల రాసి ఉన్న విషయాన్ని పాల్గొనే వారు చేయాల్సి ఉంటుంది. ఇందులో పాటలు, సంభాషణలు, నృత్యాలు తదితర అంశాలు ఉంటాయి.

ఖల్‌నాయక్.. ఏ సినిమాలో విలన్..

ఫిల్మ్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గేమ్ విద్యార్థుల్లో జోష్ నింపింది. పాల్గొన్న విద్యార్థులు ఫొటోల ఆధారంగా సంబంధిత ఫొటోలు ఉన్న వివిధ భాషల్లోని విలన్‌లు నటించిన చిత్రాల పేర్లు చెప్పాల్సి ఉంటుంది.

ఇంకా అనేకం..

నిట్‌లోని వివిధ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఇంకా వివిధ రకాలనైన ఫన్ గేమ్స్‌ను నిర్వహించారు. హిప్‌సోల్ క్విజ్, ఫాస్టెస్ట్ వన్ టూ గెస్, ఫిల్మ్ క్విజ్, యానిమీ మ్యూజియం, ఫొటో క్విజ్, మేళా, ఫిల్మ్ ట్రెజర్ హంట్, డంబ్ చార్‌డెస్ తదితర ఆటలు కొనసాగాయి.

స్ప్రింగ్ స్ప్రీలో నేటి కార్యక్రమాలు

తెలుగు సినిమా నటుడు, నిర్మాత నవదీప్ విద్యార్థులతో ముచ్చటిస్తారు. సీతారామం డైరెక్టర్ హను రాఘవపూడి డైరెక్టర్స్ కట్‌లో విద్యార్థులతో ముచ్చటిస్తారు.

సినిమాల్లోకి వచ్చేయండి..

టాక్ షోలో మసూద సినీ నిర్మాత రాహుల్ యాదవ్ నక్క

సినిమా రంగంలోకి రావాలనిపించే యువ ఇంజనీర్లు దూకేయండి.. ఉత్సాహవంతులైన యువతను ప్రతీ రంగం ఆహ్వానిస్తుందన్నారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకుంటే ఉన్నతమైన విషయాలు నేర్చుకోవచ్చునన్నారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన తాను మొదటి గేమ్స్ రంగంలోకి వెళ్లాలనుకున్నానని, తర్వాత రాజకీయం వైపు వెళ్లాలని, ఆ తర్వాత సివిల్స్ కోసం ప్రిపేర్ అయ్యాను. అదీ చేతకాక చివరికి సినిమా రంగాన్ని ఎంచుకున్నాను. ఇంజనీరింగ్ చేస్తున్నప్పుడే నాకంటూ ప్రత్యేకత ఉండాలనే భావన నాలో ఉండేది. అదే భావనతో సినిమా రంగంలోకి వచ్చాను. ప్రతీ వ్యక్తి ప్రయత్నాలు చేయాలని, ఆ ప్రయత్నాల్లో పొరపాట్లు సహజంగా జరుగుతాయన్నారు. పొరపాట్లు చేయకుండా విజయాలు అందుకోలేమన్నారు. పొరపాట్లను సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. సినిమా రంగాన్ని ఎంచుకున్నాక మా నాన్న తనతో చాలా రోజులు మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. ప్రతీ రంగంలోనూ తప్పొప్పులుంటాయని, అయితే సినిమా రంగంలో ఇవి బయటపడుతాయన్నారు. నా పని నేను చేసుకుపోవాలనే స్వధర్మ ప్రొడక్షన్స్ స్థాపించాను. మంచి ప్రొడక్షన్ టీమ్ ఉంటే మంచి సినిమాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. బ్రహ్మానందం ఫుల్‌లెన్త్ క్యారెక్టర్‌తో 'బ్రహ్మానందం' టైటిల్‌తో ఇంజనీరింగ్ బేస్డ్ లవ్ స్టోరీ పూర్తి కామెడీగా తీయబోతున్నట్లు ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌తో సినిమాలు వస్తాయన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు.

సృజన అద్భుత దృశ్యమానం గామి చిత్రం

చిత్ర దర్శకుడు విద్యాధర్ కాగితాల

హనుమకొండ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సృజనాత్మక ఆలోచనలకు అద్భుత దృశ్యరూపమే గామి చిత్రం అని ఆ సినిమా దర్శకుడు విద్యాధర్ కాగితాల అన్నారు. చిత్ర బృందంలోని సభ్యులందరి సమిష్టి కృషి ఫలితంగానే ఈ చిత్రం ఊహించినదానికన్నా బాగా రావడమే కాకుండా అనూహ్య విజయాన్ని సాధించిందని ఆయన అన్నారు. స్ప్రింగ్ స్ప్రీ వేడుకల్లో భాగంగా శనివారం రెండో రోజు వరంగల్ నిట్ క్యాంపస్‌లోని అంబేద్కర్ లర్నింగ్ హాల్‌లో నిర్వహించిన డైరెక్టర్‌కట్స్ ఈవెంట్‌లో దర్శకుడు విద్యాధర్‌తో పాటు గామి చిత్ర బృందం పాల్గొన్నది.

ఈ సందర్భంగా విద్యాధర్ మాట్లాడుతూ.. ఆలోచనలకు అక్షర రూపం ఇస్తే పుస్తకం అవుతుంది. సృజనకు దృశ్య రూపం ఇస్తే అది సినిమా అవుతుందన్నారు. గామి తెలుగు చిత్రపరిశ్రమలో ఒక నూతన వరవడిని సృష్టించిందని అన్నారు. మొదట తాను లఘు చిత్రాల దర్శకుడినని 2014 నుంచి 2017 మధ్య కాలంలో పలు షార్ట్ ఫిల్మ్‌లు తీశానని చెప్పారు. మెకానికల్ ఇంజనీర్ అయిన తాను యాంత్రికంగా ఉండలేక సృజనాత్మతకు వేదిక అయిన ఫిల్మ్‌మేకింగ్ వైపు అడుగులు వేశానని చెప్పారు. ఇంజనీరింగ్ విద్యార్థుల్లో అనేక మంది ఫిల్మ్‌మేకర్లు ఉన్నారన్నారు. అవునా కాదా? మీలో ఎంత మంది ఫిల్మ్ మేకర్లు ఉన్నారని అడగ్గా పలువురు విద్యార్థులు చేతులెత్తారు. గామి చిత్రం తీయడంలో తమ చిత్ర బృందం ఎదుర్కొన్న సాధక బాధకాలను విద్యార్థులతో ఆయన పంచుకున్నారు. నిట్ ఫిల్మ్ అండ్ మ్యూజిక్ క్లబ్ సభ్యుడు సాయి శ్రీ చరణ్ విద్యార్థుల పక్షాన చిత్ర నిర్మాణానికి సంబంధించి అడిగిన పలుప్రశ్నలకు విద్యాధర్‌తోపాటు చిత్ర బృందంలోని మిగతా సభ్యులు సమాధానాలు ఇచ్చారు. ఈ డైరెక్టర్ కట్స్ పలు రౌండ్లుగా సాగింది. ఫన్ టైమ్ ఎమోజీ రియాక్షన్స్ చిత్రంపై మీమ్స్, ఇష్టమైన సన్నివేశం మొదలైన వాటి గురించి అడిగిన ప్రశ్నలకు దర్శకుడితో పాటు చిత్రబృందం ఇచ్చిన సమాధానలకు విద్యార్థులు కేరింతలు కొట్టారు. నిట్‌లోని ఫిల్మ్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ డైరెక్టర్ కట్స్ ఈవెంట్‌కు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. విద్యార్థులతో హాల్ కిక్కిరిసిపోయింది. అనంతరం విద్యాధర్ అంతకు ముందు నిర్మించిన షార్ట్ ఫిల్మ్‌ను, అలాగే గామీ ట్రైలర్‌ను ప్రదర్శించారు.

రేపు ఉన్నత విద్యపై కేయూలో సింపోజియం

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 6: కాకతీయ యూనివర్సిటీ రిటైర్డు టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణలో ఉన్నత విద్య ప్రస్తుత పరిస్థితులు- బలోపేతం చేయడానికి అనుసరించవలసిన విధానాలపై రాష్ట్ర స్థాయి సింపోజియంను ఈనెల 8న కేయూ సెనెట్ హాల్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహి స్తున్నట్లు కేయూ రిటైర్డు ప్రొఫెసర్ల సంఘం అధ్యక్షకార్యదర్శులు ప్రొఫెసర్ సదానందం, ప్రొఫెసర్ వడ్డె రవీందర్‌లు వెల్లడించారు. సోమవారం కేయూ సెనెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సింపోజియంలో వర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్లు, రెగ్యులర్, కాంట్రాక్టు, పార్టుటైం అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో పాల్గొన్న వారిలో కేయూ దూరవిద్య కేంద్రం మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.వీరన్ననాయక్, ప్రొఫెసర్ సీహెచ్ సమ్మయ్య, డాక్టర్ కృష్ణారెడ్డి, ప్రొఫెసర్ మద్దెల ఎర్రగట్టు స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉగాదికి ఓరుగల్లు ముస్తాబు

• అనేక చోట్ల పంచాంగ శ్రవణాలు • నేడు పలు కవి సమ్మేళనాలు

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 6: శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది పర్వం ఈ నెల 9న మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరుపుకునేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఆదివారమే పలుచోట్ల కవి సమ్మేళనాలు నిర్వహించేందుకు ఆయా సంస్థలు ఏర్పాట్లు చేశాయి. హనుమకొండలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయ మండపంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉగాది వేడుకలు ఆదివారం సాయంత్రం జరుగనున్నట్లు సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్ చెప్పారు. ఈ వేడుకల్లో కవి సమ్మేళనంతో పాటు గజేంద్ర మోక్షం పద్య పఠనం, పంచాగ శ్రవణంతోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన తెలుగు, హిందీ విభాగంలో భాషాపండితులను ఎంపిక చేసి సుమారు 30 మంది ఉత్తములకు ఉపాధ్యాయ పురస్కారాలు ప్రదానం చేస్తున్నారు. వీటితో పాటు మరో 30 మంది భాషాపండితులు ఉగాది పర్వ వైశిష్ట్యంపై కవితా గానం చేయనున్నారు. అదే విధంగా హనుమకొండ నక్కలగుట్టలోని పెండెం ఇన్‌ఫ్రా కార్యాలయంలో ఉగాది పర్వదిన కవి సమ్మేళనాన్ని పెద్ద ఎత్తున ఏర్పాటు చేసినట్లు కార్యక్రమ నిర్వాహకులు పెండెం రమేష్‌బాబు, వేణుమాధవులు తెలిపారు. 12 మంది ఎంపిక చేసిన కవులు కవితాగానం, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు సముద్రాల శఠగోపాచార్యచే పంచాంగ శ్రవణం నిర్వహించనున్నారు. ఉగాది పర్వానికి మూడు రోజుల ముందే కవితా కోకిలలు కవితాగానం చేయనున్నాయి. ఉగాది పర్వదిన వేళ ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 6 గంటలకు 12 మంది కవులచే కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వెంకటయ్య ,ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు. ఎన్నికల కోడ్ నిబంధనల నేపథ్యంలో అధికార గణం ఆధ్వర్యంలో పలు సాంస్కృతి కార్యక్రమాలు పంచాంగ శ్రవణం నిర్వహింప చేస్తామన్నారు.

సహృదయ ఆధ్వర్యంలో..

శ్రీక్రోధి నామ ఉగాది ఉత్సవాన్ని సహృదయ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 6 గంటలకు పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు, ప్రధాన కార్యదర్శి కుందావర్జుల కృష్ణమూర్తి చెప్పారు. నమిలిగొండ విశ్వేశ్వర శర్మ సిద్ధాంతిచే పంచాంగ పఠనం అనంతరం డాక్టర్ ఎన్‌వీఎన్ చారి సంయోజకత్వంలో యువ కవితా ఝరి పేరిట 20మంది కవులచే కవి సమ్మేళనం నిర్వహింప చేస్తున్నామన్నారు. హనుమకొండలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ఉగాది వేడుకలను నిర్వహింపచేస్తున్నట్లు ఆయల చైర్మన్ ఎం.హరగోపాల్ తెలిపారు. శృంగేరి మఠ పౌరాణికులు అన్నావర్జుల సోమశేఖర శర్మచే పంచాంగ శ్రవణంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. అంతేగాక చాత్తాద శ్రీవైష్ణవ సంఘం హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉగాది పర్వాన్ని పురస్కరించుకొని గురువారం టీచర్స్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో కవి సమ్మేళనం నిర్వహించి కవులను ఘనంగా సత్కరిస్తామని సంఘం నేతలు తెలిపారు. తెలుగువారి తొలి పండుగ ఉగాది చైత్రశుద్ధ పాడ్యమి మంగళవారం జరుపుకునే క్రమంలో ఈ సారి ముందుగానే కవి సమ్మేళనాలు , పంచాంగ శ్రవణాలు జరుగనుండడం విశేషం. పులుపు, తీపి, చేదు, కారం, ఉప్పు వగరు లాంటి షడ్రుచుల సమ్మేళనంలా జీవితంలో అనుభవాలన్నింటిని సమపాళ్లలో స్వీకరించాలని తెలియజేసే



ఉగాది వేళ పచ్చడి స్వీకరించడం, కొత్త దుస్తులు ధరించడం, ఇంటిని తోరణాలతో అలంకరించడం, భక్ష్యాలను సేవించడం, పంచాంగాన్ని విని రాశిఫలాలను తెలుసుకోవడం ఉగాదికే ప్రత్యేకం. కలియుగంలో ఈ క్రోధి నామ సంవత్సరం 5 వేల 125వ దని క్రోధి నామ సంవత్సరమంటే క్రోధము, కోపము అని అర్థమని పలు సందర్భాల్లో అన్ని చోట్ల ఆవేశంతో పనులు కొనసాగుతాయని ప్రముఖ జ్యోతిష్య పండితులు చెరుకుపల్లి శ్రీనివాసాచార్య తెలిపారు. హనుమకొండలోని భాషా నిలయం, ఆకాశవాణిలలో కూడా కవి సమ్మేళనాలు జరుగనున్నాయి.

మద్రాస్ కవి సమ్మేళనానికి..

మద్రాస్ విశ్వవిద్యాలయం మెరీనా బీచ్ ఆవరణలో చెన్నైలో ఆదివారం నిర్వహించే శ్రీకోధి ఉగాది కవి సమ్మేళనంలో హనుమకొండకు చెందిన అరుణ కీర్తి పతాక ఎంపికైంది. ఆమె అనేక మంది ప్రముఖుల సమక్షంలో ఓరుగల్లు నుంచి పాల్గొని కవితాగానం చేయనుండడం విశేషం.

పారిశుధ్య కార్మికులకు గుండె పరీక్షలు

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 6: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం వరంగల్ ఐఎంఏ హాలులో నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులకు ఉచిత గుండెవ్యాధుల వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మహ్మద్ అన్వర్, డాక్టర్ బింగి శ్రీనివాస్, కోశాధికారి డాక్టర్ శ్రవణ్ కుమార్ తెలిపారు. ఉదయం 8 నుంచి 1 గంట వరకు నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో గుండె సంబంధిత వ్యాధుల వైద్య నిపుణులు పాల్గొని పరీక్షలు చేస్తారని తెలిపారు. పారిశుధ్య కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హనుమకొండ టౌన్, ఏప్రిల్6: విద్యుత్ మర్మతుల దృష్ట్యా బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని నక్కలగుట్ట మెయిన్‌రోడ్డు, స్విమ్మింగ్ పూల్, ఎల్‌ఐసీ కార్యాలయం, ఏబీవీపీ కార్యాలయం ప్రాంతాలు, మాంగళ్య, మయూరి కాంప్లెక్స్ డెక్కర్ టవర్, రమేశ్ స్కిన్ క్లినిక్, బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్స్చేంజ్ ఆఫీస్ ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరా జరగదని, అదే విధంగా అశోక సర్కిల్ టూ టైలర్ స్ట్రీట్ వరకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డిఈ జి.సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు కెరీర్‌పై అవగాహన

ఐనవోలు, ఏప్రిల్ 6 : ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు కెరీర్‌పై అవగాహన కల్పించారు. ప్రముఖ సైకాలజిస్ట్ మోటివేషన్ స్పీకర్ దాస్యపు మురళీధర్ ఆధ్వర్యంలో 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు చక్కటి భవిష్యత్ మార్గ నిర్దేశాలపై క్లాసులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కె. ప్రతాప్‌రత్నకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

హనుమకొండ టౌన్, ఏప్రిల్6: హనుమకొండ కుమార్‌పల్లికి చెందిన గోపు రాయపురెడ్డి అదృశ్యమైనట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. సెయింట్ జోసెఫ్ చర్చి కుమార్‌పల్లికి చెందిన రాయపురెడ్డి గత సంవత్సరం నుంచి పని చేయకుండా ఇంట్లోనే ఉంటున్నాడన్నారు. ఈ నెల 4న ఉదయం 7.30 ప్రాంతంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగిరాలేదని, బంధువులు, తెలిసిన వారి దగ్గర కుటుంబసభ్యులు ఆరా తీసిన సమాచారం దొరకలేదని, రాయపురెడ్డి భార్య మేరి సునిత ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేడు మల్లన్నకు కల్యాణం, పెద్దపట్నం

ఐనవోలు, ఏప్రిల్ 6: ఐనవోలు మల్లికార్జునస్వామి వారాంతపు జాతరల్లో చివరి 12వ ఆదివారం జాతరను పురస్కరించుకొని మల్లన్నస్వామికి పెద్దపట్నం, కల్యాణం నిర్వహించనున్నట్లు ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు ఒగ్గు పూజారులచే పెద్దపట్నం, గొల్ల కేతమ్మ, బలిజ మేడమ్మ సమేత మల్లికార్జునస్వామి కల్యాణం జరుగనుంది. భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేసినట్లు ఈవో తెలిపారు.

భద్రకాళి సన్నిధిలో జాయింట్ డైరెక్టర్ ఇందిర

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 6: శ్రీభద్రకాళి అమ్మవారిని రాష్ట్ర ఆడిట్ డిపార్ట్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఇందిర శనివారం దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో ఆలయానికి రాగా అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాదాలను ఈవో శేషు భారతి జాయింట్ డైరెక్టర్‌కు అందజేశారు.

హనుమకొండ పోలీసుల కవాతు

హనుమకొండ టౌన్, ఏప్రిల్6: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఓటుహక్కు వినియోంచుకునేలా సీఆర్‌పీఎఫ్ జవానులతో హనుమకొండ ఇన్స్‌పెక్టర్ వై. సతీష్ ఆధ్వర్యలంలో హనుమకొండ ప్రధాన రహదారితో పాటు బస్టాండ్ పరిసరాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సతీష్ మాట్లాడుతూ.. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు, ప్రజల భద్రతకు భరోసా కల్పించేలా సాయుధ బలగాలతో కవాతు నిర్వహించామన్నారు. పోలింగ్ రోజు ప్రజలు నిర్భయంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీస్ శాఖ తరఫున పటిష్టమైన చర్యలు చేపడుతామన్నారు. ఈ కవాతులో ఎస్సైలు సతీష్, శ్రావణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ రంగం కుదేలు!

(5వ పేజీ తరువాయి)

నిలిపేస్తున్నారు. అప్పోసప్పో చేసి ఇల్లు కడుతామంటే మోయలేని భారంతో పాటు వడ్డీలతో నడ్డి విరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. సామాన్యులే కాకుండా బిల్డర్లదీ ఇదే పరిస్థితి. ముందే పాత ధరలకు అనుగుణంగా ప్లాట్లకు ముందే అడ్వాన్స్ తీసుకున్నారు. కానీ ప్రస్తుతం ఊహించిన దానికంటే ఎక్కువగా ధరలు పెరగటంతో మధ్యలోనే అపార్ట్‌మెంట్ నిర్మాణ పనులు నిలిపివేస్తున్నారు. ప్లంబింగ్, విద్యుత్ సామగ్రి ధరలు 30శాతానికి పైగా పెరిగాయని, లేబర్ చార్జీలు 25శాతం వరకు పెరిగాయని కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీగా పెరిగిన ఇసుక, స్టీల్, సిమెంట్, కంకర ధరలతో అంచనాలు మించిపోతుండటంతో నిర్మాణరంగం కుదలేవుతో ంది. సామాన్యుల సొంతింటి కల కలగానే మిగిలి పోయే పరిస్థితి ఏర్పడుతోంది.

సహ చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధం

సమాచార హక్కు చట్టం రాష్ట్ర మాజీ కమిషనర్ శంకర్ నాయక్

వడ్డెపల్లి, ఏప్రిల్ 6 : సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధమని సమాచార హక్కు చట్టం రాష్ట్ర మాజీ కమిషనర్ డాక్టర్ గుగులోత్ శంకర్‌నాయక్ అన్నారు. సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ వరంగల్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో శనివారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు. సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా హాజరైన శంకర్ నాయక్ మాట్లాడారు. సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి అవినీతిరహిత సమాజాన్ని నిర్మించాలని అన్నారు. రాష్ట్రంలో కాలక్రమేణ ఆర్‌టీఐ చట్టం అమలుకు నోచుకోవడం లేదని, దీనికి ప్రభుత్వ అధికారులే ప్రధాన కారణమని డాక్టర్ శంకర్‌నాయక్ అన్నారు. సమాచార హక్కు చట్టం కమిషన్‌ను వెంటనే నియమించి అన్నిరంగాల్లో ప్రజలకు పారదర్శక పాలన అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాహితం కోసం సమాచార హక్కు చట్టాన్ని పారదర్శకంగా అమలు చేయించాలని పాలక ప్రభుత్వాలను కోరారు. సమాచార హక్కు చట్టం జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టాన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకంగా అమలు చేయించాల్సిన బాధ్యత అధికారులు, ప్రజా ప్రతినిధులదేనని అన్నారు. ఈ



సదస్సులో మాట్లాడుతున్న గుగులోత్ శంకర్ నాయక్

సదస్సులో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ ఉపాధ్యక్షుడు ఎ.అంజనేయులు, రాష్ట్ర అధ్యక్షుడు ఎ. వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సూర స్రవంతి, రాష్ట్ర , జిల్లా నాయకులు నమిండ్ల హరీష్, కాట కుమారస్వామి, గోపాల్ దాస్ ఉపేందర్, సాదబోయిన రాజు, అక్కెల్లి పవన్‌కుమార్, మంద ప్రవీణ్, మహ్మద్ అలీ, కార్తీక్, వీరేందర్‌రెడ్డి, నాగరాజు, జె.యాకూబ్, గోపిక రాణి, బందెల యాదలక్ష్మి, పద్మజ, డాక్టర్ కీర్తిరెడ్డి, రాకీదేవిక, రజిత తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాలి : కలెక్టర్

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 6: ఎండల వల్ల ఎదురయ్యే వడదెబ్బ, ఇతర ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. కలెక్టరే ట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో శనివారం వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల కు సంబంధించిన పోస్టర్‌లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. వడదెబ్బపై ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తమ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజలు ఎండ తీవ్రతకు అనుగుణంగా తమ పనివేళలు మార్చుకోవాలని, వీలైనంతవరకు మధ్యాహ్నం సమయంలో విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు

హనుమకొండ టౌన్, ఏప్రిల్6: వారసత్వంగా వచ్చిన తన భూమిలోకి ఇద్దరు వ్యక్తులు వచ్చి పనులు చేస్తున్నారని ఒకరు హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. హనుమకొండ పీఎస్ పరిధిలో ఓంకార్ సింగ్‌కు వారసత్వంగా వచ్చిన 400 గజాల భూమి ఉంది. శనివారం తన స్థలాన్ని చూసొద్దామని వెళ్లాడు. అక్కడ రాజు, అహ్మద్ అనే ఇద్దరు వ్యక్తులు పునాదుల కోసం తవ్వకాలు చేపడుతున్నారు. అడ్డుకోబోయిన ఓంకార్ సింగ్‌ను ఇద్దరు వ్యక్తులు బెదిరించారు. కాగా, ఓంకార్ సింగ్ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై పలు సెక్షన్‌ల కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్టు షాపులపై దాడి

వరంగల్ క్రైం, ఏప్రిల్ 6: వరంగల్ జిల్లా రాయపర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు చోట్ల బెల్టు షాపులపై శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడు చేశారు. ఈదాడుల్లో రూ.రూ.89వేల 870 అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. కొండూరు గ్రామంలోని మూడు చోట్ల దాడులు చేశారు. మూడుచోట్ల రూ.80370, పెరికేడు గ్రామంలో రూ.9500 విలువ కలిగిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ ధ్రువీకరించారు. మద్యం స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించాలి

ఐనవోలు, ఏప్రిల్ 6 : రాంనగర్-ఐనవోలు గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణ పనులను ప్రమాదకరంగా నిర్మిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐనవోలు శివారులో ఉన్న కొమటికుంట కట్ట ఎత్తును ఐదు ఫీట్ల వరకు తగ్గించి దానిపై నుంచి రోడ్డు నిర్మిస్తుండడంతో కుంటలో నీరు నిల్వ తగ్గుతుందని రైతులు పి. శ్రీనివాస్, ఎ. సాగర్, బి. ఎల్లయ్య, ఏకాంతం, రాజయ్యలు ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణానికి కావాల్సిన మట్టిని రోడ్డు అంచునే తవ్వి పోస్తుడడంతో రోడ్డుకు ఇరువైపుల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందన్నారు. కాంట్రాక్టర్, అధికారపార్టీ నాయకులు ఒక్కటై ఇష్టానుసారంగా పనులు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని కలెక్టర్ చొరవతీసుకొని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

కెనాల్‌లో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

హనుమకొండ టౌన్, ఏప్రిల్6: పెద్దమ్మగడ్డ కెనాల్‌పై గుర్తు తెలియని మృతదేహం లభించినట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు. మృతుడు సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్యలో ఉన్నాడని, పోలో కంపెనీ పేరుతో ఉన్న సిమెంట్ రంగు టీషర్ట్, బ్లూకలర్ లోయర్, డ్రాయర్ ధరించాడన్నారు. 5.5 అడుగుల ఎత్తుతో చామన ఛాయ రంగులో గడ్డం, మీసాలు లేకుండా పొడుగాటి జుట్టుతో ఉన్నాడని, తెలిసిన వారుంటే హనుమకొండ ఇన్స్‌పెక్టర్ నెంబర్ 8712685113 కు కానీ, పోలీస్‌స్టేషన్ నెంబర్ 8712685002 లో సంప్రదించాలన్నారు.

భారత రాజ్యాంగాన్ని మార్చివేస్తామనడం దుర్మార్గం

వడ్డెపల్లి, ఏప్రిల్ 6: డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగాన్ని కేంద్ర ప్రభుత్వం మార్చివేస్తామనడం దుర్మార్గమని ట్రైసిటీస్ పాస్టర్స్ ఫెల్లోషిప్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బి. ఏలియా, ప్రధాన కార్యదర్శి మునిగాల విలియం అన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చివేస్తామనడంతో పాటు మణిపూర్‌లో జరుగుతున్న మారణహోమాన్ని నివారించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ట్రైసిటీస్ పాస్టర్స్ ఫెల్లోషిప్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతుంటే ప్రధాని స్పందించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ శాంతి ప్రదర్శనలో ట్రైసిటీస్ పాస్టర్స్ ఫెలోషిప్ వరంగల్ జిల్లా కమిటీ చైర్మన్ డేవిడ్‌కొంద్రా, ప్రతినిధులు కుమార్, జనార్ధన్, జాన్‌డేస్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్‌ఫిల్ గ్యాస్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి

నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 6: ల్యాండ్ ఫిల్ గ్యాస్ ద్వారా విద్యుత్ (ఎల్‌పీజీ) ఉత్పత్తిని సహకారం అందిస్తామని గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో దక్షిణ కొరియాకు చెందిన సేజింగ్ కంపెనీ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. కొరియా కంపెనీ ప్రతినిధులు మాట్లాడారు. విద్యుత్ ఉత్పత్తికి వేస్ట్ టూ కార్బన్ ఎనర్జీ కార్బన్ క్రెడిట్ అంశాల్లో ప్రత్యేకత కలిగి ఉన్నామన్నారు. కొరియాలో ఇప్పటికే 13 విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టలను విజయవంతంగా నడిపిస్తున్నామన్నారు. చైనా, వియత్నాం, థాయిలాండ్, ఉజ్జెకిస్తాన్ దేశాలలో ఎల్‌పీజీ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టలను నిర్వహిస్తున్న అనుభవం ఉందన్నారు. కాలుష్యం ఉండకుండా విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు చెప్పారు. వరంగల్‌లో ఉన్న పరిస్థితులను అవగతం చేసిన తర్వాత ల్యాండ్ ఫీల్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. రాంపూర్ డంపింగ్ యార్డ్ చెత్త, వ్యర్థాల నుంచి ఎల్‌పీజీ విడుదలవుతుందని, ఇలాంటి ప్రాజెక్టలను ఏర్పాటు చేయడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని అన్నారు. అనంతరం కొరియా ప్రతినిధులు డంపింగ్ యార్డ్‌ను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సేజింగ్ కంపెనీ డైరెక్టర్ డీవై కిం, అభిషేక్‌రాజ్‌తో పాటు సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈ సంజయ్‌కుమార్, ఏఈ సంతోష్‌కుమార్‌లతో పాటు అధికారులు పాల్గొన్నారు.

భారీ డిస్కౌంట్ల ప్రకటనలను నిషేధించాలి

కాళోజీ జంక్షన్, ఏప్రిల్ 6 : మందుల అమ్మకాలలో భారీ డిస్కౌంట్ల ప్రకటనలను నిషేధించాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లెపాడు దామోదర్ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ రాంధన్‌కు శనివారం వినతి పత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో మందుల తయారీదారులు హోల్‌సెల్, రిటైల్ అమ్మకందారులు భారీ డిస్కౌంట్ల ప్రకటనలతో అనుచిత వ్యాపార పద్ధతులు అవలంబిస్తున్నాయని వినతి ప్రతంలో పేర్కొన్నారు. వినియోగదారులకు మందుల నాణ్యతపై అవగాహన లేనందున వినియోగదారులు డిస్కౌంట్ ఆఫర్లను నమ్మి మందులు కొనుగోలు చేసి మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణితో కలిసి హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. బహిరంగ మార్కెట్‌లో అనేక మంది మందుల అమ్మకందారులు 25 శాతం నుంచి 80 శాతం వరకు డిస్కౌంట్లను ప్రకటించి వినియోగదారులను మోసగిస్తున్నారని అన్నారు. ఫార్మసీ యాక్ట్ 1948, కాంపిటీషన్ యాక్ట్ 2002, వినియోగదారుల

రాంధన్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న పల్లెపాడు దామోదర్

రక్షణ చట్టం 2019 ప్రకారం డిస్కౌంట్లను ప్రకటించడం నిబంధనలకు విరుద్ధమని కొన్ని సంస్థలపై ఆధారాలతో ఫిర్యాదు చేశారు. వారు సమర్పించిన ఫిర్యాదుకు స్పందించిన జాయింట్ డైరెక్టర్ రాంధన్ సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతామని వినియోగదారుల ప్రతినిధులకు హామీ ఇచ్చారు. డ్రగ్ కంట్రోల్ జాయింట్ డైరెక్టర్‌ను కలిసిన వారిలో ఇంకా హైకోర్టు న్యాయవాది వలపదాసు రాజు, వీఎస్ వర్మలు ఉన్నారు.

క్రమశిక్షణకు, త్యాగాలకు మారుపేరు బీజేపీ

లోక్‌సభ బీజేపీ వరంగల్ అభ్యర్థి అరూరి రమేశ్

హసన్‌పర్తి, ఏప్రిల్ 6 : భారతీయ జనతా పార్టీ క్రమశిక్షణకు, త్యాగాలకు మారుపేరని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, లోక్‌సభ బీజేపీ వరంగల్ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం హసన్‌పర్తిలో టిఫిన్ బైటక్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో మంది కష్టాలు, త్యాగాల ఫలితంగానే బీజేపీ కోట్లాది మంది ఆదరణ చూరగొందన్నారు. నిత్య జీవన కార్యక్రమంలో భాగంగా సమయం వృథా కాకుండా పార్టీ కోసం ఇంట్లో టిఫిన్ చేసే సమయాన్ని కేటాయించి, పార్టీ బలోపేతానికి, ప్రణాళికల రూపకల్పన కోసం ఇలాంటి సమయాన్ని కూడా ఉపయోగించుకునే ఏకైక పార్టీ బీజేపీయేనన్నారు. సామాన్య కార్యకర్తలను మంత్రులను, ముఖ్యమంత్రులను, ప్రధానమంత్రులను చేయగలిగిన సత్తా ఒక్క బీజేపీకే ఉందన్నారు. బీజేపీ మతతత్వ పార్టీ కాదని..మానవత్వం, విలువలు ఉన్న పార్టీ అని ప్రజలు గ్రహించాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ గడ్డపై బీజేపీ జెండా ఎగురవేసి మార్పునకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, జడ్పీటీసీ రేణుకుంట్ల సునీత, మాజీ జడ్పీటీసీ కొత్తకొండ సుభాష్, మాజీ మార్కెట్ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ జక్కుల రమేశ్‌గౌడ్, నాయకులు టి.కుమారస్వామి, ఎం.చంద్రారెడ్డి, ఎం.హరిశంకర్, ఎం.తిరుపతి, దాసరి రాజు, ఎం.సుమన్, టి.రమేశ్, కరుణాకర్, సాయి పాల్గొన్నారు.

● హనుమకొండ టౌన్: దేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దడమే బీజేపీ లక్ష్యమని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం



కార్యక్రమంలో మాట్లాడుతున్న అరూరి రమేశ్

హంటర్‌రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జెండాను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జటిలమైన సమస్యలను మోదీ నాయకత్వంలో బీజేపీ పరిష్కరించిందన్నారు. బీజేపీ శ్రేణులతో పాటు ప్రజలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేడర్, కార్యకర్తల మధ్య సంబంధాలు మెరుగపడటానికి తీసుకొచ్చిన టిఫిన్ బైఠక్ కార్యక్రమంలో భాగంగా 31 డివిజన్ బీజేపీ శ్రేణులతో కలిసి సమావేశమై ఇంటి నుంచి తెచ్చుకున్న అల్పాహారాన్ని రావు పద్మ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అమరేందర్‌రెడ్డి, సత్యనారాయణ, 31వ డివిజన్ అధ్యక్షుడు కడవేరు శ్రీనువాస్, ప్రధాన కార్యదర్శి జంపాల హరిశ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

108, 102 వాహనాల తనిఖీ

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 6: 108, 102 వాహనా లను ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ పాటి శివకుమార్ శనివారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన వేసవికా లంలో ఎలా ఉండా లో సలహాలు, సూచనలు జాగ్రత్తలు గురించి సిబ్బందికి వివరించారు. ఆపదకాలంలో 108, 102 వాహనాల సేవలు వినియోగించుకోవాలని పాటి శివకుమార్ ప్రజలకు సూచించారు. ఈఎంఈ లక్ష్మణ్, జీఎంహెచ్ హనుమకొండ 108, 102 నియో నాటల్ అంబులెన్స్ సిబ్బంది వేణు, భిక్షపతి, జగదీష్, చంద్రన్న, యాదన్న, లవణ్, రాంచందర్, మమత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్లు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 6: నగర పాలక సంస్థ అనుమతులు లేకుండా నడుస్తున్న సెప్టిక్ ట్యాంకులను రద్దు చేయాలని గ్రేటర్ వరంగల్ సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్లు శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిశారు. కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. బల్దియా అనుమతులలో సెప్టిక్ ట్యాంక్‌ల ద్వారా తీసిన మలాన్ని తాము వాహనాల ద్వారా అమ్మవారిపేటలోని మల శుద్ధీకరణ కేంద్రానికి తరలిస్తున్నామన్నారు. ఇటీవల కొందరు బల్దియా అధికారుల సహకారంతో ప్రైవేటు వ్యక్తులు గోడలపై ప్రచారం చేసుకుంటూ మలాన్ని తీసి బహిరంగ ప్రదేశాల్లో వదిలి వేస్తున్నారని అన్నారు. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని వారు గుర్తు చేశారు. అనుమతులు లేని సెప్టిక్ వాహనాలను రద్దు చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు సత్వీర్‌సింగ్, బండి మణెమ్మ, పోశాలు, రాజులు ఉన్నారు.

లోక్‌సభ ఆర్‌పీఐ అభ్యర్థిగా పసుల రవికుమార్

కాళోజీ జంక్షన్, ఏప్రిల్ 6 : రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) లోక్‌సభ అభ్యర్థిగా పసుల రవికుమార్ పోటీలో నిలువనున్నారు. ఈ మేరకు ఆయనకు పార్టీ బీఫామ్‌ను అందజేసింది. ములుగు జిల్లా మల్లంపల్లి మండలం మహ్మద్ గౌస్‌పల్లికి చెందిన ఆయన 1994లో కాంగ్రెస్ పార్టీ ములుగు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాజకీయ ప్రవేశం చేశారు. అనంతరం 2000లో ఉమ్మడి వరంగల్ జిల్లా జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రతిఘటన పార్టీ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఆయన తండ్రి పసుల పోచయ్య స్వాతంత్ర్య సమరయోధుడు. రవీందర్ క్రీడాకారుడిగా కరాటే బ్లాక్ బెల్టు మాస్టర్‌గా అనేక అవార్డులను గెలుచుకున్నారు 2018లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా, 2020 నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. దళిత బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా అంబేద్కర్ స్థాపించిన ఆర్‌పీఐ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్నారు. దళితులకు రాజ్యాధికారంతోపాటు విద్యా, వైద్యం ఉచితంగా అందించాలనే లక్ష్యంతో వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు.

హుషారెత్తించిన నకాష్ అజీజ్ పాటలు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 6: నిట్ వసంతోత్సవంలో ప్రో షోలు ఆదరగొడుతున్నాయి. రోజంతా ఈవెంట్లలో తలమునకలైన విద్యార్థులు రాత్రికి ప్రోషోలతో సేద తీరుతున్నారు. రాత్రి ప్రో షోలతో నిట్ స్టేడియం కోలాహలంగా మారుతోంది. స్ప్రింగ్ స్ప్రీ రెండవ రోజైన శనివారం రాత్రి నకాష్ అజీజ్ బృందం ఆలపించిన గీతాలు టెక్నోక్రాట్లల్లో గ్లింప్స్ తెచ్చింది. నకాష్ బృందంతో కలిసి స్టెప్పులు వేస్తూ విద్యార్థులంతా ఉర్రూతలూగారు. అనంతరం బ్లాక్‌స్మిత్ బ్యాండ్ షోతో నిట్ స్టేడియమంతా దుమ్మురేగిపోయింది. బ్యాండ్ ప్రోగ్రామ్ జరిగినంత సేపు విద్యార్థులంతా బ్యాండ్ సౌండ్‌కు అనుగుణంగా డ్యాన్స్ చేస్తూ భలే సరదాగా గడిపారు.



ప్రో షోలో పాటలు పాడుతున్న నకాష్ అజీజ్ బృందం

సండే సెలబ్రిటీ



హిమాచల్‌ప్రదేశ్ సోయగం రుహానీ శర్మ. 'చి.ల.సౌ.' చిత్రంతో పరిచయమైన ఈమె క్రికెటర్ విరాట్ కోహ్లీకి మరదలు అవుతుందనీ, అనుష్క శర్మకు చెల్లెలి వరుస అని చాలా మందికి తెలీదు. తెలుగులో అరడజనుకు పైగా చిత్రాల్లో నటించిన రుహానీ తన కెరీర్, సినిమాల గురించి 'నవ్య'కు వివరించారు.

హైదరాబాద్‌లో ఇల్లు కొనుక్కుంటా

మీరు నటి కావడానికి అనుష్క శర్మ ఇన్‌స్పిరేషనా?

ఆవిడతో నాకు ఉన్న అనుబంధం గురించి, ఇతర విషయాల గురించి చెప్పడం నాకు ఇష్టం లేదు. అది పూర్తిగా నా వ్యక్తిగత విషయం. అంతకుమించి చెప్పలేను.. సారీ.

హిమాచల్‌ప్రదేశ్ అమ్మాయి తెలుగు సినిమాల్లోకి ఎలా వచ్చింది?

నటిని కావాలనే ఆలోచన నాకు ఎప్పుడూ లేదు. సినిమాల గురించి అనుకోలేదు. డిగ్రీ పూర్తయ్యాక పంజాబీలో ఓ వీడియో ఆల్బం చేశా. ఆ తర్వాత కొన్ని యాడ్ ఫిల్మ్స్‌లో నటించా. అప్పటి నుంచి నటన మీద ఆసక్తి కలిగింది. నన్ను నటిగా గుర్తించింది తెలుగు చిత్రపరిశ్రమే. ఇక్కడ కొన్ని ఆడిషన్స్‌లో పాల్గొన్న తర్వాత 'చి.ల.సౌ'లో అవకాశం వచ్చింది. ఆ సినిమాతో నా జర్నీ మొదలైంది. ఆ తర్వాత 'హిట్2, 'డర్టీ హరి', '101 జిల్లాల అందగాడు' చిత్రాల్లో నటించాను. వాటి వల్ల తెలుగు వారి అభిమానం పొందగలిగాను.

మీరు చెప్పిన సినిమాల్లో కొన్ని హిట్స్, ఫ్లాప్స్ ఉన్నాయి

హిట్, ఫ్లాప్ అన్నది మన చేతుల్లో ఉండదు కదండీ. మంచి సినిమాలు చేయాలి. నటిగా పేరు తెచ్చుకోవాలి అన్నది నా పాలసీ. కొన్ని సినిమాలు జనానికి నచ్చవచ్చు, కొన్ని నచ్చకపోవచ్చు. అలా అని ఒక చోటే ఆగిపోలేం కదా.

అనుభవాల నుంచి నేర్చుకుంటూ ముందుకు వెళుతుండాలి. ఇలా చెయ్యకూడదు, అలా చెయ్యాలి అని నన్ను గైడ్ చేసే వాళ్లు లేరు. అందుకే జయాపజయాల నుంచి నేర్చుకుంటూ ముందుకు నడుస్తున్నాను.

పాత్రల ఎంపికలో మీ చెల్లెలు సలహాలు ఇస్తుంటారని విన్నాం

అవునండి. తనకి సినిమాల గురించి అవగాహన ఎక్కువ. సినిమాలు బాగా చూస్తుంటుంది. ఎలాంటి పాత్రలు చేయాలో నాకు సలహాలు ఇస్తుంటుంది. నిజ జీవితంలో నీకు హాస్యం అంటే ఇష్టం కదా.. అలాంటి పాత్రలే చెయ్యి అని చెబుతుంటుంది. నాకు కూడా అవే ఇష్టం. వాటి కోసం ఎదురుచూస్తున్నాను.

సినిమాలతో పాటు వెబ్ సిరీస్ చేస్తున్నారు. మీ ప్రయారిటీ దేనికి?

దేనికైనా మంచి కంటెంట్ ముఖ్యం. దాని తర్వాత నా పాత్ర బాగుండాలి. జనం మదిలో కలకాలం నిలిచిపోవాలి.ఇవి చూస్తాను తప్ప సినిమానా, వెబ్ సిరీసా అని ఆలోచించను. ఇప్పటికీ చాలా మంది నా తొలి సినిమాలో 'చి.ల.సౌ'లో అంజలి పాత్ర బాగుందని చెబుతుంటారు. అది విని చాలా ఆనందం కలుగుతుంది.

గ్లామర్‌గా కనిపించడానికి హద్దులు ఏమన్నా ఉన్నాయా?

సినిమా అంటేనే గ్లామర్. అయితే అది మితిమీరకుండా ఉంటేనే బాగుంటుంది. అందుకే నేను గ్లామర్ సీన్లకు అభ్యంతరం చెప్పను. కానీ వల్గారిటీకి మాత్రం నేను దూరంగా ఉంటాను. వాటికి నో చెప్పేస్తుంటాను.

మీరు నటిస్తున్న శ్రీరంగ నీతులు చిత్రం ఎలా ఉంటుంది?

ట్రైలర్ చూశారు కదా. దానిని మించి సినిమా ఉంటుంది. ప్రధానంగా నాలుగు పాత్రల చుట్టూ తిరిగే కథ ఇది.నేటి యువత ఆలోచనలు, కుటుంబ బంధాలు, వినోదం.. అంశాలు ప్రేక్షకుల్ని అలరిస్తాయి. మిమ్మల్ని మీరు చూసుకునేట్లు చిత్రంలో పాత్రలు ఉంటాయి. ఇక నా పాత్రను చూడగానే 'అరే ఈమె మనకు తెలిసిన అమ్మాయే' అనే భావన కలుగుతుంది. ఇంతవరకూ నేను చేసిన పాత్రలకు పూర్తి భిన్నమైన క్యారెక్టర్ ఇది.

సౌత్, నార్త్ .. ఇండస్ట్రీల్లో చేస్తున్నారు. ఏది మీకు కంఫర్ట్‌గా ఉంది?

నిజం చెబుతున్నాను నమ్మండి. నాకు తెలుగు సినిమాల్లోనే నటించడమే ఇష్టం. నటిగా నా జీవితం తెలుగు సినిమాతోనే ప్రారంభం కావడం దీనికి ఒక కారణం కావచ్చు. తెలుగు ప్రేక్షకులు చూపిస్తున్న ఆదరాభిమానాల్ని మరిచిపోలేను. ఇది నా సొంత ఇల్లు అనే భావన కలుగుతుంది. నన్నే కాదు నార్త్ నుంచి వచ్చిన చాలా మంది అమ్మాయిల్ని తెలుగువారు ఆదరిస్తున్న విధానం మరువలేనిది. 'నేను తెలుగు సినిమాల్లో నటిస్తున్నాను. అని చెబితే ముంబైలో కూడా 'వావ్.. గ్రేట్' అని అభినందిస్తుంటారు. దక్షిణాది సినిమాలు నార్త్‌లో చాలా ఎక్కువ మంది చూస్తుంటారు. ఎంజాయ్ చేస్తుంటారు.

మరి ఇక్కడ ఇల్లు కొన్నారా?

ఆ ప్రయత్నాల్లోనే ఉన్నాను. ఎందుకంటే ఏడాదిలో దాదాపు ఆరేడు నెలలు హైదరాబాద్‌లోనే ఉంటున్నాను. తెలుగువారి ఆశీస్సులతో ఇల్లు కొందామనే ఆలోచనలో ఉన్నాను.



సైంధవ్‌లో డాక్టర్‌గా నటించారు. ఆ సినిమా రిజల్ట్ డిజప్పాయింట్ చేసిందా?

లేదండీ. వెంకటేశ్‌గారితో కలసి నటించే అవకాశం నాకు ఆ సినిమా ఇచ్చింది. ఎన్నో మధుర సంఘటనలు మిగిల్చింది ఆ చిత్రం. అలాగే వరుణ్ సందేశ్‌తో చేసిన 'ఆపరేషన్ వాలెంటైన్' కూడా నాకు మంచి అవకాశం. అందరి హీరోలతో నటించాలన్నది నా కోరిక. అది తీరినప్పుడు మిగతా విషయాలు పట్టించుకోను. జయాపజయాలు మన చేతుల్లో లేవు కదా

మ్యూజికల్ ఆల్బమ్స్ మళ్లీ ఏమన్నా చేస్తున్నారా?

లేదండి. ప్రస్తుతం నా దృష్టి సినిమాల మీదే. అయితే ఎక్సయిటింగ్ ఆఫర్ వస్తే అప్పుడు ఆలోచిస్తా.


● వినాయకరావు

మేకప్

అందం అరవిందం

మేకప్ ప్రొడక్ట్స్ భిన్నమైన స్వభావాలు, ప్రయోజనాలను కలిగి ఉంటాయి. ముఖంలోని లోపాలను దాచడానికి తోడ్పడే ఆ ఉత్పత్తులను తెలివిగా ఉపయోగించినప్పుడే, వాటి ప్రయోజనాన్ని సంపూర్ణంగా పొందగలుగుతాం! కాబట్టి వాటి పట్ల అవగాహన పెంచుకోండి.

టోనర్: చర్మం నునుపుగా, బిగుతుగా మేకప్‌కు అనువుగా మారడం కోసం టోనర్ వాడడం తప్పనిసరి. అలాగే మొటిమలు, మచ్చలు ఉన్న చోట టోనర్‌ను అప్లై చేసుకుని, వాటిని కనిపించకుండా దాచేయవచ్చు.



మాయిశ్చరైజర్: మేకప్ సమంగా పరుచుకోవడం కోసం మేకప్‌కు ముందు మాయిశ్చరైజర్ వాడుకోవాలి. మాయిశ్చరైజర్ వాడడం వల్ల చర్మం మీద మేకప్ పగుళ్లు ఏర్పడకుండా ఉంటాయి. చర్మం పొడిబారిపోకుండా ఉంటుంది.

ప్రైమర్: చర్మానికీ, మేకప్‌కూ మధ్య ప్రైమర్ అడ్డుగా ఉండి, చర్మం మీది రంధ్రాలు కనిపించకుండా చేస్తుంది. దీంతో చర్మ రంధ్రాలు పూడుకుపోకుండా ఉంటాయి.

ఫౌండేషన్: స్కిన్ టోన్‌ను సమం చేసి, మేకప్‌కు బేస్‌గా మారుతుంది. కాబట్టి, ఫౌండేషన్‌ను ముఖం మీద సమంగా పరుచుకోవాలి.

కన్‌సీలర్: చర్మపు రంగుకు ఒకటి లేదా రెండు టోన్ల తేలిక రంగు కన్‌సీలర్ ఎంచుకోవాలి. దీంతో మచ్చలను దాచేసి, ముఖంలో కనురెప్పలు, ముక్కు, చుబుకం, చెక్కిళ్లను హైలైట్ చేసుకోవచ్చు.

కాంటూర్: దీంతో ముఖానికి ఆకారాన్ని తీసుకురావచ్చు. ముక్కు, చుబుకం, చెక్కిళ్లను ఆకర్షణీయంగా మలుచుకోవచ్చు.

బ్లష్: చెక్కిళ్లను హైలైట్ చేయడం కోసం దీన్ని వాడుకోవాలి.

మంచి ఆరోగ్యం కోసం...



- తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు తినాలి. ప్యాకేజ్డ్ ఫుడ్ తగ్గిస్తే ఎంతో మంచిది.
- ఆరోగ్యంగా ఉండాలంటే మంచి తిండి తినటమే కాదు డైట్‌ను మార్పు చేసుకోవాలి. ముఖ్యంగా క్రమశిక్షణతో కూడిన జీవనవిధానాన్ని అలవాటు చేసుకోవాలి. ఉదయాన్నే నిద్రలేచి వాకింగ్, రన్నింగ్, స్విమ్మింగ్‌తో పాటు జిమ్‌లో వ్యాయామాలు చేయాలి. దీనివల్ల శరీరం చురుగ్గా ఉంటుంది. బరువు తగ్గుతారు. బరువే అన్ని సమస్యలకు మూలమని తెలుసుకోవాలి.
- గంటలపాటు కుర్చీలకే పరిమితం కావటం అనేది పాసివ్ స్మోకింగ్‌తో పోలుస్తారు. దీనివల్ల అనర్థాలెన్నో. అందువల్ల ఉద్యోగంతో పాటు కూర్చుని పని చేసేవాళ్లు గంటలపాటు కూర్చోకుండా మధ్య మధ్యలో నడవాలి.
- ఉప్పు, చక్కెరలను తగ్గించాలి. యాంటీ బయాటిక్స్, స్టెరాయిడ్స్ లాంటివి వాడకండి. దీనివల్ల భవిష్యత్తులో గుండె సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది.
- ఎంత పని చేశారు? ఎన్ని గంటలు వ్యాయామం చేశారు? అనేవి ప్రశ్నలు కాదు. ఎంత గాఢంగా నిద్రపోయారన్నదే ప్రమాణం. ఇంట్లోఉండే వాళ్లు పగటిపూట గంట నిద్రపోయినా పర్లేదు. రీఛార్జ్ అవుతారు. మంచి నిద్రనే మీ ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుందనేది మర్చిపోకూడదు.
- డిజిటల్ ప్రపంచానికి మీరే కాదు.. మీ పిల్లలను దూరంగా ఉంచండి. ఔట్ డోర్ గేమ్స్‌ను ఎంకరేజ్ చేయాలి. దీనివల్ల శారీరకంగా, మానసికంగా ఉపశమనం కలుగుతుంది.

తెలుగులో 'ఇంకోసారి', 'శుభప్రదం' చిత్రాల్లో నటించిన ముంబై భామ మంజరి ఫడ్నిస్. బాలీవుడ్‌లోనే ఎక్కువ సినిమాల్లో నటించింది. ఓటీటీల్లోనూ మెరుస్తోన్న ఈ అమ్మడు 'యూపీ ఫైల్స్' చిత్రంలో పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో నటిస్తోంది. ఈ సందర్భంగా మంజరి ఫడ్నిస్ గురించి కొన్ని విశేషాలు...

అలాంటి చిత్రాల్లో నటించాలనుంది!

"ఓటీటీల్లో నటించటమంటే తక్కువేం కాదు.. కాస్త ఎక్కువే. ప్రయోగాత్మక చిత్రాలు, వెబ్‌సిరీస్‌లు చేయాలంటే ఓటీటీనే ప్రధానమైన వనరు. ఓటీటీని, సినిమాను కలిపి చూడనక్కర్లేదు. సెవన్టీ ఎమ్.ఎమ్., ఓటీటీ దేని ప్రత్యేకత దానిదే. ఓటీటీ వల్ల మంచి రచయితలు, దర్శకులు వస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో మంచి చిత్రాలు తీస్తున్నారిప్పుడు. ఇదెంతో మంచి పరిణామం.

అలా 'యూపీ ఫైల్స్'..

'కిస్ కిస్కో ప్యార్ కరూనా' చిత్రంలో మనోజ్ జోషితో కలసి నటించి. అతనే నా పేరు రిఫర్ చేశారు. ఆ తర్వాత దర్శకుడు నీరజ్ ఫోన్ చేసి పాత్ర గురించి చెప్పారు. పోలీస్ పాత్ర ఎప్పుడూ చేయలేదు. తొలిపాత్రనే పవర్‌ఫుల్ పోలీస్ పాత్ర చేయటం బావుంది. ఈ పాత్రకు కనెక్టయిపోయా. సీఎం చుట్టూ తిరిగే కథ ఇది. నిజజీవిత సంఘటనలుంటాయి. ప్రస్తుతం ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాం. ఈ చిత్రంతో మంచి పేరొస్తుందని నమ్ముతున్నా.

ఇదీ నేపథ్యం..

అమ్మ పేరు రుచి ఫడ్నిస్, నాన్న పేరు కల్నల్ భరత్ కుమార్ ఫడ్నిస్. నాన్న సైన్యంలో పని చేసి రిటైర్ అయ్యారు. 2003 'వి' ఛానల్‌లో పాప్‌స్టార్స్ సింగింగ్ రియాలిటీ షోలో పాల్గొన్నా. సినిమాల్లోకి వచ్చింది మాత్రం 'రోక్ సాకో తో రోక్ లో'. అయితే 'జానే తూ యా జానే నా' చిత్రంతో బ్రేక్ వచ్చింది. సినిమాల్లోకి వచ్చినా.. టెలివిజన్‌తో పాటు థియేటర్ ఆర్టిస్టుగా కొన్ని నాటకాల్లో నటించా. 'గ్రాండ్ మస్తీ', 'నిరోష్' చిత్రాల్లో నటించా. తెలుగు, కన్నడ, మరాఠా చిత్రాల్లో పని చేశా. వెబ్‌సిరీస్‌లతో పాటు మ్యూజిక్ ఆల్బమ్స్ చేశా.



వాటితోనే ఆడుకుంటుంటా...

మా ఇంట్లో మియా, సింబా అనే పిల్లులున్నాయి. వాటితోనే ఎక్కువ సమయం గడుపుతా. మూడ్ బాలేనప్పుడే కాదు.. ఎప్పుడూ వాటితో ఆడుకుంటుంటా. హీలింగ్ పవర్ వాటిలో ఉందని నమ్ముతా. సొంత పిల్లల్లా చూసుకుంటా. స్ట్రీట్ డాగ్స్‌ను చేరదీస్తుంటా. కెరీర్ పరంగా చూస్తే.. ఈ ఫేజ్ చాలా బావుంది. ప్రస్తుతం 'చల్తీ రహే జిందగీ'లో నటించి. ఇది పలు ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శితమవుతోంది. 'పూణే హైవే' చిత్రంలో నటిస్తున్నా. మరో రెండు ప్రాజెక్టులకు ఇటీవలే సైన్ చేశా. మహిళా ప్రాధాన్యం ఉండే పాత్రల్లో విరివిగా నటించాలన్నదే నా లక్ష్యం."

నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ih2YJfN లో చదవండి.

'దిక్సూచి' వెబ్ పేజీలో... సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/vujv1d6తో చదవండి.



అలనాటి కథ

పైగాల ప్రాభవం

వేల ఎకరాల ఎస్టేట్లు... కళ్లు చెదిరే కోట్ల విలువైన ఆభరణాలు... అందమైన ప్యాలెస్‌లు... పైగా నిజాంకు అత్యంత సన్నిహితులైన వ్యక్తులు. అయినా హైదరాబాద్‌కు చెందిన రాజ కుటుంబీకులు ప్రతి చోటా తమ హోదాను, అహంకారాన్ని ప్రదర్శించేవారుకాదు. పైగా కళలకు రాజధానిగా హైదరాబాద్‌కు పేరు రావటానికి వీరు చేసిన కృషి ఎంతో ఉంది. అలాంటి ఒక రాజ కుటుంబీకుడు జహీర్ యార్ జంగ్! సాలార్ జంగ్ అంకుల్ తర్వాత నాకు అత్యంత ఇష్టుడు. నిజాంకు అత్యంత సన్నిహితుడైన మొయిన్ ఉద్‌దౌలా కుమారుడు. ప్రస్తుతం జహీరాబాద్ ఆయన పేరిట ఏర్పడిందే.

నిజాం పెయిర్ (కాళ్లు) దగ్గర కూర్చునే సేవలకు 'పైగా'లు అనే పేరు వచ్చింది. అలాంటి పైగాలలో ప్రముఖుడు అమీరే పైగా. వీరి తర్వాత బాగా పేరు పొందిన వ్యక్తి జహీర్. నా చిన్నతనంలో నిజాం సంస్థానంలో పైగాలకు ప్రత్యేక స్థానముండేది. వీరి జాగీర్‌లలో వందల కొద్దీ గ్రామాలు ఉండేవి. జహీర్ అంకుల్ జాగీర్‌లో నాకు గుర్తున్నంత వరకు 320కు పైగా గ్రామాలు భాగంగా ఉండేవి. ప్రస్తుత జహీరాబాద్ ప్రాంతంలో మా నాన్న రాజా ధన్‌రాజ్‌గిర్‌కు నాలుగు వేల చెట్లతో ఒక గంధపు తోట కూడా ఉండేది. ఆ తోటలో ఫార్మ్ హౌస్ ఉండేవి. షోలాపూర్ వెళ్లే దారిలో మేము అప్పుడప్పుడు ఆగుతూ ఉండేవాళ్లం. జహీర్ అంకుల్‌కు నలుగురు పిల్లలు.



మహారాజా ఆఫ్ గ్వాలియర్, రాజా ధన్‌రాజ్‌గిర్, నవాబ్ జహీర్ యార్ జంగ్

ముగ్గురు అబ్బాయిలు. ఒక అమ్మాయి. మా తమ్ముడు మహేంద్రగిర్‌ని ఆమె ప్రేమించి పెళ్లి చేసుకుంది. దాంతో మా మధ్య చుట్టరికం కూడా ఉంది.

జహీర్ అంకుల్ అనగానే నాకు ముందు గుర్తుకొచ్చేది క్రికెట్. వాళ్ల నాన్నగారు నవాబ్ మొయిన్ ఉద్‌దౌలాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. దేశంలో రకరకాల క్రికెట్ జట్లు వచ్చి ఆడటానికి వీలుగా సరూర్ నగర్‌లో తన ప్యాలెస్ వద్దే ఒక స్టేడియం కట్టించారు. ఆటగాళ్లను స్టేడియంకు తీసుకువెళ్లటానికి నాన్న ప్రత్యేకంగా ఒక బస్సు కొన్నారు. ఆ బస్సు పేరు సుల్తానా. ఇక మొయిన్ ఉద్‌దౌలా ప్యాలెస్ నుంచే ఆయన క్రికెట్ చూసేవారు. ఆయన అలా మ్యాచ్ చూస్తూనే మరణించారు. ఆ సమయంలో 'బెక్రమ్ ఉదౌలా ట్రోఫీ' అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది. ఈ ట్రోఫీ గెలిచిన వారికి బంగారంతో చేసిన కప్... రన్నరప్‌కు వెండితో చేసిన కప్‌లు ఇచ్చేవారు. మూడు సంవత్సరాలు వరుసగా గెలిస్తే రోలింగ్ కప్ ఇచ్చేవారు. దీని కోసం విజయనగరం లెవెన్, నవాబ్ మొయిన్ ఉద్‌దౌలా 11, ఆలీగఢ్ యూనివర్సిటీ, హైదరాబాద్ స్టేట్, లాహోర్ స్టేట్, ముంబయి, ధన్‌రాజ్ లెవెన్‌లు (ఇది మా టీమే) పోటీ పడేవి. నాన్నకు క్రికెట్ అంటే పిచ్చి. అందువల్ల ఎప్పుడూ మా టీమ్ గెలవాలని ప్రయత్నించేవారు. మా టీమ్‌లో ముస్తాక్, సి.కె.నాయుడు, పాటియాలా యువరాజు తదితరులు ఆడేవారు. దీంతో మా టీమ్‌కు మంచి క్రేజ్ ఉండేది. సి.కె.నాయుడు మా ఇంటికి వచ్చినప్పుడు... ఆయన బాల్ వేస్తుంటే నేను షటిల్ బ్యాట్‌తో క్రికెట్ ఆడేదాన్ని. టోర్నీ విషయంలో కూడా రకరకాల వివాదాలు చెలరేగుతూ ఉండేవి. విజయనగరం లెవెన్ జట్టు వరుసగా మూడుసార్లు గెలిచింది. లెక్క ప్రకారమైతే కప్పును ఇచ్చేసి రోలింగ్ షీల్డ్‌ను తీసుకోవాలి. కానీ విజయనగరం మహారాజు విజ్జీ... కప్పును ఇవ్వటానికి ఇష్టపడలేదు. దాంతో నవాబ్ మొయిన్ ఉద్‌దౌలా కొత్త కప్పును చేయించాల్సి వచ్చింది. నాన్న టీమ్‌కు కూడా రోలింగ్ షీల్డ్ వచ్చింది. ఈ టోర్నీలో ప్రతిభ ప్రదర్శించిన వారికి మొయిన్ ఉద్‌దౌలా బంగారు నాణేలు బహుమతిగా ఇచ్చేవారు.




నవాబ్ జహీర్ యార్ జంగ్


ఆ రోజుల్లో రాజ కుటుంబీలను ఎంతో ఆదరంతో చూసేవారు. పాటియాలా యువరాజు క్రికెట్ టోర్నమెంట్ ఆడటానికి వచ్చినప్పుడు మా ఇంటికి వస్తూ ఉండేవారు. ఒకసారి ఆయన నిజాంను కలిశారు. ఆయన స్టైల్ నిజాంకు చాలా నచ్చింది. దాంతో పాటియాలా మహారాజును కూడా హైదరాబాద్‌కు ఆహ్వానిస్తూ ఒక ఉత్తరం రాశారు. సాధారణంగా యువరాజు హైదరాబాద్‌కు వచ్చినప్పుడు రాజ్‌భవన్‌లో నివసించేవారు. ఒకసారి రాజ్‌భవన్‌లో డిన్నర్ ఇచ్చారు. ఆ డిన్నర్‌లో యువరాజుకు ఒక వైపు జహీర్ అంకుల్, మరో వైపు నేను కూర్చున్నాం. ఆయన పాటియాలాకు వెళ్లిన తర్వాత నాకు ఒక ఉత్తరం రాశారు. అది ఇప్పటికీ నా దగ్గర పదిలంగా ఉంది.

జహీర్ అంకుల్ కుమారుడు కుతుబ్, ప్రిన్స్ ముఖ్ఖరంఝా, మహేంద్రగిర్ ప్రాణ స్నేహితులు. ముఖ్ఖరం ఝా, మహేంద్రగిర్ ఎప్పుడూ కుతుబ్‌తోనే ఉండేవారు. వీళ్లందరికీ కార్ల పిచ్చి ఉండేది. ఆ రోజుల్లో ఖార్దార్ అనే పెద్ద ప్రొడ్యూసర్ ఉండేవారు. ఆయన ఇల్లు మెరైన్ డ్రైవ్‌లో ఉండేది. ఖార్దార్‌కు ఇద్దరు అందమైన అమ్మాయిలు ఉండేవారు. వారి కంట్లో పడటం కోసం ఈ ముగ్గురూ వాళ్లింటి ముందు కాపలా కాస్తూ ఉండేవారు. కుతుబ్ ముంబయి వచ్చినప్పుడు మా ప్యాలెస్‌లోనే ఉండేవాడు. తను, మహేంద్రగిర్ గట్టిగట్టిగా మాట్లాడుకుంటూ ఉండేవారు. ఎంత పెద్దగా మాట్లాడేవారంటే.. ఆ మాటలు దూరంగా ఉన్న నా రూమ్‌కు కూడా వినిపించేవి. నేను వెళ్లి గట్టిగా మాట్లాడవద్దని చెబుతూ ఉండేదాన్ని. కుతుబ్ మొదట్లో పెళ్లికి ఇష్టపడేవాడు కాదు. ఎన్ని సంబంధాలు వచ్చినా తిరగగొట్టేసేవాడు. దాంతో ఒక రోజు జహీర్ అంకుల్.. కుతుబ్‌ను, మహేంద్రగిర్‌ను పిలిచి.. "మీరు పెళ్లి చేసుకుంటే మంచి కారు బహుమతిగా ఇస్తా" అన్నాడు. కుతుబ్ మనసు మారింది. పెళ్లి సమయానికి జహీర్ అంకుల్.. కుతుబ్‌కు ఒక మంచి కారు బహుమతిగా ఇచ్చాడు. జహీర్ యార్‌జంగ్ ఏకైక కుమార్తె కరీమ్ పాషాను రాజా మహేంద్రగిర్ వివాహం చేసుకున్నాడు.

● రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్


LYCA PRODUCTIONS
SUBASKARAN PRESENTS
ULAGANAYAGAN
KAMAL HAASAN
IN
SHANKAR'S
భారతీయుడు II
ZERO TOLERANCE
RELEASING IN
JUNE 2024
IN CINEMAS WORLDWIDE
MUSIC ANIRUDH DIRECTOR OF PHOTOGRAPHY RAVI VARMAN
EXECUTIVE PRODUCER SUNDAR RAJ
G.K.M.TAMIL KUMARAN - M.SHENBAGAMOORTHY
PRODUCED BY SUBASKARAN
NETFLIX


PARAVA FILMS
GOKULAM GOPALAN
SREE GOKULAM MOVIES
మలయాళంలో 200 కోట్లు సాధించిన
మంజుమ్మల్ BOYS
WRITTEN & DIRECTED CHIDAMBARAM
PRODUCED BY BABU SHAHIR, SOUBIN SHAHIR, SHAWN ANTONY
ADVENTUROUS BLOCKBUSTER
think music
MYTHRI MOVIE MAKERS


ZEE STUDIOS
ZEE STUDIOS & BONEY KAPOOR PRESENT
IN ASSOCIATION WITH FRESHLIME FILMS
BAYVIEW PROJECTS
IN CINEMAS
THIS WED.
BONEY KAPOOR'S
MAIDAAN
BASED ON A TRUE STORY
EXPERIENCE IT IN IMAX
ADVANCE BOOKING NOW OPEN
SCAN THIS QR CODE TO BOOK YOUR TICKETS NOW
A FILM BY AMIT RAVINDERNATH SHARMA
MUSIC COMPOSER A.R. RAHMAN LYRICS MANOJ MUNTASHIR SHUKLA DOP TUSHAR KANTI RAY (ISC)
PRODUCED BY ZEE STUDIOS, BONEY KAPOOR, ARUNAVA JOY SENGUPTA & AKASH CHAWLA
A ZEE STUDIOS WORLDWIDE RELEASE
U/A

PARAS


VIJAY ANTONY FILM CORPORATION
MEERA VIJAY ANTONY
PRESENTS
WORLDWIDE RELEASE
APRIL 11
MYTHRI MOVIE DISTRIBUTORS LLP
VIJAY ANTONY
లవ్ గురు
VINAYAK VAITHIANATHAN
U/A


MAHAATEJA
APRIL
19
IN
THEATERS
TENANT
SCREENPLAY, DIALOGUES & DIRECTION Y. YUGANDHAR PRODUCER CHANDRASHEKHAR REDDY MOGULLA
CO-PRODUCER RAVINDER REDY N CREATIVE PRODUCER PRASUNA MANDAVA DOP JEMIN JOM AYYANETH MUSIC SAHITYYA SAGAR
EDITOR VIJAY MUKTHAVARAPU DIGITAL MEDIA HOUSEFULL PUBLICITY DESIGNER SHAKTHI GRAPHISTE PRO TEJASWI SAJJA & MADURI MADHU
ADITYA MUSIC


SUMMER FAMILY ENTERTAINER
SMT. ANITHA PRESENTS
SRI VENKATESWARA CREATIONS
A 'DIL' RAJU PRODUCTION
VIJAY DEVERAKONDA
THE FAMILY STAR
PARASURAM
RAJU SHIRISH VASUVARMA
NOW IN CINEMAS

బంగారం కొనుగోలుపై వెండి ఉచితం

జోయాలుక్కాస్ ఉగాది ఆఫర్

హైదరాబాద్: ప్రముఖ జువెలరీ బ్రాండ్ జోయాలుక్కాస్ ఉగాది పండగను పురస్కరించుకుని ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. నాలుగు రోజులు మాత్రమే అందుబాటులో ఉండే ఈ ఆఫర్ కింద వినియోగదారులు కొనుగోలు చేసిన బంగారానికి అదే బరువుతో వెండిని పూర్తిగా ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించింది. ఈ పండగ సీజన్‌లో వినియోగదారులు ఈ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోవాలని జోయాలుక్కాస్ కోరింది. ఈ ఆఫర్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని అన్ని షోరూమ్‌ల్లో అందుబాటులో ఉంటుందని తెలిపింది. వినియోగదారులు ఉగాది పండగను మరింత సంబరంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో 'బంగారం కొనండి.. అదే బరువు గల వెండిని ఉచితంగా పొందండి' ఆఫర్‌ను ప్రకటించినట్లు జోయాలుక్కాస్ ఛైర్మన్ జాయ్ అలుక్కాస్ తెలిపారు.

- జర్మనీకి చెందిన ఆప్టిక్స్, ఆప్టోఎలక్ట్రానిక్స్ సంస్థ జిస్ గ్రూప్.. హైదరాబాద్‌లో తొలి జిస్ విజన్ సెంటర్‌ను ప్రారంభించింది. భారత్‌కు చెందిన స్పెక్స్‌బంకర్‌తో కలిసి జూబ్లీహిల్స్‌లో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. హైదరాబాద్ రీజియన్‌లోని ప్రొఫెషనల్స్ వ్యక్తిగత వినియోగదారులకు ప్రపంచ స్థాయి ఐకేర్ సొల్యూషన్స్‌ను ఈ సెంటర్ అందించనుంది. ఈ సెంటర్‌లో కంటి పరీక్షలతో పాటు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీలతో కూడిన విస్తృత శ్రేణి జిస్ లెన్స్ అందుబాటులో ఉండనున్నాయి. కంపెనీ ఇప్పటికే బెంగళూరులో ఒక సెంటర్‌ను నిర్వహిస్తోంది.
- కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ సంస్థ హైసెన్స్.. మార్కెట్లోకి 4 ఇన్ 1 కన్వర్టబుల్ మోడల్ కూలింగ్ ఎక్స్‌పర్ట్ ప్రో ఏసీని విడుదల చేసింది అన్ని ప్రముఖ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్స్‌పై అందుబాటులో ఉండనున్న ఈ ఏసీ ధర రూ.27,990. క్విక్‌చిల్ టర్బో మోడ్, హైస్పీడ్ ఫ్యాన్, ఇంటలిజెంట్ కంప్రెసర్ ఈ ఏసీ ప్రత్యేకతలు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,290 ▲	65,350 ▲	87,000 ▲
ముంబై	69,882 ▼	64,012 ▼	79,096 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

7వ తేదీ



హైదరాబాద్	375	విజయవాడ	390
చిత్తూరు	458	విశాఖపట్నం	415
గోదావరి	390	వరంగల్	377

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	156	గోదావరి	152
వరంగల్	156	విజయవాడ	152
కరీంనగర్	156	గుంటూరు	152
మహబూబ్‌నగర్	156	ఒంగోలు	152
కర్నూలు	156	చిత్తూరు	148
విశాఖపట్నం	134		

విప్రో సీఈఓ డెలాపోర్ట్ రాజీనామా

కంపెనీ కొత్త సారథిగా శ్రీనివాస్ పల్లియా నియామకం



న్యూఢిల్లీ: దేశంలో నాలుగో అతిపెద్ద ఐటీ కంపెనీ విప్రో ఎండీ, సీఈఓ థియరీ డెలాపోర్ట్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో కంపెనీ కొత్త సారథిగా శ్రీనివాస్ పల్లియాను నియమించినట్లు విప్రో శనివారం ప్రకటించింది. ఈ నెల 19న కంపెనీ నాలుగో త్రైమాసిక (జనవరి-మార్చి) ఆర్థిక ఫలితాలు ప్రకటించనున్న నేపథ్యంలో సారథ్య మార్పు జరగడం గమనార్హం. గత కొంతకాలంగా విప్రో పనితీరు విషయంలో తన ప్రత్యర్థులతో పోలిస్తే వెనకబడింది. ఇందుకుతోడు, గడిచిన ఏడాది కాలంలో చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌ఓ) జతిన్ దలాల్, చీఫ్ గ్రోత్ ఆఫీసర్ స్టెఫానీ ట్రాట్మాన్ సహా పది మంది ఉన్నతాధికారులు కంపెనీని వీడారు. తాజాగా డెలాపోర్ట్ సైతం గుడ్‌బై పలికారు. ఆయన రాజీనామా ఏప్రిల్ 6 నుంచే అమల్లోకి వచ్చినప్పటికీ మే 31 వరకు కంపెనీ ఉద్యోగ బాధ్యతల్లో కొనసాగుతారని విప్రో స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం అందించింది.

నామినేషన్ అండ్ రెమ్యూనరేషన్ కమిటీ సిఫారసు మేరకు కొత్త సీఈఓ, ఎండీగా శ్రీనివాస్ పల్లియా నియామకానికి బోర్డు ఆమోదం తెలిపిందని కంపెనీ పేర్కొంది. ఈ నెల 7 నుంచి ఐదేళ్లపాటు శ్రీనివాస్ ఈ పదవిలో కొనసాగనున్నారు. ఇందుకు విప్రో వాటాదారులతో పాటు అవసరమైతే కేంద్ర ప్రభుత్వం కూడా ఆమోదం తెలపాల్సి ఉంటుంది. 2020 జూలైలో థియరీ డెలాపోర్ట్ విప్రో పగ్గాలు చేపట్టారు. అంతక్రితం ఆయన ఫ్రెంచ్ ఐటీ కంపెనీ క్యాప్‌జెమినీలో పనిచేశారు. గత ఏడాది రూ.80 కోట్ల వార్షిక పారితోషికం అందుకున్న డెలాపోర్ట్.. దేశీయ ఐటీ రంగంలో అత్యధిక ప్యాకేజీ అందుకున్న సీఈఓగా నిలిచారు. కాగా 1992లో విప్రోలో చేరిన శ్రీనివాస్..మూడు దశాబ్దాలకు పైగా కంపెనీకి సేవలందిస్తున్నారు. కంపెనీలో అంచెలంచెలుగా ఎదుగుతూ పలు కీలక బాధ్యతలను నిర్వహించారు. ప్రస్తుతం కంపెనీకి చెందిన అతిపెద్ద, వేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్ 'అమెరికాస్ 1'కు సీఈఓగా ఉన్నారు. అంతేకాదు, విప్రో ఎగ్జిక్యూటివ్ బోర్డులో సభ్యుడు కూడా. అమెరికాలోని న్యూజెర్సీ నుంచే సీఈఓగా బాధ్యతలు నిర్వహించనున్న శ్రీనివాస్..ఛైర్మన్ రిషద్ ప్రేమ్‌జీకి రిపోర్ట్ చేయనున్నారు.

ఏటా రూ.8.30 లక్షల కోట్లు

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకున్న కేంద్రం

న్యూఢిల్లీ: చాలామంది అంతర్జాతీయ ఇన్వెస్టర్లు, బహుళ జాతి కంపెనీల (ఎంఎన్‌సీ) దృష్టి చైనా నుంచి భారత్‌కు మళ్లిన నేపథ్యంలో ఏటా కనీసం 10,000 కోట్ల డాలర్ల (రూ.8.30 లక్షల కోట్లు) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను ఆకర్షించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. పరిశ్రమల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య శాఖ (డీపీఐఐటీ) కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ ఈ విషయాన్ని వెల్లడించారు. 2023 మార్చితో ముగిసిన ఐదు ఆర్థిక సంవత్సరాల్లో దేశంలోకి సగటున 7,000 కోట్ల డాలర్ల చొప్పున ఎఫ్‌డీఐలు తరలి వచ్చాయి. అంతర్జాతీయ అనిశ్చితులు, ఇతర ప్రతికూల పరిణామాల కారణంగా గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో మాత్రం ఎఫ్‌డీఐలు తగ్గాయి. ఈ ఏప్రిల్1తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లోనూ సవాళ్లున్నప్పటికీ ఎఫ్‌డీఐలు 10,000 కోట్ల డాలర్ల లక్ష్యానికి చేరువ కావచ్చని సింగ్ పేర్కొన్నారు. "వచ్చే ఐదేళ్ల పాటు కనీసం 10 వేల కోట్ల డాలర్ల చొప్పున ఎఫ్‌డీఐలను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. పెట్టుబడుల ట్రెండ్ సానుకూలంగా, పెరుగుతూ పోయేలా ఉంది"ని ఈ మధ్య బ్లూంబర్గ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న బడా ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించింది. అంతర్జాతీయ అనిశ్చితులు, ప్రతికూలతల్లోనూ మన ఆర్థిక వ్యవస్థలో కార్యకలాపాలు చురుకుగా సాగుతున్నాయి. జీడీపీ సహా ఈమధ్యకాలంలో విడుదలైన పలు స్థూల ఆర్థిక గణాంకాలే ఇందుకు నిదర్శనం.

దీంతో పలు ఎంఎన్‌సీలు, ముఖ్యంగా మాన్యుఫాక్చరింగ్ దిగ్గజాలు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నుంచి తమ వ్యాపారాలకు రక్షణ కల్పించేందుకు భారత్ వంటి సురక్షిత దేశాలకు కార్యకలాపాలను విస్తరించాలనుకుంటున్నాయి. దాంతో కేంద్ర ప్రభుత్వం భారత్‌ను చైనాకు ప్రత్యామ్నాయ తయారీ కేంద్రంగా మార్చే పనిలో ఉంది. ఈ వ్యూహంలో భాగంగా ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్, ఐటీ, హార్డ్‌వేర్, టెలికాం సహా పలు రంగాలకు ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకాల (పీఎల్‌ఐ) పథకాలను ప్రకటించింది. పీఎల్‌ఐ ప్రయోజనాలను అందుకునేందుకు యాపిల్, సామ్‌సంగ్ వంటి ఎలక్ట్రానిక్స్ దిగ్గజాలు ఇప్పటికే దేశంలో తయారీ కార్యకలాపాలను పెంచాయి.

బీ న్యూ ఉగాది ఆఫర్లు



హైదరాబాద్: ఉగాది పండగను పురస్కరించుకుని బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని వినియోగదారులకు అద్భుతమైన ఆఫర్లను ప్రకటించింది. ఈ ఆఫర్‌లో భాగంగా ప్రతి స్మార్ట్ ఫోన్ కొనుగోలుపై రూ.5,999 విలువ గల స్మార్ట్ వాచీ లేదా బడ్స్‌ను అందించనున్నట్లు సంస్థ సీఎండీ వైడీ బాలాజీ చౌదరి వెల్లడించారు. అలాగే బీ న్యూ కస్టమర్లు.. బజాజ్ ఫైనాన్స్ ద్వారా చేసే కొనుగోలుపై రూ.6,000 వరకు క్యాష్‌బ్యాక్, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు ద్వారా చేసే కొనుగోలుపై రూ.5,000 క్యాష్‌బ్యాక్, హెచ్‌డీబీ ద్వారా కొనుగోలు చేస్తే 10 శాతం వరకు క్యాష్‌బ్యాక్‌ను ఆఫర్ చేస్తున్నట్లు సంస్థ సీఈఓ సాయి నిఖిలేష్ తెలిపారు. కాగా స్మార్ట్ ఫోన్, టీవీ కొనుగోలుపై స్క్రాచ్ అండ్ విన్ గేమ్ ద్వారా స్మార్ట్ వాచీ, బడ్స్, స్మార్ట్ టీవీని ఏదైనా ఒక బహుమతిగా పొందవచ్చని బీ న్యూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి నితీష్ తెలిపారు.

కాగ్నిజెంట్‌లో జీతాల పెంపు వాయిదా

ఏప్రిల్‌కు బదులు ఆగస్టులో హైక్

న్యూఢిల్లీ: నాస్‌డాక్ లిస్టెడ్ ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ ఉద్యోగుల జీతాల పెంపును నాలుగు నెలలు వాయిదా వేసింది. గత ఏడాది ఏప్రిల్‌లో వేతన పెంపును అమలు చేసిన కంపెనీ.. ఈసారి మాత్రం ఆగస్టులో పెంచనున్నట్లు తెలిపింది. అంతర్జాతీయ ఆర్థిక మందగమనంతో ఐటీ సేవలకు డిమాండ్ తగ్గిన నేపథ్యంలో ఈ రంగ కంపెనీలు తమ లాభాల మార్జిన్లను కాపాడుకునేందుకు వీలైనన్ని మార్గాల్లో వ్యయ నియంత్రణ చర్యలు చేపడుతున్నాయి. కాగ్నిజెంట్‌కు ప్రపంచవ్యాప్తంగా 3.47 లక్షల మంది ఉద్యోగులుండగా, అందులో 2.54 లక్షల మంది కంపెనీకి చెందిన భారత కార్యాలయాల్లోనే పనిచేస్తున్నారు.

కామన్ ఇన్‌పుట్స్ మీద క్రెడిట్ ఎలా తీసుకోవాలి..?

ఇదీ GST



రాంబాబు గొండాల

రఘు ఒక పరిశ్రమను నిర్వహిస్తున్నాడు. ఇందులో పన్ను పరిధిలోకి వచ్చే ఉత్పత్తులతో పాటుగా పన్ను నుంచి మినహాయింపు పొందిన ఉత్పత్తులను కూడా తయారు చేస్తున్నాడు. అయితే ఈ రెండింటికి సంబంధించిన ముడి పదార్థాలు (రా మెటీరియల్) ఒకటే. దీంతోపాటుగా కొన్ని సర్వీసులు కామన్‌గా వాడుతున్నాడు. అంటే గోడౌన్, ఆఫీస్ అద్దె, సెక్యూరిటీ, మార్కెటింగ్, ట్రాన్స్‌పోర్ట్ సేవలు మొదలైనవి. వీటిని ఉత్పత్తి వారీగా విడదీయటం కష్టం. మరి అలాంటప్పుడు తాను కొనుగోలు చేసిన ఇన్‌పుట్స్, సర్వీసుల మీద క్రెడిట్ ఎలా పొందాలి? ఎంత మేర రివర్స్ చేయాలి అన్న దానికి జీఎస్‌టీ చట్టంలో ఒక విధానం ఉంది. ఎప్పుడైతే కామన్ ఇన్‌పుట్స్ అంటే ముడి పదార్థాలు కావచ్చు లేదా సర్వీసులు కావచ్చు. వీటిని పన్ను పరిధిలోకి వచ్చే, పన్ను నుంచి మినహాయింపు పొందే ఉత్పత్తుల కోసం వాడినట్లయితే, పన్ను మినహాయింపు పొందిన వస్తువుల ఉత్పత్తిలో వాడిన ఇన్‌పుట్స్‌కి సంబంధించిన క్రెడిట్ రివర్స్ చేయాలి. కానీ పైన చెప్పినట్లు ఇన్‌పుట్స్‌ను, సర్వీస్‌లను ఉత్పత్తి వారీగా విడదీయటం కష్టం కాబట్టి, ప్రతి నెలా మొత్తం అమ్మకాల విలువలో పన్ను మినహాయింపు పొందిన అమ్మకాల విలువ ఎంతో లెక్కించి దామాషా పద్ధతిలో తీసుకున్న క్రెడిట్‌ను రివర్స్ చేయాల్సి ఉంటుంది. దీన్ని ఒక ఉదాహరణ ద్వారా తెలుసుకుందాం.

జనవరి నెలలో ముడి పదార్థాల మీద రూ.10 లక్షల మేర క్రెడిట్, సర్వీసుల మీద రూ.2 లక్షల వరకు క్రెడిట్ పొందాడనుకుందాం. అంటే మొత్తం మీద రూ.12 లక్షల వరకు అతనికి క్రెడిట్ వచ్చింది. అలాగే ఆ నెలలో మొత్తం రూ.20 లక్షల వరకు అమ్మకాలు జరిగాయి. అంటే సరఫరాలు జరిగాయి. వీటిలో రూ.15 లక్షల వరకు పన్ను పరిధిలోకి వచ్చే అమ్మకాలు కాగా, రూ.5 లక్షలు పన్ను మినహాయింపు పొందిన అమ్మకాలు ఉన్నాయి. అంటే మొత్తం అమ్మకాల్లో పన్ను మినహాయింపు పొందిన అమ్మకాలు 25 శాతం అన్నమాట. కాబట్టి తాను పొందిన రూ.12 లక్షల క్రెడిట్‌లో నుంచి 25 శాతం అంటే రూ.3 లక్షల క్రెడిట్ ఆ నెలకు దాఖలు చేసే జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్‌లో రివర్స్ చేయాలి. ఇలా ప్రతి నెలా చేస్తుండాలి. అయితే ఇందులో చిన్న సమస్య ఉంది. తీసుకున్న క్రెడిట్‌కు, ఉత్పత్తిలో వాడిన ఇన్‌పుట్స్‌కు, జరిపిన అమ్మకాలకు కొన్ని సార్లు సంబంధం ఉండకపోవచ్చు.

ఉదాహరణకు ఎక్కువ మొత్తంలో ముడి పదార్థాలు కొనుగోలు చేస్తే ధర తక్కువ వస్తుంది. ట్రాన్స్‌పోర్ట్ కలిసివస్తుందని.. రఘు తాను వాడే ముడి పదార్థాలను భారీ మొత్తంలో కొనుగోలు చేశాడనుకుందాం. సహజంగానే, వీటి మీద క్రెడిట్ కూడా భారీగానే వస్తుంది. అయితే, ఆ నెలలో తనకు పన్ను మినహాయింపు పొందిన ఉత్పత్తులకు ఎక్కువ ఆర్డర్ వచ్చింది. అప్పుడు ఆపైన చెప్పిన పద్ధతి ప్రకారం ఎక్కువ క్రెడిట్ రివర్స్ చేయాల్సి ఉంటుంది. కానీ, తదుపరి జరిపే అమ్మకాల్లో సింహభాగం పన్ను కింద వచ్చే అమ్మకాలు ఉండవచ్చు. అయినప్పటికీ అప్పటికే రఘు భారీ మొత్తంలో క్రెడిట్ రివర్స్ చేయటం జరిగింది. కాబట్టి దాన్ని తిరిగి తీసుకోలేడు. అలాగే కొన్నిసార్లు దీనికి వ్యతిరేకంగా కూడా జరగవచ్చు. అంటే, క్రెడిట్ పొందిన నెలలో ఎక్కువ భాగం పన్ను కింద అమ్మకాలు జరిగి తదుపరి నెలలలో పన్ను మినహాయింపు జరిపే అమ్మకాలు జరగవచ్చు.

అందుకే దీన్ని దృష్టిలో పెట్టుకుని నెలవారీ రిటర్నులు చేస్తూ ఆర్థిక సంవత్సరం చివరలో ఆ ఆర్థిక సంవత్సరంలో పొందిన మొత్తం క్రెడిట్‌ను పరిగణనలోకి తీసుకుని సంవత్సరం మొత్తంలో జరిపిన అమ్మకాల్లో పన్ను మినహాయింపు పొందిన అమ్మకాల శాతం లెక్కించి, దాని ప్రకారం రివర్స్ చేయాల్సిన క్రెడిట్ ఎంతో లెక్కించుకోవాలి.

ఈ విలువ ఆ సంవత్సరంలో ప్రతి నెల రివర్స్ చేసిన మొత్తాల కంటే ఎక్కువ ఉంటే ఆ మేర అదనంగా రివర్స్ చేయాలి. ఎందుకంటే తాను చేయవలసిన రివర్స్ కంటే తక్కువ చేసినట్లు. ఒకవేళ ఈ విలువ కంటే నెలవారీ రివర్స్ చేసిన మొత్తం ఎక్కువ ఉంటే, తాను రివర్స్ చేయాల్సిన దాని కంటే ఎక్కువ చేసినట్లుగా భావించి ఆ మేర క్రెడిట్‌ను తదుపరి నెల జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్‌లో తీసుకోవచ్చు. ఇలా అదనంగా రివర్స్ చేయటం లేదా పొందటమనేది ఆ ఆర్థిక సంవత్సరం తదుపరి వచ్చే సెప్టెంబరు నెల జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్ దాఖలు చేయాల్సిన గడువు తేదీ లోపు అంటే అక్టోబరు 20 లోపు పూర్తి చేయాల్సి ఉంటుంది.

అంటే 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గడువు తేదీ 2024 అక్టోబరు 20. కానీ ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే, క్రెడిట్ రివర్స్ చేయాల్సిన సందర్భంలో ఏప్రిల్ 1 నుంచి క్రెడిట్ రివర్స్ చేసినంత వరకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. అంటే మార్చి 31 వరకు ఈ లెక్కలు పూర్తి చేసి క్రెడిట్ రివర్స్ చేస్తే ఎలాంటి వడ్డీ చెల్లించనవసరం లేదు. లేకుంటే వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఏది ఏమైనా క్రెడిట్ రివర్స్ చేయాల్సిన సందర్భంలో ఆ మొత్తాన్ని గడువు లోపల కచ్చితంగా చెల్లించాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్‌లు

ముంబై x ఢిల్లీ	మ.3.30 నుంచి
లఖ్‌నవూ x గుజరాత్	రాత్రి 7.30 నుంచి

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	చాహల్ (రాజస్థాన్)
316 పరుగులు	8 వికెట్లు

ప్రతి సిక్స్‌కు.. ఆరు ఇళ్లకు సోలార్ కరెంట్

రాజస్థాన్ మహిళల సాధికారిత కోసం రాజస్థాన్ రాయల్స్ జట్టు తమవంతు సహకారం అందించనుంది. 'పింక్ ప్రామిస్'గా శనివారం బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో ఇరుజట్ల నుంచి నమోదైన ప్రతి సిక్స్‌కు.. ఆరు గృహాల చొప్పున సోలార్ కరెంట్ సదుపాయాన్ని కల్పిస్తామని రాయల్స్ యాజమాన్యం ప్రకటించింది. అంతేకాకుండా ఈ మ్యాచ్‌లో అమ్ముడైన ప్రతి టికెట్‌కు రూ. 100 చొప్పున స్వచ్ఛంద సంస్థకు అందజేస్తామంది. కాగా, ఈ మ్యాచ్‌లో మొత్తం 13 సిక్స్‌లు నమోదయ్యాయి.

కజకిస్థాన్ చాలెంజ్ విజేత తరుణ్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): కజకిస్థాన్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాద్ యువ షట్లర్ మన్నెపల్లి తరుణ్ సింగిల్స్ చాంపియన్‌గా నిలిచాడు. శనివారం కజకిస్థాన్‌లోని అస్తానాలో జరిగిన ఫైనల్లో తరుణ్ 21-10, 21-19తో సూంగ్ జో వెన్ (మలేసియా)పై గెలిచి ట్రోఫీ అందుకున్నాడు. మహిళల సింగిల్స్ టైటిల్‌ను భారత్‌కే చెందిన అనుపమ ఉపాధ్యాయ దక్కించుకుంది.

ఏఐటీఏ రన్నరప్‌గా సంజన



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఏఐటీఏ మహిళల టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి సంజన సిరిమల్ల సింగిల్స్ రన్నరప్‌గా నిలిచింది. శామీర్‌పేట్‌లో శనివారం జరిగిన ఫైనల్లో వడదెబ్బ కారణంగా సంజన మ్యాచ్ మధ్యలోనే వైదొలగింది. దీంతో ప్రత్యర్థి నికోల్ (తమిళనాడు)ను విజేతగా నిలిచింది.

సుమిత్ శుభారంభం

మోంటే కార్లో (ఫ్రాన్స్): భారత ఏస్ టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నగాల్ మోంటే కార్లో మాస్టర్స్‌లో శుభారంభం చేశాడు. శనివారం జరిగిన క్వాలిఫయర్స్‌లో సుమిత్ 6-2, 6-3తో ప్రపంచ 63వ ర్యాంకర్ ఫ్లావియో కొబోలి (ఇటలీ)పై గెలుపొందాడు.

రాజస్థాన్ జోష్

బట్లర్ అజేయ శతకం

వరుసగా నాలుగో విజయంతో టాప్‌లోకి

● బెంగళూరు ఓటమి ● విరాట్ సెంచరీ వృథా



జోష్ బట్లర్ (58 బంతుల్లో 100 నాటౌట్)

2 ఐపీఎల్‌లో ఎక్కువ సెంచరీలు (6) చేసిన రెండో బ్యాటర్‌గా గేల్‌తో సమంగా నిలిచిన బట్లర్. విరాట్ (8) అగ్రస్థానంలో ఉన్నాడు.

1 ఐపీఎల్‌లో ఏ వికెట్‌కైనా ఎక్కువ సార్లు (10) 100+ భాగస్వామ్యాలు నమోదు చేసిన జోడీగా విరాట్-డుప్లెసి.

జైపూర్: ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జైత్రయాత్ర కొనసాగిస్తోంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో అదరగొడుతూ ప్రత్యర్థి జట్లకు గుబులుపుట్టిస్తోంది. కెరీర్‌లో వందో లీగ్ మ్యాచ్ ఆడిన ఓపెనర్ జోష్ బట్లర్ (58 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 100 నాటౌట్) అజేయ శతకంతో ఎట్టకేలకు సత్తా చాటుకున్నాడు. ఫలితంగా రాజస్థాన్ 6 వికెట్లతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుపై నెగ్గింది. 8 పాయింట్లతో శాంసన్ సేన టేబుల్ టాపర్‌గా ఉంది. రాజస్థాన్‌కిది వరుసగా నాలుగో గెలుపుకాగా.. ఆర్‌సీబీకి ఐదు మ్యాచ్‌ల్లో నాలుగో ఓటమి. విరాట్ కోహ్లీ (72 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్లతో 113 నాటౌట్) సైతం శతకం సాధించినా ఆర్‌సీబీకి ఫలితాన్నివ్వలేకపోయింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా ఆర్‌సీబీ 20 ఓవర్లలో 3 వికెట్లకు 183 పరుగులు చేసింది. డుప్లెసి (33 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 44) రాణించాడు. ఛేదనలో రాజస్థాన్ 19.1 ఓవర్లలో 4 వికెట్లకు 189 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ సంజూ శాంసన్ (42 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 69) అర్ధసెంచరీ సాధించాడు. టోప్లేకు 2 వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా బట్లర్ నిలిచాడు.

బట్లర్, శాంసన్ అదుర్స్: ఛేదనలో నిదానంగా ఆరంభమైన రాజస్థాన్ ఇన్నింగ్స్ బట్లర్, శాంసన్‌ల బాదుడుకు జోరందుకుంది. అటు ఆర్‌సీబీ బౌలర్లు ఎప్పటిలాగే నిరాశపరిచారు. టోప్లే ఒక్కడే ఆకట్టుకోగలిగాడు. ఓపెనర్ జైస్వాల్ (0) ఈ సీజన్‌లో పేలవ ఫామ్‌ను మరోసారి కొనసాగించగా, తొలి ఐదు ఓవర్లు ముగిసేసరికి రాజస్థాన్ స్కోరు 34/1 మాత్రమే. అయితే తన చివరి ఆరు ఇన్నింగ్స్‌లో 35 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచిన ఇంగ్లండ్ స్టార్ బట్లర్ ఎట్టకేలకు ఫామ్‌ను అందుకున్నాడు. ఆరో ఓవర్‌లో అతడు 4,4,6,4తో 20 రన్స్ రాబట్టడంతో పవర్‌ప్లేను జట్టు 54 పరుగులతో ముగించింది. తర్వాత మధ్య ఓవర్లలోనూ వేగాన్ని తగ్గించకుండా బట్లర్, శాంసన్ దీటుగా పరుగుల వరద పారించారు. ఈ ఇద్దరూ చకచకా బౌండరీలతో రన్‌రేట్ తగ్గకుండా చూశారు. 30 బంతుల్లోనే బట్లర్ ఫిఫ్టీ పూర్తి చేయగా, 11వ ఓవర్‌లో శాంసన్ 4,6,4తో 33 బంతుల్లో ఈ ఫీట్ సాధించాడు. అయితే 15వ ఓవర్‌లో శాంసన్ వికెట్ తీసిన సిరాజ్ రెండో వికెట్‌కు 148 పరుగుల భాగస్వామ్యానికి తెర దించాడు. తర్వాతి ఓవర్‌లో రియాన్ పరాగ్ (4)ను యష్ దయాల్, ధ్రువ్ జురెల్ (2)ను టోప్లే అవుట్ చేశారు. అప్పటికి జట్టు గెలుపునకు 18 బంతుల్లో 14 రన్స్ అవసరమవగా, హెట్‌మయెర్ (11 నాటౌట్)తో కలిసి బట్లర్ మ్యాచ్‌ను ముగించాడు. అయితే ఆఖరి ఓవర్‌లో గెలుపునకు ఒక్క పరుగు అవసరం కాగా, బట్లర్ 94 పరుగుల వద్ద ఉన్నాడు. దీంతో అతడు తొలి బంతినే సిక్సర్‌గా మలిచి సెంచరీ పూర్తి చేసుకోవడం విశేషం.



విరాట్ కోహ్లీ (72 బంతుల్లో 113 నాటౌట్)

1 ఐపీఎల్‌లో అత్యధిక (8) శతకాలు బాదిన బ్యాటర్‌గా విరాట్ కోహ్లీ.

ఐపీఎల్‌లో నెమ్మదైన (67 బంతుల్లో) శతకం సాధించిన బ్యాటర్‌గా మనీశ్ పాండేతో సమంగా నిలిచిన కోహ్లీ.

కోహ్లీ ఒక్కడై: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ విరాట్ కోహ్లీ అంతా తానై తుది కంటా నిలిచాడు. ఈ క్రమంలో మరో ఓపెనర్ డుప్లెసితో కలిసి తొలి వికెట్‌కు శతక భాగస్వామ్యం నెలకొల్పాడు. అలాగే ఈ సీజన్‌లో బెంగళూరు జట్టు తొలిసారి వికెట్ కోల్పోకుండా పవర్‌ప్లేను ముగించగలిగింది. అయితే మధ్య ఓవర్లలో అంత వేగం కనిపించలేదు. తొలి ఓవర్‌లోనే వికెట్ తీసే అలవాటున్న పేసర్ బౌల్ట్ ఈసారి తేలిపోయాడు. ఫామ్‌లో లేని డుప్లెసి ఆరంభంలో నిలదొక్కుకునే ప్రయత్నం చేయగా, విరాట్ వేగం కనబర్చడంతో పవర్‌ప్లేలో జట్టు 53 పరుగులు సాధించింది. ఆ తర్వాత స్పిన్నర్లు అశ్విన్, చాహల్ పరుగులను కట్టడి చేశారు. కానీ బౌల్ట్ వేసిన ఇన్నింగ్స్ 9వ ఓవర్‌లో డుప్లెసి రెండు సిక్సర్లతో 15 రన్స్ అందించాడు. అటు చాహల్, రియాన్ ఓవర్లలో ఒక్కో సిక్సర్‌తో విరాట్ అర్ధసెంచరీ పూర్తి చేశాడు. స్కోరు నెమ్మదించడంతో వేగంగా ఆడే యత్నంలో డుప్లెసి 14వ ఓవర్‌లో చాహల్‌కు దొరికిపోయాడు. దీంతో తొలి వికెట్‌కు 125 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. హిట్టింగ్ కోసం మ్యాక్స్‌వెల్ (1), సౌరవ్ చౌహాన్ (9)లను ముందే పంపినా ఫలితం లేకపోయింది. ఈ సమయంలో ఆర్‌సీబీకి కావాల్సిన జోష్‌ను 16వ ఓవర్‌లో కోహ్లీ మూడు ఫోర్లతో అందించాడు. అటు 19వ ఓవర్‌లో బర్గర్ నాలుగు పరుగులే ఇవ్వగా.. విరాట్ ఓ సింగిల్‌తో 67 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. చివరి ఓవర్‌లో కోహ్లీ మూడు ఫోర్లు బాది 14 రన్స్ రాబట్టడంతో జట్టు స్కోరు 180 దాటింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	4	4	0	0	8	1.120
కోల్‌కతా	3	3	0	0	6	2.518
చెన్నై	4	2	2	0	4	0.517
లఖ్‌నవూ	3	2	1	0	4	0.483
హైదరాబాద్	4	2	2	0	4	0.409
పంజాబ్	4	2	2	0	4	-0.220
గుజరాత్	4	2	2	0	4	-0.580
బెంగళూరు	5	1	4	0	2	-0.843
ఢిల్లీ	4	1	3	0	2	-1.347
ముంబై	3	0	3	0	0	-1.423

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్



శాంసన్ (69)

స్కోరుబోర్డు

బెంగళూరు: కోహ్లీ (నాటౌట్) 113, డుప్లెసి (సి) బట్లర్ (బి) చాహల్ 44, మ్యాక్స్‌వెల్ (బి) బర్గర్ 1, సౌరవ్ చౌహాన్ (సి) జైస్వాల్ (బి) చాహల్ 9, గ్రీన్ (నాటౌట్) 5, **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 183/3; వికెట్ల పతనం:** 1-125, 2-128, 3-155; **బౌలింగ్:** బౌల్ట్ 3-0-30-0, బర్గర్ 4-0-33-1, అశ్విన్ 4-0-28-0, ఆవేశ్ 4-0-46-0, చాహల్ 4-0-34-2, రియాన్ 1-0-10-0.

రాజస్థాన్: జైస్వాల్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) టోప్లే 0, జోష్ బట్లర్ (నాటౌట్) 100, సంజూ శాంసన్ (సి) యశ్ (బి) సిరాజ్ 69, రియాన్ పరాగ్ (సి) కోహ్లీ (బి) యష్ 4, జురెల్ (సి) కార్తీక్ (బి) టోప్లే 2, హెట్‌మయెర్ (నాటౌట్) 11, **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 19.1 ఓవర్లలో 189/4; వికెట్ల పతనం:** 1-0, 2-148, 3-155, 4-164; **బౌలింగ్:** టోప్లే 4-0-27-2, యశ్ దయాల్ 4-0-37-1, సిరాజ్ 4-0-35-1, దాగర్ 2-0-34-0, గ్రీన్ 3.1-0-27-0, హిమాన్షు 2-0-29-0.

నకామురాకు విదిత్ షాక్

హంపికి డ్రా
క్యాండిడేట్స్ చెస్

టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్ రెండో రౌండ్‌లో వరల్డ్ నెం.3 నకామురా (అమెరికా)కు భారత గ్రాండ్‌మాస్టర్ విదిత్ గుజ్‌రాతీ షాకిచ్చాడు. నల్లపావులతో తలపడిన విదిత్ కేవలం 29 ఎత్తుల్లో ప్రత్యర్థిని చిత్తు చేశాడు. ఇద్దరు భారత గ్రాండ్‌మాస్టర్లు తలపడిన మరో రెండో రౌండ్‌లో గుకేష్ 33 ఎత్తుల్లో ప్రజ్ఞానందపై గెలుపొందాడు. నెపోమ్నియాచి-అలిరెజాను, టాప్‌సీడ్ కరువానా-అబసోవ్‌ను ఓడించారు. రెండో రౌండ్ ముగిసేసరికి విదిత్, గుకేష్, కరువానా, నెపోమ్నియాచి తలా 1.5 పాయింట్లతో అగ్ర స్థానంలో కొనసాగుతున్నారు. ఇక, మహిళల విభాగంలో తెలుగు గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపికి రెండో రౌండ్‌లోనూ డ్రా ఎదురైంది. క్యాథరినా లగ్నో (రష్యా)తో గేమ్‌లో హంపి 38 ఎత్తుల అనంతరం డ్రాకు అంగీకరించింది. సలిమోవా-లీ టింగ్ జీ గేమ్ కూడా ఫలితం తేలకుండా ముగిసింది. గ్రాండ్‌మాస్టర్ ఆర్.వైశాలీ-టాన్ జోంగ్యీ చేతిలో పోరాడి ఓడింది. వరుసగా రెండో విజయంతో టాన్ (2 పాయింట్లు) టాప్‌లో కొనసాగుతోంది. మరో ఇద్దరితో కలిసి హంపి (1) మూడో స్థానంలో నిలిచింది. వైశాలీ (0.5) ఆరో స్థానంలో కొనసాగుతోంది.

రాళ్లను మోస్తూ.. పర్వతాలు ఎక్కుతూ

ఆర్మీ పర్యవేక్షణలో పాక్ జట్టు సాధన



కరాచీ: టీ20 వరల్డ్ కప్‌లో సత్తా చాటేందుకు పాకిస్థాన్ క్రికెట్ జట్టు అత్యంత తీవ్రంగా శ్రమిస్తోంది. ముఖ్యంగా ఫిట్‌నెస్‌కు ఎంతో ప్రాధాన్యమిస్తూ కొండలు, గుట్టలు ఎక్కుతోంది. అబోటాబాద్‌లోని ఆర్మీ ఫిజికల్ ట్రైనింగ్ స్కూల్ అధికారుల పర్యవేక్షణలో 29 మందితో కూడిన పాక్ జట్టు కఠోర శిక్షణ తీసుకొంటోంది. ఈక్రమంలో పెద్ద రాళ్లను మోస్తూ.. రాళ్లతో నిండిన పర్వతాన్ని ఎక్కుతున్న వీడియోను ఆల్‌రౌండర్ ఇఫ్తికార్ అహ్మద్ ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు. రిజ్వాన్, నసీమ్ షా కూడా రాళ్లను మోస్తూ, పర్వతం ఎక్కారు. రెండు వారాల ఈ శిక్షణ సోమవారంతో ముగియనుంది. ప్రపంచ కప్ జూన్‌లో అమెరికా/వెస్టిండీస్‌లో జరగనుంది.

విరాట్ కటింగ్‌కు రూ. లక్షపైనే!



న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీకి ఆటగాడిగానే కాదు.. ఫ్యాషన్ ఐకాన్‌గానూ యూత్‌లో ఎంతో క్రేజ్ ఉంది. అతడి డ్రెస్సింగ్‌తోపాటు హెయిర్ స్టైల్స్‌కు ఫాలోయర్లు ఎక్కువే. ప్రతి ఐపీఎల్‌కు సరికొత్త హెయిల్ స్టైల్‌తో బరిలోకి దిగే కోహ్లీ.. ఈసారి కూడా అదే ట్రెండ్‌ను అనుసరించాడు. అయితే, ఇలాంటి స్టైల్ చేయడాన్నిట ప్రముఖ హెయిర్ డ్రెస్సర్ అలీమ్ హకీమ్ ఎంత చార్జ్ చేశాడో తెలిస్తే.. నోరెళ్లబెట్టాల్సిందే. కోహ్లీ హెయిర్ స్టైల్ కోసం ఎంత తీసుకొన్నాడో అతడు సూటిగా చెప్పలేదు. కానీ, తన చార్జ్ కనీసం రూ. లక్ష నుంచి ఉంటుందని చెప్పాడు. ధోనీ కూడా హకీమ్ ఖాతాదారుడే.

ఉప్పల్ స్టేడియంకు కరెంట్ కట్‌పై విచారణ

- సీఎం, ఉప ముఖ్యమంత్రి ఆరా
- నివేదిక ఇవ్వాలని ట్రాన్స్‌కో ఎస్పీకి ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశాలు

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఉప్పల్ స్టేడియానికి కరెంట్ కట్ వ్యవహారంపై ప్రభుత్వం ఆగ్రహంతో ఉంది. సరిగ్గా హైదరాబాద్ సన్‌రైజర్స్ చెన్నై సూపర్‌కింగ్స్ మ్యాచ్‌కు ఒక్కరోజు ముందు కరెంట్ బిల్లులు చెల్లించలేదని దక్షిణ డిస్కమ్(ఎస్పీడీసీఎల్) అధికారులు కరెంట్ కట్ చేశారు. అడిగినన్ని టికెట్లు ఇవ్వలేదనే కారణంతోనే కరెంట్ కట్ చేశారని, దీనికి బకాయిలకు సంబంధం లేదని ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై సీఎం రేవంత్‌తో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరా తీశారు. కరెంట్ కట్ చేయడానికి బకాయిలే కారణమా? ఇతర కారణాలున్నాయా అని విచారణ జరపాలని అధికారులను వారు ఆదేశించినట్లు సమాచారం. దాంతో ఈ వ్యవహారంపైనా, విద్యుత్‌శాఖపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి, నివేదిక అందించాలని ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌కు ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ఎస్ఏఎం రిజ్వీ ఆదేశాలు జారీ చేశారు. వాస్తవాలేంటో నిగ్గు తేల్చాలని ఆదేశించారు. మరోవైపు బకాయి మొత్తాన్ని నాలుగు సమాన వాయిదాల్లో చెల్లించడానికి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ముందుకొచ్చింది. ఇందులో మొదటి వాయిదాను శనివారం చెల్లించింది. మిగిలిన మొత్తాన్ని మూడు సమాన వాయిదాల్లో చెల్లించనుంది.


రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణం చేస్తున్న అనిల్ కుమార్ యాదవ్

రాజ్యసభ సభ్యునిగా నడ్డా ప్రమాణ స్వీకారం

- తెలంగాణ నుంచి అనిల్‌కుమార్ యాదవ్..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా శనివారం రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేశారు. తెలంగాణకు చెందిన కాంగ్రెస్ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ కూడా ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంట్ హాల్‌లోని ప్రత్యేక రూంలో ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ వీరితో పాటు మరో నలుగురు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. బీజేపీ సభ్యులుగా మహారాష్ట్ర నుంచి అశోక్‌రావు శంకర్ రావు చవాన్(అశోక్ చవాన్), రాజస్థాన్ నుంచి చున్నీ లాల్ గరాసియా, తృణమూల్ కాంగ్రెస్ నుంచి సుస్మితా దేవ్, మహ్మద్ నదిముల్ హక్ ప్రమాణం చేశారు.

విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో అనిల్

కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ కుమారుడైన అనిల్ కుమార్ యాదవ్ విద్యార్థి దశలోనే రాజకీయాల్లోకి వచ్చారు. 2015 నుంచి2018 వరకు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. 2018లో ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. గతేడాది సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు.

కంటోన్మెంట్ బీజేపీ అభ్యర్థిగా సందీప్ సాయి?

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా ఎం.ఎస్. సందీప్ సాయి పేరు తెరపైకి వచ్చింది. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ సెంట్రల్ జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. గత ఎన్నికల్లో కంటోన్మెంటు నుంచి బీజేపీ తరఫున పోటీ చేసిన శ్రీగణేశ్ ఇటీవల కాంగ్రెస్‌లో చేరగా, ఆయన అభ్యర్థిత్వాన్ని ఆ పార్టీ ఖరారు చేసిన సంగతి తెలిసిందే. దీంతో బీజేపీ రాష్ట్ర నాయకత్వం సందీప్ సాయితో పాటు మరో ఇద్దరు నేతల పేర్లను పరిశీలిస్తోంది. హైదరాబాద్ మొదటి మేయర్, మాజీమంత్రి ఎం.ఆర్. శ్యాంరావు మనవడు సందీప్ సాయి. చివరి నిమిషంలో సమీకరణాలు మారితే తప్ప సందీప్‌కే టిక్కెట్టు ఇచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని బీజేపీ వర్గాలు వివరించాయి.

3వారాల్లో రూ. 49 కోట్లు పట్టుబడింది:పోలీసులు

లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ తనిఖీల్లో భారీగా నగదు, మద్యం, బంగారం, వెండి, ఇతర బహుమతులు పట్టుబడుతున్నాయి. మూడువారాల్లో స్వాధీనం చేసుకున్న వాటి విలువ రూ. 49 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. మార్చి 16న ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి శనివారం వరకు పోలీస్ తనిఖీల్లో సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ. 31.12 కోట్ల నగదు పట్టుబడినట్లు డీజీపీ కార్యాలయ అధికారులు శనివారం తెలిపారు. అలాగే రూ. 3.21 కోట్లకుపైగా విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

త్వరలో కాంగ్రెస్‌లోకి..
25 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

ఎన్నికల తర్వాత ఆ పార్టీ మనుగడే ఉండదు.. కేసీఆర్‌లా మేం దొంగ పాస్‌పోర్టులు అమ్మలేదు

- ప్రస్తుత కరువుకు కేసీఆరే కారణం
- ఇతర దేశాల్లోనైతే కేసీఆర్‌కు ఉరే
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వ్యాఖ్యలు
- నా ఫోన్, పొంగులేటి ఫోన్‌ను ట్యాప్ చేశారు: మంత్రి జూపల్లి
- ఎవరు ఎవరిని తొక్కుతారో చూద్దాం: మంత్రి పొన్నం


మీడియాతో మాట్లాడుతున్న మంత్రులు ఉత్తమ్ , జూపల్లి, పొన్నం

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు చెందిన 25 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరబోతున్నారంటూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకి మనుగడే ఉండదని, ఈ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి ముగింపు పలకడం ఖాయమని అన్నారు. గతంలో 104 మంది ఎమ్మెల్యేలున్న బీఆర్ఎస్ పార్టీ.. కేసీఆర్ పొగరు వల్లనే నేడు 39 మందికి పడిపోయిందన్నారు. వారిలోనూ 20 నుంచి 25 మంది కాంగ్రెస్‌లో చేరబోతున్నారని చెప్పారు. శనివారం మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి గాంధీభవన్‌లో ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. సూర్యాపేట, కరీంనగర్‌లో కేసీఆర్ మాట్లాడిన ప్రతి మాటా అబద్ధమేనని, సాగునీటి ప్రాజెక్టులను, శాఖను ఆయన సర్వనాశనం చేశారని ఆరోపించారు. "మమ్మల్ని పట్టుకుని చవటలు, దద్దమ్మలంటూ కేసీఆర్ మాట్లాడుతున్నారు. మేమేమీ కేసీఆర్‌లా దొంగ పాస్‌పోర్టులు అమ్మి రాజకీయాల్లోకి రాలేదు. కాంట్రాక్టర్లకు బ్రోకర్‌లా పని చేయలేదు. ఆయన ఫ్రస్టేషన్లో ఏదేదో మాట్లాడుతున్నారు. రాష్ట్రాన్ని కమీషన్ల కోసం కాంట్రాక్టర్లకు అమ్మింది ఎవరు?" అని ఉత్తమ్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రస్తుతం పంటలు ఎండిపోతున్న పరిస్థితికి కేసీఆరే కారణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది డిసెంబరులోనని, వర్షాకాలంలో సీఎంగా ఉన్నది కేసీఆరేననే విషయాన్ని మరిచిపోవద్దన్నారు. ఏపీ సీఎం వైఎస్ జగన్.. కృష్ణాజలాలను తరలించుకుపోవడంలో కేసీఆర్ భాగస్వామిగా ఉన్నారని తెలిపారు. ఉమ్మడి ఏపీ కంటే ప్రత్యేక తెలంగాణలోనే కృష్ణా జలాలను ఏపీకి ఎక్కువగా తరలించుకుపోయిన విషయాన్ని తాము అసెంబ్లీ సాక్షిగా వివరించామని గుర్తు చేశారు.

మేడిగడ్డపై అప్పుడెందుకు మాట్లాడలేదు?

మేడిగడ్డ కుంగిపోయినప్పుడు సీఎంగా కేసీఆరే ఉన్నారని, దానిపై అప్పుడెందుకు నోరు మెదపలేదని ఉత్తమ్ ప్రశ్నించారు. కేసీఆర్ చేసిన దోపిడీకి ఇతర దేశాల్లోనైతే ఆయనను ఉరి తీసేవారన్నారు. సూర్యాపేట, పాలేరులకు సాగర్ నీళ్లు వదిలింది తాగునీటి కోసమే తప్ప.. కేసీఆర్ ముఖం చూసి కాదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహా తమ మంత్రివర్గమంతా టీమ్ వర్క్‌తో పని చేస్తున్నామని, అందుబాటులో ఉన్న నీళ్లతో రైతులను ఎలా ఆదుకోవాలనేదానిపై సమీక్ష చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. గోదావరి జలాలపై మాట్లాడే అర్హత కేసీఆర్‌కు ఉందా? అని ప్రశ్నించారు. కేసీఆర్ లాంటి అవగాహన లేని, పొగరుబోతు వ్యక్తిని తాను ఎన్నడూ చూడలేదని ఉత్తమ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ కమీషన్ల కక్కుర్తి వల్లే అంబేడ్కర్ ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టు కాస్తా కాళేశ్వరం ప్రాజెక్టుగా మారిందని, ఈ విషయాన్ని అప్పటి ఇంజనీరు ఒకరు తనకు చెప్పారని తెలిపారు. కేసీఆర్ హయాంలోనే మేడిగడ్డ నీళ్లన్నింటినీ కిందకు వదిలి పెట్టారని, ఈ కరువు బీఆర్ఎస్ తీసుకువచ్చిందేనని అన్నారు. ప్రజలు కేసీఆర్ దొంగమాటలు నమ్మవద్దని, విద్యుత్తు, తాగునీటి సమస్య రాకుండా ప్రభుత్వం చూసుకుంటుందని హామీ ఇచ్చారు. తామే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు.

బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదు..

కేసీఆర్ తలకిందులుగా తపస్సు చేసినా.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోతే పార్టీని రద్దు చేసుకుంటానని చెప్పే దమ్ము కేసీఆర్‌కు ఉందా? అని సవాల్ విసిరారు. కేసీఆర్ చవట, దద్దమ్మ కాబట్టే.. ధనిక రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని జూపల్లి ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తన ఫోన్, మరో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫోన్ ట్యాప్ అయ్యాయని, దానిపై తాము అప్పుడే పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తాము ఆదివారం నుంచి ఫీల్డ్‌లో ఉంటామని, ఎవరు.. ఎవరిని తొక్కుతారో చూద్దామని సవాల్ చేశారు. కరీంనగర్‌కు తాను, కేసీఆర్.. ఇద్దరమూ ఎంపీలుగా చేశామని, రచ్చ ఎలా చేస్తారో చూద్దామని అన్నారు.

కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్

- గీతారెడ్డి అనుచరుడిగా రాజకీయాల్లోకి
- 2 సార్లు టికెట్ రాకపోవడంతో నిరాశ
- 2018, 23లో బీజేపీనుంచి పోటీ
- తాజాగా కాంగ్రెస్‌లోకి.. ఆయనకే టికెట్



న్యూఢిల్లీ/సికింద్రాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థిగా నారాయణన్ శ్రీగణేశ్‌ను ఆ పార్టీ ప్రకటించింది. ఈ మేరకు శనివారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మరణంతో కంటోన్మెంట్ స్థానం ఖాళీ అయిన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికలతోపాటే కంటోన్మెంట్ ఉప ఎన్నికకు కూడా కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. కంటోన్మెంట్‌లో విజయం సాధించాలని భావిస్తున్న కాంగ్రెస్ బీజేపీ, బీఆర్ఎస్ కన్నా ముందుగానే అభ్యర్థిని ప్రకటించింది. కాగా, మాజీ మంత్రి గీతారెడ్డి అనుచరుడిగా రాజకీయాల్లోకి వచ్చిన శ్రీగణేశ్ కంటోన్మెంట్ ప్రజలకు సుపరిచితుడే. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కంటోన్మెంట్ కాంగ్రెస్ సీటు ఆశించినా.. నిరాశే మిగిలింది. దీంతో 2018లో బీజేపీలో చేరి, ఆ పార్టీ నుంచి పోటీ చేసినా.. విజయం దక్కలేదు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి.. 2023 ఎన్నికల్లో కంటోన్మెంట్ బీఆర్ఎస్ టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. కానీ, సిటింగ్ ఎమ్మెల్యే సాయన్న మృతితో ఆయన వారసురాలైన లాస్య నందితకు బీఆర్ఎస్ టికెట్ దక్కింది. ఈ నేపథ్యంలో శ్రీగణేశ్ మళ్లీ బీజేపీలో చేరి, ఆ పార్టీ నుంచి పోటీకి దిగారు. అనూహ్యం గా 41,888 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన గద్దర్ కుమార్తె వెన్నెల మూడో స్థానంలో నిలిచారు. ఈ ఉప ఎన్నికలో కాం గ్రెస్ టికెట్ కోసం ఇటీవల వెన్నెలతో పాటు అద్దంకి దయాకర్, సర్వే సత్యనారాయణ పోటీపడ్డారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో మైనంపల్లి హన్మంతరావు ద్వారా కాంగ్రెస్‌లో చేరిన ఎస్.శ్రీగణేష్‌నే అదృష్టం వరించింది.

దారులన్నీ 'తుక్కుగూడ' వైపే..

- కాంగ్రెస్ జన జాతర విజయవంతం
- అంచనాలకు మించిన హాజరైన జనం
- కిక్కిరిసిన సభా ప్రాంగణం
- 24 లక్షల వాటర్ బాటిళ్లు, 12 లక్షల మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ
- ఆకట్టుకున్న రాహుల్ ప్రసంగం
- సీఎం రేవంత్ వాగ్దాటితో జనంలో జోష్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)


సభకు హాజరైన జనం

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ శనివారం తుక్కుగూడలో నిర్వహించిన 'జనజాతర' సభ విజయవంతమైంది. రాష్ట్రం నలుమూలల నుంచి కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు లక్షలాదిగా తరలివచ్చారు. దీంతో తుక్కుగూడలో ఎక్కడ చూసినా జనం సందడే కనిపించింది. తుక్కుగూడ రోడ్లన్నీ జనసంద్రాన్ని తలపించాయి. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ వచ్చే సమయానికే సభ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. వేలాదిగా ప్రజలు రోడ్ల మీదే ఉండిపోయారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తుక్కుగూడలో నిర్వహించిన ప్రజాగర్జన సభ నుంచే కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని ప్రారంభించి.. ఆరు గ్యారెంటీలను ప్రకటించి అధికార పగ్గాలు చేపట్టిన విషయం తెలిసిందే. అదే సెంటిమెంటుతో లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి కూడా ఇక్కడ నుంచే శ్రీకారం చుట్టింది. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో విడుదల చేసిన పార్టీ మేనిఫెస్టో తెలుగు ప్రతిని శనివారం తక్కుగూడ సభ నుంచి రాహుల్ గాంధీ విడుదల చేశారు. కాగా, జన జాతర సభకు గతంలో జరిగిన ప్రజాగర్జనకు మించి జనం హాజరయ్యారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో సభ ఆలస్యంగా ప్రారంభమైంది. సాయంత్రం 5 గంటల తరువాత ప్రజలు రావటం మొదలైంది. గంటసేపట్లోనే సభా ప్రాంగణం జనంతో నిండిపోయింది. రాహుల్ గాంధీ రాత్రి ఏడు గంటలకు చేరుకున్నారు.

భారీ ఎత్తున ఏర్పాట్లు

రాష్ట్రంలో కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన తర్వాత, ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన సభ కాబట్టి.. తక్కుగూడ సభకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. రాజధాని హైదరాబాద్‌తోపాటు, చుట్టుపక్కల నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున జనసమీకరణ చేశారు. ఇతర జిల్లాల నుంచి కూడా భారీగానే తరలించారు. రాష్ట్రంలోని 30 వేల పోలింగ్ బూత్‌ల వారీగా జనసమీకరణ జరిపారు. సభకు హాజరైన లక్షలాది మందికి తాగునీటికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. సభ ప్రాంగణంలో 24 లక్షల వాటర్ బాటిళ్లు, 12 లక్షల మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అత్యవసర వైద్య సేవలను కూడా అందుబాటులో ఉంచారు. వేదిక వెనుక భారీ స్క్రీన్‌తోపాటు సభ ప్రాంగణంలో జనాలకు కనిపించే విధంగా నలుమూలల స్క్రీన్లను ఏర్పాటు చేశారు. పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. వేయి మందికి పైగా పోలీస్ సిబ్బందిని నియమించి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కాగా, వేదికపై కళాకారుల పాటలు పలువురిని ఆకట్టుకున్నాయి.

ఆసక్తిగా విన్న ప్రజలు

రాహుల్‌గాంధీ ప్రసంగం ప్రజల్ని ఆకట్టుకుంది. అన్ని వర్గాల ప్రజల కోసం తమ మేనిఫెస్టోలో చేర్చిన అంశాలను రాహుల్ వివరిస్తుంటే జనం ఆసక్తిగా విన్నారు. ఆయన ప్రసంగాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలుగులో అనువదించారు. సభలో చివరిగా ప్రసంగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన వాగ్దాటితో జనంలో జోష్ నింపారు. కాగా, జనజాతర సభలో పాల్గొనేందుకు ఢిల్లీ నుంచి వచ్చిన రాహుల్‌గాంధీకి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి స్వాగతం పలికారు. సాయంత్ర 6 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న రాహుల్ గాంధీకి సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేశారు.

5 గ్యారెంటీలు ఇవే..

మహేశ్వరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా రైతులకు రుణ మాఫీ చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. రుణ మాఫీ ప్రణాళికను సమర్థంగా అమలు చేసేందుకు శాశ్వత కమిషన్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ మేనిఫెస్టో తెలుగు ప్రతిని శనివారం తుక్కుగూడలో జరిగిన జన జాతర సభలో రాహుల్ గాంధీ విడుదల చేశారు. అందులో ఐదు గ్యారంటీలకు హామీ ఇచ్చారు. అవి..

సామాజిక న్యాయం

కుల గణన: ప్రతి వ్యక్తి, వర్గం సామాజిక, ఆర్థిక సమానత్వం కోసం కుల గణన

రిజర్వేషన్ల హక్కు: రాజ్యాంగ సవరణ ద్వారా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి తొలగింపు

ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికకు చట్టబద్ధత: జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు ప్రత్యేక వార్షిక బడ్జెట్

జల్ జంగల్ జమీన్‌కై చట్టపరమైన హక్కు: అటవీ ప్రాంతంలోని గిరిజనులు, ఆదివాసుల హక్కుల చట్టం కింద వచ్చే క్లెయిమ్స్ సంవత్సరంలో పరిష్కారం

మన భూమి, మన పాలన: ఎస్టీ జనాభా అధికంగా ఉన్న ప్రాంతాలకు గిరిజన, ఆదివాసీ ప్రాంతాలుగా గుర్తింపు

రైతు న్యాయం

మద్దతు ధరకు చట్టబద్ధత: స్వామినాథన్ కమిటీ సిఫారసుల ఆధారంగా కనీస మద్దతు ధరకు చట్టబద్ధత

రుణమాఫీ: రైతులకు రుణమాఫీ ప్రణాళికను సమర్థంగా అమలు చేయడానికి శాశ్వత కమిషన్ ఏర్పాటు

బీమా చెల్లింపుల ప్రత్యక్ష బదిలీ: పంట నష్టపోతే 30 రోజుల్లో బీమా సొమ్ము నేరుగా రైతు బ్యాంకు ఖాతాలోకి జమ

సమర్థ ఎగుమతి- దిగుమతి విధానం: రైతులకు లాభసాటిగా సరికొత్త దిగుమతి - ఎగుమతి విధానం

జీఎస్టీరహిత వ్యవసాయం: వ్యవసాయ ఉత్పత్తులపై జీఎస్టీ తొలగింపు

కార్మిక న్యాయం

ఆరోగ్య హక్కు: ఆరోగ్య హక్కు చట్టం ద్వారా ప్రతి కార్మికునికి ఉచిత నిత్యావసర రోగ నిర్ధారణ పరీక్షలు, మందులు, ఆపరేషన్‌తో కూడిన ఆరోగ్య రక్షణ

కార్మికులకు గౌరవం: జాతీయ ఉపాధి హామీ కూలీలతో పాటు కార్మికులందరికీ రూ.400 రోజు కూలీ

పట్టణ ఉపాధి హామీ: పట్టణ ప్రాంత కార్మికులకు ఉపాధి హామీ చట్టం అమలు

సామాజిక భద్రత: అసంఘటిత కార్మికులకు జీవిత, ప్రమాద బీమా వర్తింపు

ఉద్యోగ భద్రత: కీలక ప్రభుత్వ విభాగాల్లో కాంట్రాక్టు ఉద్యోగ వ్యవస్థ రద్దు

యువ న్యాయం

నియామకాల భరోసా: కేంద్ర ప్రభుత్వ పరిధిలోని 30 లక్షల ఉద్యోగ ఖాళీలు జాబ్ క్యాలెండర్ ద్వారా భర్తీ

ఏడాదికి లక్ష అప్రెంటిస్‌షిప్: విద్యావంతులైన యువకులకు నెలకు రూ.8,500 (సంవత్సరానికి రూ.లక్ష) ఉపకార వేతనంతో సంవత్సరం పాటు అప్రెంటిస్‌షిప్ శిక్షణ

ప్రశ్నపత్రాల లీకేజీకి విముక్తి: అన్ని పరీక్షల ప్రశ్న పత్రాల లీకేజీని అరికట్టడం కోసం ప్రత్యేక చట్టం

గిగ్ ఆర్థిక వ్యవస్థలో సామాజిక భద్రత: గిగ్ కార్మికులకు సామాజిక భద్రతతో కూడిన అనువైన పని వాతావరణ కల్పన

యువ కిరణాలు: రూ.500 కోట్ల ప్రత్యేక నిధితో అంకుర సంస్థలు (స్టార్టప్‌లు) స్థాపించే యువతకు ప్రోత్సాహకాలు

మహిళా న్యాయం

మహాలక్ష్మి: ప్రతి పేద కుటుంబంలోని ఒక మహిళకు సంవత్సరానికి రూ.లక్ష సాయం

సగం జనాభాకు సంపూర్ణ హక్కులు: కేంద్ర ప్రభుత్వ కొత్త ఉద్యోగాల్లో 50 శాతం మహిళా రిజర్వేషన్

మహిళా శక్తికి గౌరవం: ఆశ, మధ్యాహ్న భోజన పథకం అమలుచేసే అంగన్‌వాడీ కార్యకర్తలకు అధిక జీతం, కేంద్ర ప్రభుత్వ వాటా రెట్టింపు

మైత్రిలు: మహిళలకు చట్టపరమైన హక్కులు, ప్రభుత్వ పథకాల గురించి తెలియచేసేందుకు ప్రతి గ్రామంలో ఒక మైత్రి అధికారి నియామకం

సావిత్రీబాయ్ పూలే వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లు: ఉద్యోగాలు చేస్తున్న మహిళలకు వసతి గృహాలు రెట్టింపు

డిప్యూటీ సీఎం భట్టి డ్రైవర్‌పై పోలీసుల దాడి

- వాహనాన్ని అడ్డుకొని డ్రైవర్‌పై చేయి చేసుకున్న రాచకొండ సీపీ
- పాస్ ఉందని చెప్పినా వినకుండా ఐడీ కార్డు లాక్కున్న అధికారి
- అరగంట తర్వాత పిలిచి చుట్టూ పోలీసులను పెట్టి మళ్లీ దాడి
- చిత్రీకరిస్తున్న వీడియో గ్రాఫర్‌కూ దెబ్బలు

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తుక్కుగూడ జనజాతర బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యక్తిగత వాహనాన్ని రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి అడ్డుకోవటమేగాక వాహనం డ్రైవర్‌పై చేయి చేసుకున్న ఘటన కలకలం రేపింది. డిప్యూటీ సీఎం వాహనం అని చెప్పినా కూడా పోలీసులు అనుమతించలేదు. వేదిక వద్దకు వెళ్లేందుకు అనుమతించే (డయాస్) పాస్ ఉందని డ్రైవర్ శ్రీనివాస్ చెబుతుండగానే తరుణ్‌జోషి తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతూ అతడిపై చేయి చేసుకున్నారు. డ్రైవర్ జేబులో ఉన్న ఐడీ కార్డును లాక్కున్నారు. ఇది జరిగిన అరగంట తర్వాత మళ్లీ డ్రైవర్ శ్రీనివాస్‌ను పిలిపించి చుట్టూ పోలీసులను నిలబెట్టి అక్కడున్న ఏసీపీ రాజుతో కొట్టించారు. డ్రైవర్ మీద పోలీసుల దాడిని చిత్రీకరిస్తున్న ఓ వీడియోగ్రాఫర్ సెల్‌ఫోన్‌ను గుంజుకుని అతనిపైనా తరుణ్‌జోషి చేయి చేసుకున్నారు. సభ ముగిసిన తర్వాత వేదిక వద్ద ఉన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వద్దకు డ్రైవర్ శ్రీనివాస్ వాహనంలో వెళ్తుండగా ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది.

ఏఐసీసీ నేషనల్ కోఆర్డినేటర్‌గా నందిమండలం వేణు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఏఐసీసీ నేషనల్ కోఆర్డినేటర్(ఓబీసీ)గా, కర్ణాటక ఇన్‌చార్జిగా నందిమండలం వేణు నియమితులు అయ్యారు. ఈ మేరకు శనివారం ఏఐసీసీ ఓబీసీ చైర్మన్ అజయ్‌సింగ్ యాదవ్ ప్రకటించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, సహకరించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీలకు వేణు కృతజ్ఞతలు తెలిపారు.


తుక్కుగూడ సభలో మేనిఫెస్టోను విడుదల చేస్తున్న రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి, భట్టి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల తదితరులు

లక్ష కోట్ల వడ్డీలేని రుణాలిస్తాం

- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడినపడుతోంది: భట్టి
- తాగునీరు, సాగునీటి కొరత రాకుండా చూస్తాం: ఉత్తమ్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)/రంగారెడ్డి అర్బన్/మహేశ్వరం, ఏప్రిల్ 6: ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత అయిదు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని, రాబోయే కాలంలో మహిళలకు రూ. లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు అందచేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగాగా తీర్చిదిద్దుతామన్నారు. తుక్కుగూడలో జరిగిన కాంగ్రెస్ జనజాతర సభలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఆర్థిక, విద్యుత్ సంక్షోభంలో కూరుకుపోయిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఆర్థిక సుడిగుండంలో చిక్కుకున్న రాష్ట్రాన్ని ఇపుడిపుడే గాడిలో పెడుతున్నామన్నారు. ఆర్థిక పరిస్థితులపై శ్వేతపత్రాలను విడుదల చేశామని చెప్పారు. ఉద్యోగులందరికీ మొదటి తేదీకే జీతాలు చెల్లిస్తున్నామని ఆయన తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో తాగు, సాగునీటి కొరత రాకుండా చూసే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. నాలుగు నెలల పాటు ఫామ్‌హౌస్‌లో పడుకున్న మాజీ సీఎం కేసీఆర్ ఇపుడు తమ ప్రభుత్వంపై బురదజల్లేయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఈ దుస్థితికి కేసీఆర్ ప్రభుత్వమే కారణమన్నారు. అధికారంలో ఉన్నప్పుడు గోదావరి, కృష్ణాజలాల విషయంలో అబద్ధాలు చెప్పి లూటీ చేశారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో వర్షాలు సరిగా పడలేదు.. వాటర్ మేనేజ్‌మెంట్ చేయలేదు.. మోసం లూటీ మాత్రం చేశారని ఆరోపించారు. కేసీఆర్ అబద్ధపు ప్రచారాలను కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ రాష్ట్రానికి చేసిందేమీ లేదని, బీజేపీకి ఓట్లు అడిగే అర్హతే లేదని ఆయన అన్నారు.

కేసీఆర్‌ను బహిరంగంగా ఉరితీసినా తప్పులేదు: సురేఖ

కుక్కల కొడుకుల్లారా అని ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్న కేసీఆర్‌ను బహిరంగంగా ఉరితీసిన తప్పులేదని లేదని మంత్రి కొండా సురేఖ అన్నారు. కేసీఆర్ నోరు దగ్గర పెట్టుకోవాలని, లేదంటే లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. బీజేపీ, టీఆర్ఎస్ నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరుతున్నారని, త్వరలో బీఆర్ఎస్ పూర్తిగా ఖాళీ అవుతందని ఆమె అన్నారు.

వికసిత్ భారత్ ఏడుందయ్యా?: సీతక్క

వికసిత్ భారత్ ఏడుందయ్యా?.. విద్వేషపు కుట్రలతో విధ్వంసాలతో భారత్‌ను బందీ చేశారని ప్రధాని మోదీని ఉద్దేశించి మంత్రి సీతక్క ప్రశ్నించారు. బీజేపీ వాళ్లు ఈడీ కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని నిలదీశారు. ఉదోగ్యాలు అడిగితే.. అయోధ్య రాముడిని చూపెడుతున్నారని విమర్శించారు.

కేసీఆర్.. నోరు అదుపులో పెట్టుకో..: పొన్నం

కేసీఆర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. కేంద్రంలో నియంతృత్వ పాలన దేశ అభివృద్ధికి అడ్డంకిగా మారిందన్నారు. రాష్ట్రంలో 17 ఎంపీ సీట్లతో పాటు దేశంలోని కాంగ్రెస్ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని, ఈ దిశగా పార్టీ శ్రేణులు కష్టపడాలని కోరారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి రైతుల పేరిట డ్రామా చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు.

కేసీఆర్ అవినీతికి రుజువు.. కవితే: జూపల్లి

కేసీఆర్ ఇంతకు నీది నోరా.. లేక మునిసిపాలిటా.. నీకు దొంగ బతుకు, లంగ బతుకు ఎందుకు. మంది సంసారాల్లో తొంగి చూడాల్సిన అవసరం ఏమొచ్చిందంటూ మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. మీరు చేసిన అవినీతికి రుజువు మీ బిడ్డ కవిత అని.. మీకు ఏమి రోగం వచ్చిందంటూ మండిపడ్డారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయాల్సిన బాధ్యత మనందరిదన్నారు.

దేశంలో మార్పు కోసం కాంగ్రెస్ రావాలి: శ్రీధర్‌బాబు

దేశంలో మార్పు రావాలంటే కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరముందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల్లో నాలుగింటిని అమలు చేస్తున్నామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తామని పేర్కొన్నారు. కుల గణన అంశానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.



ఇక్కడ కేసీఆర్.. అక్కడ మోదీ!

స్కాములు.. బలవంతపు వసూళ్లు.. ట్యాపింగ్‌లు.. పైసలు ఇచ్చుకోండి.. దందా చేసుకోండి నినాదం

» లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తాం..

» జీవితాంతం మీ వెంటే ఉంటా: రాహుల్

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): "గత ముఖ్యమంత్రి (కేసీఆర్) తెలంగాణలో వేలాది మంది ఫోన్లను ట్యాప్ చేయించారు. నిఘా సంస్థలు, పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేశారు. వేలాది ఫోన్లు ట్యాప్ చేసి, ప్రభుత్వం మారగానే ఆ డేటాను ధ్వంసం చేసి, పరికరాలను నదిలో పడేశారు. రాష్ట్రంలో పలు వర్గాలను బెదిరించి, భయపెట్టి, బలవంతంగా వసూళ్లు చేశారు. కొత్త ప్రభుత్వం ట్యాపింగ్‌పై విచారణ ప్రారంభించడంతో వాస్తవాలన్నీ వెలుగులోకి వచ్చాయి. తెలంగాణలో కేసీఆర్ తరహాలోనే.. కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం కూడా అదే పని చేస్తోంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ను ఎక్స్‌టార్షన్ డైరెక్టరేట్ (బలవంతపు వసూళ్ల డైరెక్టరేట్)గా మార్చేసింది" అని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. రాష్ట్రంలో బీజేపీ బీ-టీమ్ (బీఆర్ఎస్)ను ఓడించామని, రానున్న ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీని ఓడిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఏనాటికైనా మేడిన్ చైనాను మేడిన్ తెలంగాణ వెనక్కి నెట్టాలని ఆకాంక్షించారు. తెలంగాణలో చిన్న పిల్లాడు పిలిచినా తక్షణం వాలిపోతానని భరోసా ఇచ్చారు. తుక్కుగూడలో శనివారం నిర్వహించిన జన జాతర సభకు రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో (గ్యారంటీ కార్డు)ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో అధికారంలోకి వస్తే మహిళలు, యువత, రైతులు తదితర వర్గాలకు అమలు చేయనున్న పథకాలను వివరించారు. కేంద్రంలో మోదీ పాలనను.. రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీరును దునుమాడారు. "ప్రపంచంలోనే అతి పెద్ద వాషింగ్ మెషీన్‌ను బీజేపీ నడుపుతోంది. దేశంలోని అత్యధిక అవినీతిపరులు ఇప్పుడు మోదీ వెంటే ఉన్నారు. ప్రపంచంలో అతి పెద్ద కుంభకోణం ఎలక్టోరల్ బాండ్లు. 'పైసలు ఇచ్చుకోండి.. దందాలు చేసుకోండి' అన్నది దాని నినాదం. వ్యాపారులందరినీ దానిని అడ్డు పెట్టి బెదిరించారు. ఎలక్టోరల్ బాండ్ల జాబితాను చూస్తే.. వాళ్ల వ్యాపారాలన్నీ బయటపడతాయి. సీబీఐ ఓ సంస్థపై దాడులు చేస్తుంది. అదే సంస్థ ఎలక్టోరల్ బాండ్ల రూపంలో కోట్లాది రూపాయలు బీజేపీకి ఇస్తుంది. ఆ తర్వాత సదరు సంస్థకే వేలాది కోట్ల రూపాయల మౌలిక సదుపాయాల కాంట్రాక్ట్ దక్కుతుంది" అని ఆరోపించారు. మీడియా, ధన బలం, నిఘా సంస్థలు, ఇంటెలిజెన్స్, ఈడీ, సీబీఐ మోదీ వెంట ఉన్నాయని, తమ వెంట వాస్తవాలు, ప్రజల ప్రేమ ఉందని, అంతిమంగా విజయం న్యాయానిదే అవుతుందని వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘంలోనూ మోదీ తన మనుషులను పెట్టుకున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ బ్యాంకు అకౌంట్లను మూసివేశారని, అయినా తాము భయపడబోమని స్పష్టం చేశారు. "దేశంలోని ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం రక్షణ ఇస్తుంది. ఆ రాజ్యాంగాన్ని రద్దు చేయాలని బీజేపీ అనుకుంటోంది. మేం దీనిని అడ్డుకుంటాం. మేము చేస్తున్నది రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించే పోరాటం" స్పష్టం చేశారు.



యువతకు ఏడాదిపాటు లక్ష జీతం

అత్యధిక నిరుద్యోగం భారతదేశంలో ఉన్న సమయంలోనే తెలంగాణలో తమ ప్రభుత్వం కొలువుదీరగానే 30 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చిందని, రానున్న కొద్ది రోజుల్లో మరో 50 వేల మందికి ఉద్యోగాలు ఇవ్వనుందని రాహుల్ గాంధీ వెల్లడించారు. "తెలంగాణలో మాట ఇచ్చినట్లే.. జాతీయ స్థాయిలో ఈ మేనిఫెస్టోతో అదే గ్యారంటీ ఇస్తున్నాం. ఈ మేనిఫెస్టో దేశ ప్రజల గొంతుక. లక్షలాదిమంది అభిప్రాయాలు తీసుకుని దీనిని రూపొందించాం. ఐదు గ్యారంటీలతో మేనిఫెస్టో ఉంది. దేశంలో నిరుద్యోగులందరికీ ఏడాదిపాటు లక్ష రూపాయల జీతం వచ్చేలా అప్రెంటిస్ శిక్షణ కోసం అప్రెంటిస్ చట్టాన్ని తేనున్నాం. ఉపాధి హామీ పథకంలో ఉపాధికి గ్యారంటీ ఇచ్చినట్లుగానే ఈ చట్టంతో దేశంలోని ప్రతి యువకుడికి నెలకు రూ.8,500 ఉపకార వేతనంతో ఏడాదిపాటు ప్రభుత్వ, ప్రైవేట్ రంగంతోపాటు వైద్య, విద్య రంగంలో శిక్షణ ఇస్తాం" అని వివరించారు. మహిళలు, యువకులు, రైతులకు సంబంధించి మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రధాన హామీని వివరించిన రాహుల్ గాంధీ.. అన్ని వర్గాలకూ మరో ఐదు హామీలు మేనిఫెస్టోలో ఉన్నాయని, పేదలు, మహిళలు, రైతులు, కూలీల జీవితాల్లో ఇది వెలుగులు నింపుతుందని చెప్పారు. కాంగ్రెస్ హామీలు ఇవ్వడమే కాదు.. అమలు చేసి చూపుతుందంటూ తెలంగాణ సర్కారును ఉదాహరించారు. పార్టీ మేనిఫెస్టోను విప్లవాత్మకంగా రాహుల్ అభివర్ణించారు. దాని అమలుతో దేశ ముఖ చిత్రమే మారిపోతుందని అభిప్రాయపడ్డారు. నారీ న్యాయ్ చట్టాన్ని తీసుకురానున్నామని, దీని కింద ప్రతి పేద కుటుంబంలోని ఒక మహిళకు ఏడాదికి లక్ష రూపాయలను వారి ఖాతాల్లో నేరుగా జమ చేస్తామని రాహుల్ గాంధీ ప్రకటించారు. మత్స్యకారుల కోసం డీజిల్ సబ్సిడీతోపాటు సహకార బ్యాంకును ఏర్పాటు చేస్తామని తెలిపారు.

దేశవ్యాప్తంగా కుల, ఆర్థిక గణన

కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ తరహాలోనే కుల గణన చేపడతామని రాహుల్ ప్రకటించారు. కుల గణన తర్వాత ఆర్థిక గణన చేస్తామని వెల్లడించారు. దేశంలో ఆర్థికపరమైన సర్వే చేసి, దేశ ఆర్థిక వ్యవస్థ ఎవరి చేతుల్లో ఉందో తేలుస్తామన్నారు. చరిత్రాత్మక, విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటామని సంచలన ప్రకటన చేశారు. జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు హక్కులు అందిస్తామని, అన్ని సంస్థల్లో వారి వాటాను వారికి ఇస్తామని స్పష్టం చేశారు. "దేశ జనాభాలో 50 శాతం బీసీలు. 15 శాతం దళితులు. 8 శాతం ఆదివాసీలు. 15 శాతం మైనారిటీలు. 5 శాతం అగ్ర కుల పేదలు ఉన్నారు. వీరంతా కలిసి 90 శాతం. కానీ, దేశంలోని టాప్-200 కంపెనీ యజమానులుగా, మీడియా అధినేతలుగా ఈ వర్గాల్లో ఎవరూ లేరు. కేంద్ర ప్రభుత్వాన్ని 90 మంది ఐఏఎస్ అధికారులు నడుపుతుంటే.. ఈ వర్గాలకు చెందిన వారు ఏడుగురే. బడ్జెట్లో విడుదల చేస్తున్న ప్రతి వంద రూపాయల్లో ఈ వర్గాలకు ఇచ్చేది ఆరు రూపాయలే. దేశ నిర్ణయాధికారంలో వీరి పాత్ర లేదు. అందుకే, వీరి వాటా తేల్చడానికి కుల, ఆర్థిక గణన చేస్తాం" అని రాహుల్ వెల్లడించారు.



తుక్కుగూడ సభలో రాహుల్‌తో కరచాలనం చేస్తున్న జగ్గారెడ్డి

గ్యారంటీలివ్వడమే కాదు... పూర్తి చేసి తీరతాం

"తెలంగాణ ప్రజలందరికీ తెలుసు. కాంగ్రెస్ పార్టీ గ్యారంటీలు ఇవ్వడమే కాదు. పూర్తి చేసి తీరుతుంది. సిలిండర్‌ను రూ.500కు ఇస్తున్నాం. ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నాం. 200 యూనిట్ల దాకా విద్యుత్తును ఉచితంగా ఇస్తున్నాం. గృహలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నాం. వీటన్నిటినీ ఆరోజు (గతంలో తుక్కుగూడ లో) హామీ ఇచ్చాను" అని గుర్తు చేశారు.

రుణ మాఫీ చేస్తాం

కిసాన్ న్యాయ్ కింద రుణమాఫీ చేస్తామని, రైతులు పండించే పంటకు కనీస మద్దతు ధర లభించేలా చట్టబద్ధత కల్పిస్తామని రాహుల్ ప్రకటించారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేస్తామన్నారు. "దేశంలో ప్రతి రోజు 30 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. సంపన్నులకు చెందిన రూ.16 లక్షల కోట్ల రుణాలను ప్రధాని మోదీ మాఫీ చేశారు. రైతులకు ఒక్క రూపాయి కూడా మాఫీ చేయలేదు" అని తప్పుబట్టారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేస్తామని, ఉపాధి హామీతోపాటు రోజు కూలీ రూ.400 దక్కేలా చేస్తామని హామీ ఇచ్చారు.

పిలిస్తే పలుకుతా.. జీవితాంతం మీ వెంటే..

తెలంగాణలో చిన్న పిల్లాడు పిలిచినా తక్షణమే వాలిపోతానని, ఇక్కడి ప్రజలతో తనది రాజకీయాలకు అతీతమైన బంధమని రాహుల్ గాంధీ ప్రకటించారు. "నేనిక్కడ రాజకీయ ప్రసంగం చేశాను. కానీ, మీకు, నాకు మధ్య ఉన్నది రాజకీయాలకు అతీతమైన బంధం. కుటుంబ, ఆత్మీయ బంధం. సోనియా గాంధీ మీకు మద్దతు (రాష్ట్రాన్ని) ఇచ్చారు. ఢిల్లీలో నేను కూడా మీ వెంటే ఉంటా. మీ ప్రతినిధిగా స్పందిస్తా. మీరు పిలిస్తే మీ ముందు హాజరవుతా. జీవితాంతం మీ వెంటే ఉంటా" అని తెలంగాణ ప్రజలకు భరోసా ఇచ్చారు. మీ కలలను సాకారం చేయడానికి కొత్త రాష్ట్రం ఇస్తే.. ఆ కలను కేసీఆర్ ఛిద్రం చేశారని ధ్వజమెత్తారు. దేశానికి మార్గదర్శిలా తెలంగాణ ఉండాలని ఆకాంక్షించారు. 'మేడిన్ చైనా'ను ఏదో ఒక రోజు 'మేడిన్ తెలంగాణ' వెనక్కి నెట్టాలని కోరుకున్నారు. ఉత్పాదక రంగంలో మేడిన్ తెలంగాణ అని నిరూపిస్తే.. యూపీలో కూడా మేడిన్ యూపీ, మేడిన్ రాజస్థాన్ అవుతుందన్నారు. ఇందుకు తాను, మీ ముఖ్యమంత్రి అంతా కలిసి పని చేస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ నేతలు దేశవ్యాప్తంగా విద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నారని, ఒక మతంతో మరో మతానికి కొట్లాట పెడుతున్నారని ఆరోపించారు. తెలంగాణలో లక్షలాది మంది విద్వేష మార్కెట్‌లో ప్రేమ దుకాణాలు తెరిచారని, ఇక్కడి ప్రజలిచ్చే సందేశం దేశమంతా వ్యాప్తి చెందాలని ఆకాంక్షించారు.

చిప్పకూడు తినిపిస్తా

చర్లపల్లి జైల్లోనే డబుల్ బెడ్‌రూం ఇల్లు కట్టిస్తా

ఏది పడితే అది మాట్లాడితే ఊరుకోం

కేసీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరిక

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తుక్కుగూడ జనజాతర సభ వేదికగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు హెచ్చరికలు జారీ చేశారు. తమ ప్రభుత్వంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోబోనని, చర్లపల్లి జైల్లో చిప్పకూడు తినిపిస్తానని అన్నారు. అధికారంపోయింది, కాలు విరిగింది.. కూతురు జైలుకు వెళ్లిందని మానవత్వంతో ఇన్నాళ్లు మర్యాద పూర్వకంగా వ్యవహరించామని తెలిపారు. "మమ్మల్ని ఏది పడితే అది మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదు. నేను పెద్దలు జానారెడ్డిలా కాదు. నేను రేవంత్‌రెడ్డిని బిడ్డా! నువ్వు మాట్లాడే లత్కోరు, లఫంగి మాటలకు.. అంగీ, లాగు ఊడదీసి చర్లపల్లి జైల్లో చిప్పకూడు తినిపిస్తా బిడ్డా! కొడుకు, బిడ్డతో కలిసి ఉండేందుకు చర్లపల్లి జైల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కట్టిస్తా" అంటూ రేవంత్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పదేళ్ల రాష్ట్రాన్ని దోపిడీ దొంగల్లా, అడవి పందుల్లా పట్టి పీడించారని, పదేళ్లలో వందేళ్ల విధ్వంసం చేశారని ఆరోపించారు. తాము వెంట్రుక కూడా పీకలేమని కేసీఆర్ మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ కార్యకర్తలు తలచుకుంటే ఆయన ము.. మీద డ్రాయర్ కూడా ఉండదని అన్నారు. ఉమ్మడి పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించిందని, గడిచిన పదేళ్లలో కేసీఆర్ ఎన్ని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టించారో చెప్పాలని నిలదీశారు. ఇందిరమ్మ ఇళ్లు ఉన్న ఊళ్లలో తాము ఓట్లు అడుగుతామని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఉన్న ఊళ్లలో కేసీఆర్ ఓట్లు అడగాలని సవాల్ విసిరారు.



మా పాలన నచ్చితే 14 సీట్లు ఇవ్వండి..

తాను, తన మంత్రివర్గం వంద రోజుల పాలనను ప్రజల ముందు పెట్టామని, ఈ వంద రోజుల్లో తాము మంచి పాలన అందించామని భావిస్తే 14 సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని రేవంత్‌రెడ్డి కోరారు. ఒకవేళ తమ పాలన సరిగా లేదని భావిస్తే.. తమకు ఓటేయాలో వద్దో ఆలోచన చేసుకోవాలన్నారు. తాము నిజాయితీగా, కడుపు కట్టుకుని రోజుకు 18 గంటలు కష్టపడి ఆరు గ్యారెంటీలను అమలు చేశామని తెలిపారు. భవిష్యత్తులో మంచి పాలన అందించేందుకు ఢిల్లీ నుంచి నిధులు, అనుమతులు తెచ్చుకోవాల్సి ఉందని, అందుకోసం 14 సీట్లు ఇవ్వాలని కోరారు. తెలంగాణ రాష్ట్రాన్నిచ్చిన సోనియాగాంధీ బిడ్డ రాహుల్‌గాంధీని ప్రధానిని చేసుకోవడానికి 14 సీట్లు ఇవ్వాలన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు, మణిపూర్ నుంచి ముంబయికి వేల కిలోమీటర్ల పాదయాత్ర చేసిన రాహుల్‌గాంధీ ప్రధాని కావాలా? లేక హెలికాప్టర్‌లో తిరుగుతూ, విదేశీ పర్యటనలు చేస్తూ, గంట గంటకూ డ్రెస్సులు మార్చుకుంటూ.. చెప్పిన అబద్ధం చెప్పకుండా జనాన్ని వంచిస్తున్న మోదీ ప్రధాని కావాలా? అని ప్రశ్నించారు. దీనిపై యువత ఆలోచన చేయాలన్నారు. ఏ తుక్కుగూడ గడ్డపైనైతే సోనియా గాంధీ తెలంగాణకు ఆరు గ్యారెంటీలు ఇచ్చి మూడు రంగుల జెండాను రెపరెపలాడించారో.. అదే గడ్డపై నుంచి రాహుల్‌గాంధీ ఐదు గ్యారెంటీలను జాతికి అంకితం చేశారని రేవంత్ పేర్కొన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలంటే కార్యకర్తల పునాదులు బలంగా ఉండాలని, రాష్ట్రం నలుమూలలా లక్షలాది మంది కార్యకర్తలు సైనికులై కొట్లాడినప్పుడే పార్టీ నిలబడుతుందని అన్నారు. కార్యకర్తల శ్రమ, త్యాగంతోనే తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిందన్నారు. గుజరాత్ మోడల్‌పై వైబ్రెంట్ తెలగాణ ఆధిపత్యం చూపించి దేశాన్ని అభివృద్ధి పథం వైపునకు నడిపిస్తుందని చెప్పారు.

బీజేపీకి ఎందుకు అవకాశమివ్వాలి?

బీజేపీకి మరోసారి అవకాశం ఎందుకివ్వాలో ఆ పార్టీ రాష్ట్ర నేతలు చెప్పాలని రేవంత్ అన్నారు. "ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పి.. పదేళ్లలో 7.21 లక్షల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చినందుకు మోదీకి ఓటేయాలా? రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పి వారిని చంపినందుకు ఓటు వేయాలా?" అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రానికి మోదీ ఎన్ని ఇళ్లు ఇచ్చారో లెక్క చెప్పి ఓట్లు అడగాలన్నారు. ఇప్పటిదాకా మతాలు, ప్రాంతాలు, పార్టీల మధ్య చిచ్చు పెట్టి విభజించడం ద్వారా అధికారాన్ని నిలబెట్టుకున్న మోదీ.. ఇప్పుడు ఉత్తర, దక్షిణ భారత దేశాల మధ్య చిచ్చు పెట్టి మూడోసారి అధికారంలోకి రావాలనే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. నమో అంటే అర్థం.. నమ్మితే మోసం చేయడమని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీని బొంద పెట్టినట్లుగానే.. విభజన హామీలు అమలు చేయని, ఏడు మండలాలను ఏపీకి తాకట్టు పెట్టిన బీజేపీనీ బొంద పెట్టే వరకూ నిద్ర పోవద్దని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మోదీ పరివార్‌కు, గాంధీ పరివార్‌కు మధ్య పోరాటం జరుగుతుందని రేవంత్ చెప్పారు. మోదీ పరివార్‌లో ఈవీఎంలు, ఈడీ, సీబీఐ వగైరా ఉంటే.. గాంధీ పరివార్‌లో ఇందిర, రాజీవ్, సోనియా, రాహుల్, ప్రియాంక ఉన్నారని అన్నారు.

సభ ఏర్పాట్లు బాగున్నాయి

రేవంత్‌కు రాహుల్ అభినందన

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి/శంషాబాద్)

కాంగ్రెస్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన జనజాతర సభకు భారీగా జనం హాజరు కావడంతో పార్టీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. తుక్కుగూడలో నిర్వహించిన ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ సైతం సభ ఏర్పాట్లను చూసి అబ్బురపడ్డారు. వేదిక వద్ద ఏర్పాటు చేసిన ర్యాంప్‌పైకి వచ్చి జనాలకు అభివాదం చేశారు. అనంతరం వేదికపై ఆసీనులు కాగానే సభ ఏర్పాట్లు బాగున్నాయంటూ సీఎం రేవంత్‌రెడ్డిని అభినందించారు. జనసమీకరణ కూడా బాగా చేశారంటూ కితాబునిచ్చారు. కాగా, సభ ముగిసిన అనంతరం రాత్రి 8.28 గంటలకు రాహుల్‌గాంధీ వెంట సీఎం రేవంత్‌రెడ్డి శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చి వీడ్కోలు పలికారు. అక్కడి నుంచి నోవాటెల్ హోటల్‌కు చేరుకొని కొద్దిసేపటి తరువాత నగరానికి బయలుదేరి వెళ్లారు.



ఎంపీ అభ్యర్థులు, కంటోన్మెంట్ అసెంబ్లీ అభ్యర్థితో రాహుల్ గాంధీ, సీఎం రేవంత్

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే

» తుక్కుగూడ సభకు హాజరైన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్‌రావు

» రాహుల్ సమక్షంలో పార్టీలో చేరిక

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్. భద్రాచలం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ పార్టీ ఎమ్మెల్యే తెల్లం వెంకట్‌రావు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. తుక్కుగూడ జనజాతర సభకు హాజరైన వెంకట్‌రావు రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ఇప్పటికే ఖైరతాబాద్, స్టేషన్ ఘన్‌పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరితో సహా ఆ పార్టీకి చెందిన పలువురు ఎంపీలు కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే.

అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీకి న్యాక్ 'ఏ' గ్రేడ్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి న్యాక్ 'ఏ' గ్రేడ్ దక్కినట్లు రిజిస్ట్రార్ ఏవీఎన్ రెడ్డి తెలిపారు. గత ఏడాది జూలైలో న్యాక్ బృందం వర్సిటీలో పర్యటించి అన్ని విభాగాలను పర్యవేక్షించి 2.96 పాయింట్లతో 'బీ++' గ్రేడ్ ఇవ్వగా, తమకు రావాల్సిన స్థాయిలో పాయింట్లు రాలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తూ మరోసారి దరఖాస్తు చేసినట్లు వెల్లడించారు. దీంతో న్యాక్ కమిటీ బృందం మార్చి 21 నుంచి 23 వరకు మళ్లీ అసెస్‌మెంట్ చేసిందన్నారు. ఆ బృందం ఇచ్చిన నివేదిక మేరకు న్యాక్ పాలకవర్గం శనివారం బెంగళూరులో సమావేశమై వర్సిటీకి 4 పాయింట్ల ఫార్ములాలో 3.12 స్కోర్‌తో 'ఏ' గ్రేడ్‌ను కేటాయించిందని ఓ ప్రకటనలో వివరించారు. వర్సిటీకి 'ఏ' గ్రేడ్ రావడానికి అహర్నిశలు కష్టపడ్డ ఉద్యోగులకు వీసీ సీతారామారావు అభినందనలు తెలిపారు.

జేవీ బిల్డర్స్ చైర్మన్, ఎండీని అరెస్టు చేయాలి

» సంస్థ బాధితుల పోరాట కమిటీ డిమాండ్

పంజాగుట్ట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తమ సంస్థలో పెట్టుబడులు పెడితే అధిక వడ్డీ ఇవ్వడమేకాకుండా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని నమ్మించి కోట్లాది రూపాయలు వసూలు చేసి బోర్డు తిప్పేసిన జేవీ బిల్డర్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆ సంస్థ బాధితుల పోరాట కమిటీ డిమాండ్ చేసింది. సంస్థ ఎండీ వేలూరి లక్ష్మీనారాయణ, చైర్మన్ వేలూరి జ్యోతిని అరెస్టు చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతంకాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బాధితుల పోరాట కమిటీ సభ్యులు కార్తీక్, రమేష్, హరిప్రియ, నాగరాజు, లాలూ ప్రసాద్ మాట్లాడారు. లక్ష్మీనారాయణ, జ్యోతి దంపతులు మూడున్నరేళ్ల క్రితం జేవీ బిల్డర్స్ సంస్థను తెరిచారన్నారు. ఏజెంట్ల ద్వారా కోట్లాది రూపాయలు వసూలు చేశారని చెప్పారు. గత నెల 16న కార్యాలయాన్ని మూసేసి వెళ్లిపోయారని, ఈ విషయమై ఉప్పల్ పోలీసులకు, సీసీఎస్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. ఈ మోసం వెనుక గత ప్రభుత్వంలోని మాజీ మంత్రి కుమారుడి హస్తం ఉందని ఆరోపించారు.

శంషాబాద్‌లో మహిళ దారుణ హత్య

» అప్పు తీర్చమన్నందుకు హత్య చేసిన నిందితుడు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): తీసుకున్న అప్పు తిరిగి తీర్చమన్నందుకు మహిళను దారుణంగా హత్య చేశాడు ఓ కసాయి. ఇంట్లో అద్దెకుండి.. ఓనర్ వద్ద అప్పు చేసి, తిరిగివ్వమని అడిగితే హతమార్చాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శంషాబాద్ మండలం పాల్మాకులకు చెందిన గూడెపు యాదమ్మ(40) గత నెల 27న రాళ్లగూడలో ఉంటున్న బంధువుల ఇంటికి వెళ్లి, అదే రోజు తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నానని చెప్పి ఇంటికి చేరుకోలేదు. దాంతో 28న కుటుంబసభ్యులు ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు... సంఘీగూడ గ్రామానికి చెందిన శంకరయ్య ఆమెను హత్య చేసినట్లుగా గుర్తించారు. నిందితుడికి యాదమ్మ అప్పు ఇవ్వగా, ఆ డబ్బులు అడిగినందుకే హత్య చేసినట్లు తెలుస్తోంది. నిందితుడు తన పొలంలోనే మృతదేహాన్ని పూడ్చినట్లు గుర్తించిన పోలీసులు తహసీల్దార్ నాగమణి ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఎప్‌సెట్‌కు 3,42,958 దరఖాస్తులు!

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్‌కు 3,42,958 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 2,46,862 మంది ఇంజనీరింగ్‌కు, 95,783 మంది అగ్రికల్చర్, ఫార్మసీ, 313 మంది రెండు పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నట్లు ఎప్‌సెట్ అధికారులు ప్రకటించారు. ఎటువంటి ఆలస్య రుసుం లేకుండా శనివారంతో దరఖాస్తు గడువు ముగిసింది. గతేడాది (ఎంసెట్‌కు) మొత్తం 3,20,683 మంది దరఖాస్తు చేసుకున్నారు. అంటే ఈసారి 22,275 దరఖాస్తులు ఎక్కువ వచ్చాయి. ఇక ఈసారి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 61,877 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

8 మైనింగ్ కంపెనీలకు భారీ జరిమానా

» పీసీబీ టాస్క్‌ఫోర్స్ భేటీలో బోర్డు సభ్యుల నిర్ణయం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): అక్రమ మైనింగ్‌పై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) ఉక్కుపాదం మోపింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యావరణ అనుమతులు లేకుండా మైనింగ్ చేస్తున్న 8 కంపెనీలకు భారీ స్థాయిలో జరిమానా విధించింది. ఆయా కంపెనీలకు నాన్-కంప్లయెన్స్ ఆధారంగా రూ.48 లక్షల నుంచి రూ.1.40 కోట్ల వరకు పరిహారం చెల్లించాలని ఆదేశాలు జారీచేసింది. శనివారం పీసీబీ కార్యాలయంలో సమావేశమైన బోర్డు సభ్యులు... వివిధ సంస్థల సీఎఫ్ఈ, సీఎఫ్ఓ దరఖాస్తులను పరిశీలించారు. నిబంధనలను పాటించని పలు కంపెనీల దరఖాస్తులను తిరస్కరించారు. మరోవైపు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వాసవి గ్రూప్ చేపట్టిన మూడు కొత్త ప్రాజెక్టుల్లో రెండింటికి పీసీబీ పర్యావరణ అనుమతులను నిరాకరించింది. అంతేగాకుండా, కొండాపూర్‌లో వెబ్‌వర్క్స్ డేటా సెంటర్ నిర్మాణ పనులను తక్షణం నిలిపివేస్తూ బోర్డు ఉత్తర్వులిచ్చింది. నిర్మాణ పనులకు సంబంధించి అనుమతి తీసుకోకపోవడంతో పాటు స్థానికుల ఫిర్యాదు మేరకు సదరు డేటా సెంటర్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని పీసీబీ ఆదేశించింది.

సెగలు కక్కుతున్న సూరీడు

» నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో మండిన ఎండలు

» పలు చోట్ల 44.5 డిగ్రీలకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు

» నేడు, రేపు పలు జిల్లాలకు వర్ష సూచన

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

సూర్యుని ప్రతాపంతో ఎండల తీవ్రత రోజురోజుకు అధికమవుతోంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండడంతో రాష్ట్రం అగ్నిగుండాన్ని తలపిస్తోంది. ఎండ, ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో శనివారం 40 డిగ్రీలకు పైడి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో ఎండలు మండిపోయాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 119 ప్రాంతాల్లో 40 నుంచి 44.5 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గరిమెళ్లపాడు, సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్, నల్గొండ జిల్లా నాంపల్లిలో శనివారం 44.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. భద్రాద్రి జిల్లా అశ్వాపురం, మల్కారం, ములుగు జిల్లా మేడారం, ఆసిఫాబాద్ జిల్లా ఎల్కేపల్లి, మంచిర్యాల జిల్లా హాజీపూర్, మహబూబాబాద్ జిల్లా మరిపెడలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం పమ్మిలో 44.3 డిగ్రీలు, భద్రాద్రి జిల్లా యాదగిరి గుట్టలో 43.8, రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలో 43.5, జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం కొల్వాయిలో 43.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం వడగాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఇక రాత్రివేళల్లో కూడా సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని తెలిపింది. అలాగే, ఆది, సోమవారాల్లో పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉరుములు, మెరుపులతో పాటు, గంటకు 40-50 కిమీల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.

కేసీఆర్‌ను బద్నాం చేయాలె
బీఆర్‌ఎస్‌ను ఖతం చేయాలె

రాష్ట్రంలో కాంగ్రెస్ రాజకీయ విధానం ఇదీ.. కేసీఆర్‌పై కోపంతో పంటలకు నీళ్లివ్వలేదు

» సీఎం గుంపు మేస్త్రీ.. ప్రధాని తాపీ మేస్త్రీ

» తెలంగాణ గొంతు నొక్కడమే వారి లక్ష్యం

» నేతన్నల సమస్యలపైనా దీక్షలు: కేటీఆర్

» రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్‌ఎస్ రైతు దీక్షలు



సిరిసిల్లలో రైతు దీక్షలో నినాదాలు చేస్తున్న కేటీఆర్

సిరిసిల్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): "కేసీఆర్‌ను బద్నాం చేయాలె. బీఆర్‌ఎస్‌ను ఖతం చేయాలె. రాష్ట్రంలో కాంగ్రెస్ రాజకీయం విధానం ఇదీ. బూతులు మాట్లాడడం, నోరు పారేసుకోవడం తప్ప ఈ ముఖ్యమంత్రికి పంటలు నీళ్లిచ్చే మొహం లేదు. పైసలిచ్చే దమ్ము గానీ.. రైతు బంధు ఇచ్చే తెలివి గానీ లేదు. సీఎం గుంపు మేస్త్రీ అయితే.. ప్రధాని మోదీ తాపీ మేస్త్రీ లెక్క. ఇద్దరూ కలిసి తెలంగాణ గొంతును బంద్ చేయాలి.. సమాధి కట్టాలి.. అని చూస్తున్నారు" అని బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా రైతు దీక్షలు నిర్వహించారు. సిరిసిల్లతోపాటు వేములవాడలో నిర్వహించిన రైతు దీక్షల్లో కేటీఆర్ మాట్లాడుతూ ఏడు పదుల వయస్సులో ఆరోగ్యం బాగా లేకపోయినా పలు జిల్లాలకు కేసీఆర్ స్వయంగా వెళ్లి రైతులతో మాట్లాడి భరోసా ఇచ్చారని, అదే బాటలో అన్ని నియోజకవర్గాల్లోని అన్నదాతలకు గులాబీదండు అండగా ఉందని చాటి చెప్పేందుకే రైతు దీక్షలు చేపట్టినట్లు తెలిపారు. రుణమాఫీతోపాటు ధాన్యానికి రూ.500 బోనస్ వస్తుందన్న ఆశతో రైతులు కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించారని అన్నారు. పాలు ఇచ్చే బర్రెను పంపించి, పొడిచే దున్నపోతును తెచ్చుకున్నామంటూ.. ఇప్పుడు తేలు కుట్టిన దొంగ లెక్క చెప్పలేక బాధ పడుతున్నారని తెలిపారు. ఎన్నికల కోడ్ రాకముందే జీవో తీసుకురావాలని తాము అడిగినా కాంగ్రెస్ నేతలు తప్పించుకునే ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామంటే.. తాము అడ్డుకోబోమని స్పష్టం చేశారు.

ఇది కాలం తెచ్చిన కరువు కాదు

తాము అధికారంలో ఉన్నప్పుడు ఎండాకాలంలోనూ మేడిగడ్డ నుంచి సుందిళ్ల, ఎల్లంపల్లికి నీటిని ఎత్తిపోశామని కేటీఆర్ గుర్తు చేశారు. నాలుగు నెలల్లోనే పరిస్థితి తారుమారైందని, ప్రస్తుతం పంటలు ఎండే పరిస్థితి చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరువని కేటీఆర్ అన్నారు. "కాంగ్రెసోళ్లు కేసీఆర్‌ను బద్నాం చేయాలని చూస్తున్నారు. ఆయనపై కోపంతో పంటలకు నీళ్లివ్వట్లేదు. పంటలు ఎండితే కొనాల్సిన అవసరం ఉండదు..బోనస్ అసలే ఉండదు.. అందుకే కక్ష గట్టి కాళేశ్వరం కొట్టుకుపోయిందని దిక్కుమాలిన ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెసోళ్లు ఒర్రితే యూట్యూబ్‌లో చిల్లరగాళ్లు కూడా ఒర్రుతున్నారు. వాళ్ల మాటలు నమ్మవద్దు" అని సూచించారు. 2లక్షల రుణమాఫీ, రూ.15 వేల రైతు భరోసా, రూ.500 బోనస్, 24 గంటల కరెంట్ అందుకున్న రైతులు కాంగ్రెస్‌కే ఓటేయాలని, మిగిలిన వాళ్లు కచ్చితంగా బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని కేటీఆర్ సూచించారు. ఎంపీ ఎన్నికల్లోనైనా మేల్కోకపోతే, మర్లపడకపోతే రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్లకు సంబంధించిన కాగితాలు ఇస్తూ 30 వేల ఉద్యోగాలు ఇచ్చానని చెప్పుకోవడానికి సిగ్గు లేదా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా రూ.2 లక్షల రుణమాఫీ, పంటలకు రూ.500 బోనస్, మహాలక్ష్మి కింద రూ.2500 ఆడబిడ్డలకు ఇవ్వాలని సూచించారు. రుణమాఫీపై బీజేపీ నేత ఈటల మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని మండిపడ్డారు. సిరిసిల్లలో నేతన్నల ఆత్మహత్యలు మళ్లీ జరుగుతున్నాయని, వారి సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే దీక్షలు చేపడుతామన్నారు.

ఫిరాయింపులను ప్రోత్సహించిందే కాంగ్రెస్

పార్టీ ఫిరాయింపులను మొదటి నుంచీ కాంగ్రెస్ పార్టీయే ప్రోత్సహించిందని కేటీఆర్ అన్నారు. ఆ పార్టీ నేతలు చెప్పేదొకటి.. చేసేదొకటి అని విమర్శించారు. రాజీనామా చేయకుండా పార్టీ మారిన ప్రజాప్రతినిధులపై అనర్హత వేటేయాలని, ఇదే అంశంపై తన మేనిఫెస్టోలో పేర్కొన్న కాంగ్రెస్ ఇద్దరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను ఎలా చేర్చుకుందని 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. కాగా, మల్కాజ్‌గిరి, చేవెళ్ల పార్లమెంటు స్థానాలకు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా 14 మంది ఎన్నికల సమన్వయకర్తల్ని బీఆర్‌ఎస్ నియమించింది.



బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలెవరూ కాంగ్రెస్‌లో చేరరు

» రాహుల్ వ్యాఖ్యలకు భిన్నంగా ఉత్తమ్ తీరు

» కాంగ్రెస్‌కు చీపుర్లతో బుద్ధి చెప్పాలి: హరీశ్

సంగారెడ్డి/సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్‌కు చెందిన 25 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరతారని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారని, తమ ఎమ్మెల్యేలు ఎవరూ ఆ పార్టీలో చేరబోరని ఎమ్మెల్యే హరీశ్‌రావు చెప్పారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకోబోమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అంటుంటే.. అందుకు విరుద్ధంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడటం విచిత్రంగా ఉందని విమర్శించారు. సంగారెడ్డిలో శనివారం నిర్వహించిన రైతు దీక్ష, జహీరాబాద్, సిద్దిపేటలలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తమ పార్టీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకొని బీఆర్‌ఎస్‌ను బలహీనపర్చాలని కాంగ్రెస్ నేతలు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. అయితే తమ పార్టీ ఎమ్మెల్యేలు ఎవరూ కాంగ్రెస్‌లో చేరబోరని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్న కాంగ్రెస్ మాట తప్పిందని మండిపడ్డారు. అమలు కాని హామీలపై బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో బహిరంగ చర్చ పెట్టాలని సూచించారు. పార్లమెంటు ఎన్నికల్లో దోఖాబాజ్ కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని, ప్రశ్నించే గొంతును ఆదరించి, ఆశీర్వదించాలన్నారు. ఓట్ల కోసం గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ వారికి చీపుర్లతో గుణపాఠం చెప్పాలని ఓటర్లను కోరారు. కాంగ్రెస్ మొద్దు ప్రభుత్వాన్ని నిద్ర లేపడానికే తాము రైతు దీక్ష నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

మళ్లీ టీఆర్‌ఎస్!

» బీఆర్‌ఎస్ పేరు మార్పునకు కేసీఆర్ నిర్ణయం

» 27న పార్టీ ఆవిర్భావ సదస్సులో ప్రకటన?

» న్యాయపరమైన అంశాలపై కసరత్తు

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్‌ను మళ్లీ టీఆర్‌ఎస్‌గా మార్చాలన్న నిర్ణయానికి ఆ పార్టీ అధినేత కేసీఆర్ వచ్చినట్లు సమాచారం. ఈ నెల 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దీనికి సంబంధించి కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. లోక్‌సభ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ పేరుతో పోటీ చేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. కాగా పార్టీ పేరు మార్పుపై న్యాయపరమైన చిక్కులు ఏమైనా ఎదురవుతాయా అన్న దానిపైనా బీఆర్‌ఎస్ అధిష్ఠానం దృష్టి సారించిందని చెబుతున్నారు. మరోవైపు, నిజంగానే పార్టీ పేరు మార్చుతారా అన్నదానిపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తమ పార్టీ అధినేత కేసీఆర్ ఏదైనా చేయాలనుకుంటే ముందుగా ఓ లీకు వదులుతారని, దానిపై జరిగే చర్చను పరిశీలించి ఆ తర్వాతే నిర్ణయం తీసుకుంటారని పార్టీలోని ఓ కీలక నేత వ్యాఖ్యానించారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల నుంచి బయటపడేందుకు కూడా బీఆర్‌ఎస్ పేరు మార్పు అస్త్రాన్ని ప్రయోగించారన్న వాదనలున్నాయి. అయితే క్షేత్రస్థాయిలోని కార్యకర్తలు, నేతలు మాత్రం బీఆర్‌ఎస్‌ను టీఆర్‌ఎస్‌గా మార్చాలని పట్టుబడుతున్నారు. కాగా, హైదరాబాద్‌లోని బీఆర్‌ఎస్ ప్రధాన కార్యాలయంలో వాస్తుపరమైన మార్పులు కూడా చేస్తున్న విషయం తెలిసిందే.

రాహుల్ ప్రసంగమంతా అబద్ధాలే

ఆరు గ్యారెంటీలపై చర్చకు సిద్ధమా?.. రాష్ట్రంలో ఏం చేశారని.. దేశాన్ని ఉద్ధరిస్తారు

» రేవంత్ ముఖ్యమంత్రి అయింది.. ఈవీఎంలతో కాదా..?: కిషన్‌రెడ్డి

» ట్యాపింగ్‌పై సీబీఐ దర్యాప్తు జరపాలి

» గవర్నర్‌కు బీజేపీ నేతల వినతి పత్రం

» కేసీఆర్‌ది మొసలి కన్నీరు: సంజయ్



గవర్నర్‌కు వినతి పత్రం సమర్పించి బయటకు వస్తున్న బీజేపీ నేతలు

హైదరాబాద్/కరీంనగర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తుక్కుగూడ సభలో చేసిన ప్రసంగం అబద్ధాల పుట్ట, పచ్చి బూటకమని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. ధైర్యముంటే అసెంబ్లీ ఎన్నికల ముందు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలపై చర్చకు రావాలని సవాల్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా.. వాటిని గారడీలుగా మార్చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కారు ఏం చేసిందో తెలియని పరిస్థితిలో రాహుల్ ఉన్నారని విమర్శించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో రైతు రుణమాఫీ చేయకుండా దేశాన్ని ఏదో ఉద్ధరిస్తానని రాహుల్ అంటున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రూ.4వేల నిరుద్యోగ భృతికి దిక్కులేదని.. ఇక దేశంలోని నిరుద్యోగులకు సాయం గురించి రాహుల్ మాట్లాడుతున్నారని విమర్శించారు. వారు అధికారంలో ఉన్నప్పుడు మహిళలకు 33శాతం రిజర్వేషన్ ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. రేవంత్ సీఎం అయింది ఈవీఎంలతో కాదా..? అని నిలదీశారు. 'గెలిస్తే మీ నాయకత్వం గొప్పదనం.. ఓడితే ఈవీఎంలదా..?' అని ప్రశ్నించారు. కాగా, పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. హామీల అమలుపై రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదని.. ఆయన దృష్టి అంతా పార్టీ ఫిరాయింపులపైనే ఉందని విమర్శించారు.

ట్యాపింగ్‌ను వదిలిపెట్టం: లక్ష్మణ్

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీ లక్ష్మణ్ నేతృత్వంలోని బీజేపీ ప్రతినిధుల బృందం శనివారం రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్‌ను కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక కోరాలని వినతిపత్రం అందజేసింది. గవర్నర్‌తో సమావేశం అనంతరం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసుపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ దర్యాప్తు కోరాలని డిమాండ్ చేశారు. ట్యాపింగ్ వ్యవహారాన్ని బీఆర్‌ఎస్‌తో లాలూచీ పడి కాంగ్రెస్ ప్రభుత్వం తేలికగా తీసుకున్నా.. తాము వదలిపెట్టబోమని తేల్చిచెప్పారు. ట్యాపింగ్ బాధితుల్లో బీజేపీ నాయకులు కూడా ఉన్నందున కేంద్రం జోక్యాన్ని కోరతామన్నారు.

నా ఫోన్ కూడా ట్యాప్ అయింది: సంజయ్

కాళేశ్వరం అవినీతి, ఫోన్ ట్యాపింగ్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఎంపీ బండి సంజయ్ ప్రశ్నించారు. గత ప్రభుత్వం తన ఫోన్‌నూ ట్యాప్ చేసిందని, బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో మాట్లాడుకున్నవి తెలుసుకున్నారని వెల్లడించారు. కరీంనగర్‌లో సంజయ్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలకే దిక్కులేదని, మళ్లీ పాంచ్ న్యాయ్ పేరుతో కాంగ్రెస్ హామీలిస్తోందని విమర్శించారు. రైతులపై కేసీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. నేతన్నలను ఆదుకోవాలన్న డిమాండ్‌తో సిరిసిల్లలో 10న దీక్ష చేపడతామన్నారు.

జైలులో విచారణకు అనుమతిని నిలిపివేయండి

» ప్రత్యేక కోర్టులో కవిత రీకాల్ పిటిషన్

» నిరాకరించిన న్యాయస్థానం

» తిహాడ్‌లో ఆమెను ప్రశ్నించిన సీబీఐ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి ప్రస్తుతం తిహాడ్ జైలులో ఉన్న బీఆర్‌ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవితకు శనివారం ప్రత్యేక కోర్టులో ఎలాంటి ఉపశమనం లభించలేదు. తనను తిహాడ్ జైలులోనే విచారించేందుకు సీబీఐకి అనుమతి ఇస్తూ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను రౌస్ అవెన్యూలోని ప్రత్యేక కోర్టు తిరస్కరించింది. మరోవైపు సీబీఐ అధికారులు తిహాడ్ జైలుకు వెళ్లి ఆమె స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. జైలులో ఉన్న ఆమె తరఫున సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి, నితీష్ రాణాలు ఈ పిటిషన్ దాఖలు చేశారు. విక్రమ్ చౌదరి వర్చువల్‌గా, నితీష్ రాణా ప్రత్యక్షంగా వాదనలు వినిపించారు. జైలులో విచారణకు అనుమతి కోరే సమయంలో సీబీఐ చట్టబద్ధ ప్రక్రియను పాటించలేదని తెలిపారు. కవితకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా శుక్రవారం కోర్టులో సీబీఐ పిటిషన్ వేసిందని చెప్పారు. "జ్యుడీషియల్ కస్టడీలోనే విచారణ జరపాలంటూ శుక్రవారం నాడు ఇచ్చిన ఉత్తర్వులను తాత్కాలికంగా పక్కన పెట్టండి. ఆమె వాదన వినే వరకు అమలు చేయవద్దు" అని ఆమె తరఫు న్యాయవాది రాణా కోరారు. పిటిషన్ కాపీ కూడా తమకు ఇవ్వలేదని విక్రమ్ చౌదరి చెప్పారు. ఇదంతా కవిత పరోక్షంలో జరిగిందని, అందువల్ల నిబంధనలకు వ్యతిరేకమని తెలిపారు. వాదనలు విన్న ప్రత్యేక జడ్జి కావేరి బవేజా కవితకు ఉపశమనం కలిగిస్తూ ఎలాంటి తాత్కాలిక ఉత్తర్వులు ఇవ్వలేదు. సీబీఐ వాదనలు వినకుండా స్టేటస్‌కో ఉత్తర్వులు ఇవ్వలేమని తెలిపారు. కవిత పిటిషన్‌పై సమాధానం ఇవ్వాలని సీబీఐని ఆదేశిస్తూ తదుపరి విచారణను 10వ తేదీకి వాయిదా వేశారు. అనంతరం న్యాయవాది రాణా ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ శుక్రవారం ఇచ్చిన ఉత్తర్వులను 'రీకాల్' చేయడానికి కోర్టు అంగీకరించలేదని చెప్పారు. కోర్టులో విచారణ సాగుతుండగానే మరోవైపు తిహాడ్ జైలులో ఉన్న కవితను సీబీఐ అధికారులు సుమారు నాలుగైదు గంటలపాటు విచారించినట్టు తెలిసింది. గతంలో సేకరించిన వివరాలు, కొత్తగా మేక శరణ్ పాత్ర తదితర అంశాలపై ప్రశ్నించినట్టు సమాచారం. కవిత వాంగ్మూలాన్ని సీబీఐ రికార్డు చేసినట్టు తెలిసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ధనుశ్ వల్లే కలిశాం

ప్రేమించి పెళ్లి చేసుకున్న సెలబ్రిటీ కపుల్స్‌లో నయనతార, స్టార్ డైరెక్టర్ విఘ్నేష్‌శివన్ ఒకరు. రీసెంట్‌గా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వీరిద్దరూ తమ పరిచయాన్ని గుర్తుచేసుకున్నారు.

"2015లో మొదటిసారి 'నేనూ రౌడీ నే' చిత్రం ద్వారా మేమిద్దరం కలుసుకున్నాం. మా కలయికకు కారణం ధనుశ్. 'నేనూ రౌడీ నే' చిత్రానికి హీరోయిన్‌గా నయనతార అయితే పర్ఫెక్ట్‌గా ఉంటుందని ఈ సినిమా నిర్మాత, నటుడు ధనుశ్ చెప్పారు. దాంతో నేను ఈ స్టోరీని ఆమెకు నెరేట్ చేశాను. కథ నచ్చి ఆమె వెంటనే ఈ సినిమాకు అంగీకరించారు. ఈ సినిమా షూటింగ్‌లోనే మా పరిచయానికి బీజం పడింది" అని విఘ్నేష్ తెలిపారు. "విఘ్నేష్‌తో పరిచయం కొద్దికాలంలోనే ధృడమైన బంధంగా మారింది. అత్యంత సహజంగా మా మధ్య ప్రేమ చిగురించి అది పెళ్లికి దారితీసింది" అని నయనతార చెప్పారు. వీరిద్దరూ 2022లో వివాహబంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే.





పురాణ పాత్రలకు సై

రెగ్యులర్ పాత్రల్లో ఎంత రాణించినా, స్టార్‌డమ్ సంపాదించినా చారిత్రక, జానపద, పౌరాణిక చిత్రాల్లో నటించాలనే కోరిక కొంతమంది హీరోల్లో ఉందనే చెప్పాలి. కానీ పురాణాలు, ఇతిహాసాలు ఆధారంగా తెరకెక్కే చిత్రాలు ఈ రోజుల్లో చాలా తక్కువే. అందుకే అలాంటి అవకాశం వస్తే కథానాయకులు కళ్లకద్దుకుంటున్నారు. రొటీన్ హీరో పాత్రలకు భిన్నంగా ఉండడం, తమలోని నటుణ్ణి విభిన్నంగా ఆవిష్కరించుకునే అవకాశం కావడంతో పురాణ పాత్రలకు పలు పరిశ్రమలకు చెందిన అగ్రహీరోలు సైతం సై అంటున్నారు.

లవర్‌బాయ్‌గా పలు ప్రేమకథా చిత్రాల్లో ప్రేక్షకులను అలరించారు రణ్‌బీర్‌కపూర్. ఇటీవలే విడుదలైన 'యానిమల్' చిత్రంలో ఆయన క్రౌర్యాన్ని ప్రదర్శించిన తీరు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. తనలోని నటుడికి సవాల్ విసిరే పాత్రతో ఈసారి ఆయన ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. హిందువుల ఆరాధ్యదైవం శ్రీరాముని పాత్రలో రణ్‌బీర్ కనిపించబోతున్నారు. ఇప్పటికే ఆయన శ్రీరాముని పాత్ర కోసం సన్నాహాలు మొదలుపెట్టారు. విల్లు ఎక్కుపెట్టడంలో నైపుణ్యం సాధించేందుకు సాధన కొనసాగిస్తున్నారు. తన కెరీర్‌లో ఇప్పటిదాకా ఎలాంటి పాత్ర చేసినా నటనలో వంకలు పెట్టడానికి వీల్లేని నటుడిగా రణ్‌బీర్‌కు పేరుంది. ఇక ఇప్పుడు శ్రీరాముని పాత్రనూ ఆయన అద్భుతంగా పండించగలరనడంలో ఎలాంటి సందేహం లేదు అంటున్నారు అభిమానులు. రాముని పాత్రకోసం తన అలవాట్లు మార్చుకున్నారు రణ్‌బీర్. మద్యం, మాంసాహారాన్ని మానేసినట్లు చెప్పారు. నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. ఇక ఇదే చిత్రంలో రావణుని పాత్రకు హీరో యశ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. హీరోగా ఆయన ఫాలోయింగ్ పీక్స్‌లో ఉంది. మరి ఇలాంటప్పుడు ఆయన నెగెటివ్ రోల్ చేసేందుకు ముందుకొస్తారా అనేది డౌటే. కొద్ది రోజుల్లో ఈ విషయంపై క్లారిటీ వస్తుంది. ఇక ఈ చిత్రంలో సాయిపల్లవి సీత పాత్ర కోసం ఖరారయినట్టే అని బాలీవుడ్ టాక్.

పరమ శివునిగా ప్రభాస్

'సలార్' చిత్రంతో భారీ విజయాన్ని దక్కించుకున్నారు ప్రభాస్. త్వరలోనే ఈ చిత్రం సీక్వెల్‌తో అలరించనున్నారు. ఇలాంటి యాక్షన్ రోల్స్ కాదు ఇప్పుడున్న చాలా మంది యువ హీరోల్లో పురాణ పాత్రల్లో నటించే అరుదైన అవకాశమూ ప్రభాస్‌కే దక్కిందని చెప్పాలి. 'ఆదిపురుష్' చిత్రంలో ఆయన శ్రీరాముని పాత్రలో నటించి మెప్పించారు. సినిమాపైన ఎన్ని విమర్శలు వచ్చినా శ్రీరాముడిగా పాత్రలో ఒదిగిపోయి శభాష్ అనిపించుకున్నారు. ఇప్పుడు మరోసారి ఆయన దేవుని పాత్రలో కనిపించనున్నారు. మంచు విష్ణు నటిస్తున్న 'కన్నప్ప' చిత్రంలో ప్రభాస్ పరమశివుని పాత్రలో నటిస్తున్నారు. గతంలో ఎన్టీఆర్, చిరంజీవి మహాశివుడి పాత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే నటన ప్రదర్శించారు. ఇప్పుడు ఇక ప్రభాస్ వంతు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'కల్కి 2898 ఏడీ' చిత్రం మహాభారత యుద్ధంతో మొదలై కల్కి రాకతో ముగుస్తుంది. అంటే ఈ రెండు అంశాలూ పురాణ సంబంధమైనవే. ఆ నేపథ్యంలో వచ్చే సన్నివేశాల్లో ప్రభాస్ కృష్ణుడిగా, కల్కిగా కనిపించనున్నారనే మాట వినిపిస్తోంది.

ఇద్దరు కర్ణులు

ప్రస్తుతం 'కంగువ' చిత్రం పనులతో బిజీగా ఉన్నారు సూర్య. మాస్ హీరోగానూ, అభినయ ఆస్కారమున్న కథానాయక పాత్రల్లోనూ సూర్య తనదైన అభినయంతో ఆకట్టుకున్నారు. మహాభారతం ఆధారంగా రూపుదిద్దుకుంటున్న ఓ చిత్రానికి ఆయన ఎస్ చెప్పారని కోలీవుడ్ టాక్. ఈ చిత్రంలో ఆయన కర్ణుడిగా అలరించనున్నారు. బాలీవుడ్ దర్శకుడు రాకేశ్ ఓం ప్రకాశ్ మెహ్రా కర్ణుడి పాత్ర ప్రధానంగా తీసుకొని ఓ సినిమాను తెరకెక్కిస్తున్నారు. 'కంగువ' పూర్తవ్వగానే సూర్య ఈ సినిమాను పట్టాలెక్కించే అవకాశముంది. ఈ చిత్రంలో సూర్యకు జోడీగా జాన్వీకపూర్ నటించనున్నారని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.

చారిత్రక నేపథ్యంలో సాగే కాల్పనిక గాథగా తెరకెక్కిన 'పొన్నియిన్ సెల్వన్' చిత్రంలో కరికాల చోళుడిగా విక్రమ్ రౌద్ర రసాన్ని ఒలికించిన తీరు ప్రేక్షకులు మరువలేరు. ఇప్పుడు మరోసారి ఆయన యుద్ధభూమిలో గర్జించేందుకు సిద్ధమవుతున్నారు. కర్ణుడి పాత్రలో విక్రమ్ కనువిందు చేయనున్నారు. ఈ చిత్రానికి ఆర్ ఎస్ విమల్ దర్శకుడు. 'సూర్యపుత్ర కర్ణ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 2017లోనే మేకర్స్ ఈ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. కానీ సెట్స్‌పైకి వెళ్లలేదు. ఈ ఏడాది ఈ చిత్రం షూటింగ్ మొదలుపెట్టబోతున్నట్లు దర్శకుడు ప్రకటించారు. వషు భగ్నానీ, జాకీ భగ్నానీ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

అశ్వత్థామగా షాహిద్ కపూర్

షాహిద్ కపూర్ కథానాయకుడిగా ఆగిపోయిన 'అశ్వత్థామ' ప్రాజెక్ట్ మళ్లీ మొదలైంది. ఇందులో మహాభారత యుద్ధం నేపథ్యంలో కొంత భాగం సాగుతుంది. ఆ పోర్షన్‌లో షాహిద్ కపూర్ అశ్వత్థామగా అలరించనున్నారు.





తగిన సమయం కాదు

'హార్ట్ అటాక్' సినిమాలో హయతి పాత్రతో కుర్రకారును ఆకట్టుకున్నారు అదాశర్మ. ఆ తర్వాత పలు తెలుగు, హిందీ చిత్రాల్లో నటించి.. 'ది కేరళ స్టోరీ' సినిమాతో సంచలన విజయం అందుకున్నారీ నటి. గతేడాది ఈ నటి, దివంగత నటుడు సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ ఇంటి వద్ద కనిపించారు. అప్పటి నుంచి ఆమె ఈ ఇంటిని కొనుగోలు చేశారని ఊహాగానాలు వినపడుతున్నాయి. తాజాగా మీడియాతో జరిపిన ఓ సంభాషణలో ఆమె ఈ విషయంపై క్లారిటీ ఇచ్చారు. "ప్రస్తుతం నేను ప్రేక్షకుల గుండెల్లో నివసిస్తున్నా. కాబట్టి నేను ఏ ఇంటినీ కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు. అయినా ఈ విషయంపై మాట్లాడేందుకు తగిన సమయం ఇది కాదు. నేను ఈ ఇంటిని చూడటానికి వచ్చినప్పుడు మీడియా దృష్టంతా ఇక్కడే ఉంది. నేను వ్యక్తిగత స్వేచ్ఛను ఇష్టపడతాను. నా సినిమాలు పబ్లిక్ దృష్టిని ఆకర్షించాలని కోరుకుంటా, నా వ్యక్తిగత విషయాలు కాదు. సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ మంచి నటుడు, ఆయనపై అపారమైన గౌరవం ఉంది. ఆయన ఉన్నంత కాలం మంచి సినిమాలతో అందరినీ అలరించారు. ఆయన ప్రస్తుతం ఈ భూమ్మీద లేరు. అలాంటి వ్యక్తి ఇంటి గురించి వార్తలు ప్రచారం అవ్వడం బాధాకరం" అని చెప్పారు.



ఆ క్షణం చాలా ఆందోళన చెందాను


'పుష్ప', 'యానిమల్' వంటి పాన్‌ఇండియా చిత్రాలతో బాలీవుడ్‌లోనూ మంచి ఫాలోయింగ్‌ను తెచ్చుకున్నారు రష్మిక మందన్న. ప్రస్తుతం ఆమె నటిస్తున్న బాలీవుడ్ చిత్రం 'ఛావా'. ఈ చిత్రం ఛత్రపతి శివాజీ కుమారుడు ఛత్రపతి శంభాజీ మహరాజ్ బయోపిక్‌గా తెరకెక్కుతోంది. టైటిల్ రోల్‌లో విక్కీ కౌశల్ నటిస్తున్నారు. తాజాగా ఓ బాలీవుడ్ టాక్ షోలో ఈ చిత్రం గురించి, సహనటుడు విక్కీకౌశల్ గురించి పలు విశేషాలను ఆమె పంచుకున్నారు.

"ఛావా' చిత్రబృందంతో కలసి పనిచేయడం మరిచిపోలేని అనుభూతి. ఈ చిత్రంలో నా పాత్ర తాలూకు షూటింగ్ అయిపోయింది. నా షూటింగ్ సమయం ఇంకొన్ని రోజులు ఉంటే బాగుండనిపిస్తోంది. ఈ చిత్రం షూటింగ్ విశేషాల గురించి నేను తరచూ డైరెక్టర్ లక్ష్మణ్ ఉటేకర్‌తో మాట్లాడుతుంటాను. ఈ షూటింగ్ సమయంలో విక్కీకౌశల్ గాయపడడం నన్ను ఎంతో ఆందోళనకు గురిచేసింది. ఆయన కోలుకోగానే మనసు కుదుటపడింది. ఈ చిత్రం షూటింగ్‌లో విక్కీ నాకు ఎంతో సపోర్ట్ చేశారు, ఆయన బంగారం లాంటి వ్యక్తి' అని రష్మిక చెప్పారు.

బర్త్‌డే విషెస్

శుక్రవారం తన పుట్టినరోజును రష్మిక గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకున్నారు.పలువురు నటులు, అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. 'ఛావా' కోస్టార్ విక్కీకౌశల్ ఆమెకు ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో శుభాకాంక్షలు తెలిపారు. "ప్రియమైన రష్మికకు పుట్టినరోజు శుభాకాంక్షలు. నీతో కలసి స్క్రీన్ షేర్ చేసుకోవడం ఎంతో ఆనందాన్నిచ్చే విషయం. నువ్వెప్పుడూ ఇంతే పాజిటివ్‌గా, ఎనర్జిటిక్‌గా ఉండాలి" అని విష్ చేశారు.

మనిద్దరం కదా తోడు దొంగలం



నేషనల్ ఆర్ట్ థియేటర్స్ పేరుతో చిత్ర నిర్మాణ సంస్థను నెలకొల్పి ఎన్టీఆర్ నిర్మించిన తొలి సినిమా 'పిచ్చి పుల్లయ్య'. తన రూమ్మేట్, విజయా సంస్థలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసే తాతినేని ప్రకాశరావును ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం చేశారు ఎన్టీఆర్. ప్రకాశరావు, ఎస్వీ రంగారావు మంచి మిత్రులు. ఆయన్ని దృష్టిలో పెట్టుకుని సినిమాలో ఓ పాత్ర క్రియేట్ చేశారు ప్రకాశరావు. అయితే ఆ పాత్రకు గుమ్మడిని తీసుకున్నారు ఎన్టీఆర్. షూటింగ్‌లో ప్రతి షాట్ హావభావాలతో చేసి చూపించడం ప్రకాశరావు పద్ధతి. ఆయన దృష్టిలో రంగారావు ఉండడంతో ఎస్వీఆర్ మేనరిజమ్స్, ఎక్స్‌ప్రెషన్స్ చేసి చూపించి గుమ్మడిని అలాగే చేయమన్నారు ప్రకాశరావు. ఈ సినిమా విడుదల అయ్యాక రంగారావుని ఇమిటేట్ చేశారనే విమర్శలు వినిపించాయి.

ఈ సినిమా పెద్దగా ఆడకపోయినా వెంటనే 'తోడు దొంగలు' చిత్రాన్ని నిర్మించారు ఎన్టీఆర్. ఇందులో తన పాత్రతో సమానమైన కేరెక్టర్‌ను గుమ్మడికి ఇచ్చి ప్రోత్సహించారు ఎన్టీఆర్. 'తోడు దొంగలు' చిత్రం తొలి కాపీ వచ్చిన తర్వాత అక్కినేని నాగేశ్వరరావుకి ప్రత్యేకంగా ప్రీవ్యూ వేసి చూపించారు రామారావు.

ఆ మర్నాడు ఎన్టీఆర్, ఏయన్నార్ ఎన్.ఎ.టి ఆఫీసులో కలిశారు. ఆ సమయంలో గుమ్మడి కూడా అక్కడే ఉన్నారు. 'ఎలా ఉంది బ్రదర్ పిక్చర్?' అని అడిగారు ఎన్టీఆర్. 'చాలా బాగుంది బ్రదర్.. కానీ గుమ్మడిగారు ఈ వేషం వేయకూడదు' అన్నారు అక్కినేని. 'అదేమిటి బ్రదర్.. వెంకటేశ్వరరావుగారు బాగా చేశారు కదా.. అలా అంటారేమిటి?' అని అడిగారు ఎన్టీఆర్. 'నిజమే.. ఆయన బాగా చేశారు కానీ.. ప్రజల దృష్టిలో, పరిశ్రమ వర్గాల దృష్టిలో తోడు దొంగలు అంటే మనిద్దరమే కదా' అని అక్కినేని జోక్ చేయగానే ఎన్టీఆర్ పకపకా నవ్వేశారు. యోగానంద్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'తోడు దొంగలు' చిత్రం 1954లో విడుదల అయింది. సినిమా ఫ్లాప్ అయినా ఉత్తమ తెలుగు చిత్రంగా జాతీయ స్థాయిలో ప్రశంసా పత్రం పొందింది.

మేమేం సీక్రెట్‌గా ఎంగేజ్‌మెంట్ చేసుకోలేదు

నటుడు సిద్ధార్థ్, అదితిరావు హైదరీ ఇటీవలే ఎంగేజ్‌మెంట్ చేసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ అవార్డ్ ఫంక్షన్‌లో పాల్గొన్న సిద్ధార్థ్.. తన నిశ్చితార్థం గుట్టు చప్పుడు కాకుండా జరిగింది అని వస్తోన్న ప్రచారాలపై స్పందించారు. "మా ఎంగేజ్‌మెంట్ గురించి చాలా మంది వివిధ రకాలుగా మాట్లాడుకుంటున్నారు. అంతా అనుకున్నట్లు మేమేం రహస్యంగా ఎంగేజ్‌మెంట్ చేసుకోలేదు. మా బంధుమిత్రుల సమక్షంలో ప్రైవేట్‌గా ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాం. రహస్యంగా చేసుకోవడానికి, ప్రైవేట్‌గా చేసుకోవడానికి చాలా తేడా ఉంది. అది అందరూ గమనించాలి" అని చెప్పారు. నటుడు సిద్ధార్థ్, అదితిరావు హైదరీల నిశ్చితార్థం వనపర్తి జిల్లాలోని రంగనాథ స్వామి ఆలయంలో మార్చి 27న జరిగిన సంగతి తెలిసిందే.





ఓటీటీ స్పెషల్

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

సినిమా/సిరీస్		విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్...		
అన్‌లాక్డ్	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 10
వాట్ జెన్నిఫర్ డిడ్	ఆంగ్ల చిత్రం	ఏప్రిల్ 10
బేబీ రెయిన్‌డీర్	హాలీవుడ్ మూవీ	ఏప్రిల్ 11
హార్ట్‌బ్రేక్ హై	వెబ్‌సిరీస్ 2	ఏప్రిల్ 11
అమర్‌సింగ్ చమ్కీలా	హిందీ చిత్రం	ఏప్రిల్ 12
అమెజాన్ ప్రైమ్		
ఫాలౌట్	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 12
జీ 5		
గామి	తెలుగు చిత్రం	ఏప్రిల్ 12
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
బ్లడ్ ఫ్రీ	కొరియన్ సిరీస్	ఏప్రిల్ 10
ప్రేమలు	మలయాళ చిత్రం	ఏప్రిల్ 12
ది గ్రేటెస్ట్ హిట్స్	హాలీవుడ్ మూవీ	ఏప్రిల్ 12
సోనీ లివ్		
అదృశ్యం	హిందీ సిరీస్	ఏప్రిల్ 11
ఆహా...		
కార్తీక	తెలుగు చిత్రం	ఏప్రిల్ 09
లయన్స్ గేట్ ప్లే		
హైటౌన్	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 12
సన్ నెక్ట్స్		
లాల్ సలామ్	తమిళ చిత్రం	ఏప్రిల్ 12





ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● ఆదివారం 7 ఏప్రిల్ 2024

నేషనల్ లా వర్సిటీలో మాస్టర్స్ ప్రోగ్రామ్‌లు

న్యూఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ(ఎన్ఎల్‌యూ)- ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో నిర్వహిస్తున్న మాస్టర్స్, ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఈ ప్రోగ్రామ్‌లను వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్(డబ్ల్యూఐపీఓ), కంట్రోలర్ జనరల్ ఆఫ్ పేటెంట్స్-డిజైన్స్-ట్రేడ్ మార్క్స్(సీజీపీడీటీఎం-ఇండియన్ ఐపీ ఆఫీస్)ల సహకారంతో సంస్థ నిర్వహిస్తోంది. వీటికి విదేశీ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ 2024 ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

కోర్సులు
- మాస్టర్స్ ఆఫ్ ఆర్ట్స్(ఎంఏ) ఇన్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్
- మాస్టర్ ఆఫ్ లా(ఎల్ఎల్ఎం) ఇన్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్

సీట్ల వివరాలు
- ఒక్కో ప్రోగ్రామ్‌లో 40 సీట్లు ఉన్నాయి. భారత అభ్యర్థులకు 25 సీట్లు, విదేశీ అభ్యర్థులకు 10 సీట్లు, సీజీపీడీటీఎం ఉద్యోగులకు 5 సీట్లు ప్రత్యేకించారు.

అర్హత: ఎంఏ ప్రోగ్రామ్‌నకు ఏదేని డిగ్రీ పూర్తిచేసిన తరవాత సంబంధిత సబ్జెక్టులతో మరో డిగ్రీ ఉత్తీర్ణులు, ఇంటర్ తరవాత సంబంధిత విభాగంలో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీ పూర్తిచేసినవారు, ఏదేని స్పెషలైజేషన్‌తో పీజీ పూర్తి చేసిన వారు, నాలుగేళ్ల బ్యాచిలర్స్ ప్రోగామ్(ఆనర్స్/రీసెర్చ్) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్‌నకు ఎల్ఎల్‌బీ/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.
- డిగ్రీ/పీజీ స్థాయిలో జనరల్ అభ్యర్థులకు కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు.

ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్: ఎంఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో ఇంగ్లీష్, అనలిటికల్ అండ్ లాజికల్ రీజనింగ్, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్(నాన్ లీగల్) అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.
- ఎల్ఎల్ఎం ప్రవేశ పరీక్షలో ఇంగ్లీష్, లాజికల్ రీజనింగ్, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.



- అన్నీ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఈ పరీక్షలో సాధించిన స్కోర్ ఆధారంగా సీట్ల సంఖ్యకు రెండు రెట్లమందిని ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఎంట్రెన్స్ టెస్ట్ స్కోర్‌కు 70 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 15 శాతం, దరఖాస్తుతోపాటు సబ్మిట్ చేసిన రిటెన్ పర్సనల్ స్టేట్‌మెంట్స్‌కు 15 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.4000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2000; విదేశీ విద్యార్థులకు రూ.5,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 3
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూన్ 13 నుంచి
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ 2024 తేదీ:** జూన్ 23
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 16 నుంచి
- **వెబ్‌సైట్:** nludelhi.ac.in, https://nationallawuniversity-delhi.in

నిట్ జలంధర్‌లో ఎంబీఏ

జలంధర్‌లోని డా.బీఆర్ అంబేద్కర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్‌జే)కి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ మేనేజ్‌మెంట్- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో 38 రెగ్యులర్ సీట్లు ఉన్నాయి. ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవచ్చు.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. అభ్యర్థులకు క్యాట్/సీమ్యాట్/మ్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: జాతీయ పరీక్ష స్కోర్, అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. జాతీయ పరీక్ష స్కోర్‌నకు 70 శాతం, గ్రూప్ డిస్కషన్‌కు 15 శాతం, ఇంటర్వ్యూకి 15 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 20
- **జీడీ&పీఐకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మే 22
- **గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు:** మే 25
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** మే 25
- **కౌన్సెలింగ్ తేదీ:** మే 26
- **ఈ మెయిల్:** mbaadmission2024@nitj.ac.in
- **వెబ్‌సైట్:** www.nitj.ac.in

ఎడ్యుకేషనల్ ప్లానింగ్‌లో పీహెచ్‌డీ

కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్ఐఈపీఏ-న్యూఢిల్లీ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తిచేయాలి. పార్ట్ టైమ్ అభ్యర్థులు అడ్మిషన్ పొందిన నాటి నుంచి కనీసం మూడేళ్ల తరవాతనే థీసిస్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. యూజీసీ నెట్, జేఆర్ఎఫ్ అర్హత ఉన్న ఫుల్ టైం అభ్యర్థులకు సంస్థ ఫెలోషిప్స్ ఇస్తుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్సు వర్క్, థీసిస్ వర్క్ ఉంటాయి. మొత్తం 25 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు: ఎడ్యుకేషనల్ పాలసీ, ఎడ్యుకేషనల్ ప్లానింగ్, ఎడ్యుకేషనల్ అడ్మినిస్ట్రేషన్, ఎడ్యుకేషనల్ ఫైనాన్స్.

పరిశోధనాంశాలు
- ఎడ్యుకేషనల్ పాలసీ అండ్ ఇంప్లిమెంటేషన్
- గవర్నెన్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఇన్ ఎడ్యుకేషన్
- మల్టీ-డిసిప్లినరీ పర్‌స్పెక్టివ్స్ టు ఎడ్యుకేషన్
- టీచర్ మేనేజ్‌మెంట్ అండ్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్
- లీడర్‌షిప్ ఇన్ స్కూల్ అండ్ హయ్యర్ ఎడ్యుకేషన్
- ఈక్విటీ, డైవర్సిటీ, ఇన్‌క్లూజన్ ఇన్ ఎడ్యుకేషన్
- ఫైనాన్సింగ్ ఆఫ్ ఎడ్యుకేషన్

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సోషల్ సైన్సెస్ లేదా సంబంధిత విభాగాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారు; బీఈ/బీటెక్ తరవాత పీజీ(సోషల్ సైన్సెస్) మొదటి ఏడాది ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. రిజర్వుడు వర్గాల అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు. పార్ట్ టైం కోర్సులో చేరేవారు పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, ఏడాది లీవ్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి. అభ్యర్థులందరూ ఎంచుకున్న స్పెషలైజేషన్‌కు సంబంధించి 1000 - 1500 పదాలతో స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్(ఎస్ఓపీ)ను అప్‌లోడ్ చేయాలి.

ఎంపిక: అకడమిక్ ప్రతిభ, అనుభవం ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో రీసెర్చ్ మెథడాలజీ, సోషల్ సైన్స్ సంబంధిత సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఈ పరీక్షలో అర్హత పొందినవారికి మెరిట్ ప్రకారం పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఎంట్రెన్స్ టెస్ట్ స్కోర్‌కు 70 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 15
- **ఎంట్రెన్స్ టెస్ట్:** జూన్ 8
- **ఇంటర్వ్యూలు:** జూన్ 13, 14
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 20
- **అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** జూలై 3, 4
- **ప్రోగ్రామ్స్ ప్రారంభం:** జూలై 15 నుంచి
- వెబ్‌సైట్: www.niepa.ac.in



చిన్నారి కథ

నిరుద్యోగి



పూర్వం ఒక ఊరిలో ఒక ధనవంతుడు ఉండేవాడు. పేరు తాతాజీ. పెద్ద జమీందారు. అతని పొలం, ఇల్లు.. అన్నీ దర్పాన్ని సూచించేవి. ధనం ఎప్పుడూ అతని ఇంట్లో కొలువుండేది. అందుకే అతని ఇంట్లో లక్ష్మీదేవి కొలువై ఉంటుంది అనేవాళ్లు ఆ గ్రామ ప్రజలు. విషయం ఏంటంటే తాతాజీ మంచి వాడు. ధనికుడైనా ఇతరుల పట్ల కటువుగా మాత్రం ఉండేవాడు కాదు. అతనిలో మానవీయకోణం ఉండేది. దాన, ధర్మాలకు పెట్టింది పేరు.

పక్క ఊరిలో ఉండే ఓ యువకుడు ఆ విషయం తెలుసుకున్నాడు. మరుసటి రోజు వెంటనే ధనవంతుడి ముందు ప్రత్యక్షమయ్యాడు. 'అయ్యా.. నేను నిరుద్యోగిని. చదువుకున్నా. దీంతో ఏ పని కూడా అబ్బలేదు. నా చెల్లి, మా అమ్మను నేను చూసుకోవాలి. దయచేసి ఉద్యోగం ఇప్పించండి' అంటూ వేడుకున్నాడు. జమీందారు కాళ్లు పట్టుకోబోయాడు ఆ యువకుడు. దీంతో జమీందారు ఇలా అన్నాడు.. 'నీకు నేను ఉద్యోగం ఇవ్వలేను. ఇక్కడ పనులు చేసేవారు ఉన్నారు. వాళ్లు వెళ్లిపోతే చూద్దాం. అందాకా నీకు నేను సాయం చేస్తా' అన్నాడు. ఇంట్లోకి వెళ్లి రెండు రూపాయలు తెచ్చి ఇచ్చాడు. ఆ యువకుడు సంబరపడ్డాడు. ఇంటికి వేగంగా వెళ్లిపోయాడు.

ప్రతి రోజూ జమీందారు దగ్గరకు వచ్చి ఆ పేదవాడు తన రెండు రూపాయలు తీసుకుని వెళ్లాడు. అది కూడా సాయంత్రం పూట వచ్చి తీసుకెళ్లేవాడు. ఆ తర్వాత పదిరోజులు ఆ జమీందారు దగ్గరకు రాలేదతను. 'జబ్బు చేసిందో ఏమో.. లేకుంటే ఉద్యోగం వచ్చిందేమో' అనుకున్నాడు మనసులో జమీందారు. పదకొండో రోజు వచ్చాడు ఆ యువకుడు. ఇన్నాళ్లూ ఎక్కడికి వెళ్లావు? అని ప్రశ్నించాడు. 'నేను పది రోజులు రాలేదు కదా. ఆ పదిరోజుల డబ్బులు ఇప్పించండి' అని అడిగాడు ఆ యువకుడు. నా ప్రశ్నకు సమాధానం చెప్పు? అన్నాడు ఆ జమీందారు. 'మైలు దూరం నడిచి ఈ రెండు రూపాయలు తీసుకోవటం ఎందుకు? ఒకేసారి తీసుకుంటే మంచిది కదా?' అన్నాడు ఆ యువకుడు.


'మైలు దూరం కూడా నడవలేని నువ్వు నా ఇంట్లో ఏం పని చేస్తావులే?'. నా ఇంట్లో ఉద్యోగం ఉన్నా నీకు ఇవ్వలేను. నీ ముఖం చూపించకంటూ గట్టిగా అరిచాడు. ఆ ఇంట్లోని సేవకులు ఆ నిరుద్యోగిని వెళ్లగొట్టారు.

10 తేడాలు గుర్తించండి





సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 275

		2		7				3
4	5			1	8		9	
			6					
		4					7	9
			7		5			
1	7					5		
					1			
	1		9	4			6	7
9				8		4		

సుడోకు - 274 సమాధానం

9	8	7	4	2	6	3	1	5
1	6	3	5	8	7	9	4	2
5	2	4	1	3	9	6	8	7
7	5	1	3	9	4	2	6	8
2	9	6	7	1	8	4	5	3
3	4	8	2	6	5	7	9	1
8	7	5	6	4	2	1	3	9
4	3	9	8	7	1	5	2	6
6	1	2	9	5	3	8	7	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.



రైట్స్‌లో క్వాలిటీ ఇంజనీర్లు

గుర్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్(రైట్స్ లిమిటెడ్)...ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

పోస్టు: క్వాలిటీ ఇంజనీర్(సైట్ ఇన్‌చార్జ్) **ఖాళీలు:** 4
అర్హత: డిప్లొమా(సివిల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 45 సంవత్సరాలు మించకూడదు
ఇంటర్వ్యూ తేదీలు: ఏప్రిల్ 15, 16
ప్రదేశం: రైట్స్ లిమిటెడ్, శిఖర్, ప్లాట్ నెం.1, సెక్టార్-29, గుర్‌గావ్. లేదా రైట్స్ ఆఫీస్, 741/742, 4వ ఫ్లోర్, టవర్ నెం. 3, 7 సెక్టార్-30ఎ, ఇంటర్నేషనల్ ఇన్ఫోటెక్ పార్క్, వాషి రైల్వే స్టేషన్ కాంప్లెక్స్, నవీ ముంబయి.
వెబ్‌సైట్: https://www.rites.com/Career

నవోదయ విద్యాలయాల్లో నాన్ టీచింగ్ పోస్టులు

ఖాళీలు: 1377

నోయిడాలోని నవోదయ విద్యాలయ సమితి... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎన్‌వీఎస్ ప్రధాన కార్యాలయంతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ఎన్‌వీఎస్ ప్రాంతీయ కార్యాలయాలు, ఎన్ఎల్ఐలు, జవహర్ నవోదయ విద్యాలయాల్లో నాన్ టీచింగ్ పోస్టులను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తారు.

అర్హత: పోస్టును అనుసరించి 10వ తరగతి, 12వ తరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా, బ్యాచిలర్స్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
ఎంపిక విధానం: రాత పరీక్ష, ట్రేడ్/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, కాకినాడ, నెల్లూరు, గుంటూరు, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్.
దరఖాస్తు విధానం: కేంద్రీయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తు రుసుము: ఫిమేల్ స్టాఫ్ నర్స్ పోస్టులకు జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1500; ఇతర పోస్టులకు రూ.1000. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు రూ.500.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 30
దరఖాస్తు సవరణ తేదీలు: మే 2 నుంచి 4 వరకు
వెబ్‌సైట్: navodaya.gov.in/nvs/en/Home1

అలిమ్‌కోలో వివిధ ఖాళీలు

ఖాళీలు: 142

కాన్పూర్‌లోని ఆర్టిఫీషియల్ లింబ్స్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా... కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. సీనియర్ కన్సల్టెంట్: 1 పోస్టు
2. మేనేజర్: 1 పోస్టు
3. డిప్యూటీ మేనేజర్: 1 పోస్టు
4. అసిస్టెంట్ మేనేజర్: 4 పోస్టులు
5. జూనియర్ మేనేజర్: 17 పోస్టులు
6. ఆడియాలజిస్ట్: 50 పోస్టులు
7. ప్రొస్థెటిక్స్ అండ్ ఆర్థోటిక్స్: 47 పోస్టులు
8. స్పెషల్ ఎడ్యుకేటర్: 5 పోస్టులు
9. క్లినికల్ సైకాలజిస్ట్: 5 పోస్టులు
10. ఆప్టోమెట్రిస్ట్: 5 పోస్టులు
11. సీఎస్ఆర్ కన్సల్టెంట్: 1 పోస్టు
12. క్యూసీ అసిస్టెంట్: 4 పోస్టులు
13. ఫైనాన్స్ అసిస్టెంట్: 1 పోస్టు

అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, పీజీ, బీఈడీ/ఎంఈడీ, ఎంఫిల్, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సు, సీఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: ఆడియాలజిస్ట్, ప్రొస్థెటిక్స్ అండ్ ఆర్థోటిక్స్, స్పెషల్ ఎడ్యుకేటర్, క్లినికల్ సైకాలజిస్ట్, ఆప్టోమెట్రిస్ట్, సీఎస్ఆర్ కన్సల్టెంట్ పోస్టులకు 40 ఏళ్లు; క్యూసీ అసిస్టెంట్, ఫైనాన్స్ అసిస్టెంట్, జూనియర్ మేనేజర్ పోస్టులకు 45 ఏళ్లు, మేనేజర్, డిప్యూటీ మేనేజర్ పోస్టులకు 50 ఏళ్లు; సీనియర్ కన్సల్టెంట్‌కు 62 ఏళ్లు మించకూడదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 16
వెబ్‌సైట్: https://alimco.in/content/7_1-_Careers

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో ప్రాజెక్ట్ ఆఫీసర్స్

కేరళలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్... కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం పోస్టులు: 7

1. సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్(మెకానికల్): 4 పోస్టులు
2. సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్(ఎలక్ట్రికల్): 2 పోస్టులు
3. సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్(ఇన్‌స్ట్రుమెంటేషన్): 1 పోస్టులు

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో మెకానికల్/ఎలక్ట్రికల్/ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణత. షిప్ బిల్డింగ్/షిప్ రిపేర్/మెరైన్ రిపేర్/ఇంజనీరింగ్/ప్రభుత్వ కంపెనీల్లో కనీసం నాలుగేళ్ల పని అనుభవం ఉండాలి.
జీతం: నెలకు రూ.47,000 - రూ.50,000
వయోపరిమితి: 35 ఏళ్లు మించరాదు
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ, పని అనుభవం తదితరాల ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు: రూ.400. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 12
వెబ్‌సైట్: https://cochinshipyard.in/

ఎన్ఎల్‌సీలో ఇండస్ట్రియల్ ట్రెయినీలు

ఖాళీలు: 239

నైవేలీ(తమిళనాడు)లోని నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. ఇండస్ట్రియల్ ట్రెయినీ/ఎస్ఎంఈ అండ్ టెక్నికల్(ఓఅండ్ఎం): 100 పోస్టులు
2. ఇండస్ట్రియల్ ట్రెయినీ(మైన్స్ అండ్ సపోర్ట్ సర్వీసెస్): 139 పోస్టులు

అర్హత: పదో తరగతి, ఐటీఐ, సంబంధిత ట్రేడ్‌లో డిప్లొమా
గరిష్ఠ వయోపరిమితి: యూఆర్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 37 ఏళ్లు; ఓబీసీ అభ్యర్థులు 40 ఏళ్లు, ఎస్టీ/ఎస్సీ అభ్యర్థులు 42 సంవత్సరాలు మించకూడదు.
స్టయిపెండ్: నెలకు ఇండస్ట్రియల్ ట్రెయినీ/ఎస్ఎంఈ అండ్ టెక్నికల్(ఒఅండ్ఎం) అభ్యర్థులకు రూ.18,000 - రూ.22,000. ఇండస్ట్రియల్ ట్రెయినీ(మైన్స్ అండ్ సపోర్ట్ సర్వీసెస్) అభ్యర్థులకు రూ.14,000 - రూ.18,000.
ఎంపిక: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: ఏప్రిల్ 19
వెబ్‌సైట్: https://www.nlcindia.in